# ఆంధ్రపత్రిక

## సచిత్ర వార పత్రిక



10-7-57

25 నయాపైసలు

**ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY**



హంససందేశం

చిత్రకారుడు: ఎ. ఎస్. నటరాజన్—మద్రాస



పుష్పమువలె...
రెక్సోనాతో మీ చర్మ
సౌందర్యము వికసించును
రెక్సోనా సబ్బులో, కేడిల్...చర్మమును పోషించు
నటువంటియు మీ సహజ సౌందర్యమును బయల్పరచు
టకు సహకరించునటువంటియు ఒక ప్రత్యేక నూనెల
మిశ్రమము గలదు
Rexona
BLENDED WITH CADYL
ఇది ఒక్కటే కేడిల్‌తోగూడిన సబ్బు
రెక్సోనా ప్రొప్రయిటరీ లిమిటెడ్ వారిచే భారతదేశంలో తయారుచేయబడినది


*

సంవత్సర చందా
రు. 13-0-0
విడిప్రతి 25 న.పై

# ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక
Founder : K. NAGESWARA RAO

సంపుటము 51
సంచిక 45
10-7-57

హేవిళంబి ఆషాఢ శుద్ధ చతుర్దశి బుధవారం



## విషయానుక్రమణిక

ముఖచిత్రం:

కళ్యాణీ పిక్చర్స్ వారి "అక్క-చెల్లెళ్లు" చిత్రంలో

కృష్ణకుమారి.

★

# భూభౌతిక పరిశోధనలు

భూగోళానికి సంబంధించిన అనేక రహస్యాలను, భూమిమీద ఇతర ఖగోళశక్తుల ప్రభావాన్ని కనుక్కొనే నిమిత్తం సంకల్పించిన "అంతర్జాతీయ భూభౌతిక సంవత్సరం" ఈనెల ఒకటోతేదీన అర్ధరాత్రినుంచీ ప్రారంభమయింది. ఈ సంవత్సరం పరిమితి 18 నెలలు. అంటే 1958 డిసెంబరు నెలాఖరుతో ఆఖరవుతుంది.

ఈ 18 నెలల్లోనూ జరిగే భూభౌతిక పరిశోధనలలో సుమారు 70 దేశాలు పాల్గొంటున్నాయి; 10 వేల మంది శాస్త్రజ్ఞులు పాల్గొంటున్నారు. ఈ పరిశోధనలకి 18 కోట్ల పౌనుల ధనం ఖర్చవుతుంది. భారత దేశం కూడా ఈ పరిశోధనలలో పాల్గొంటోంది. దీని నిమిత్తం ఒకసంఘాన్ని ప్రభుత్వం లోగడనే నియమించింది. దీనికి అధ్యక్షుడు నేషనల్ ఫిజికల్ లాబొరేటరీ డైరెక్టరు డా॥ కె. ఎస్. కృష్ణన్.


భూమికీ, దాని పరిసరాలకూ సంబంధించిన అనేక వైజ్ఞానిక విషయాలను పరిశోధించడం ఈ కార్యక్రమ లక్ష్యం.

జూలై 1 నుంచీ 18 నెలలపాటు సూర్య గోళంలో కల్లోలాలు అధికంగా సంభవిస్తాయనీ, అందుచేత పరిశోధనలకు ఈ కాలం చాలా అనుకూలమైందనీ శాస్త్రజ్ఞులు నిర్ణయించి ఈ "సంవత్సరాన్ని" ఏర్పాటు చేశారు. సూర్యునిలో కల్లోలాలు ఇలా పదకొండేళ్ళ కొకసారి వస్తాయట.

భూభౌతికశాస్త్రం (జియోఫిజిక్స్) అనేది అనేక శాస్త్రాల సమ్మేళనం. ఇందులో ముఖ్యమైనవి ఇవి: వాతావరణ శాస్త్రం; భూగర్భశాస్త్రం; సముద్రగర్భ శాస్త్రం; హిమానీ శాస్త్రం; భూమ్యాకర్షణ శాస్త్రం, ధ్రువాల వద్ద కాంతులు, సూర్యగోళ కల్లోలాలు, విశ్వకిరణాలు, అక్షాంశలు, రేఖాంశలు, రాకెట్లు ఉపగ్రహాలు—ఇవన్నీ కూడా ఈ పరిశోధనల జాబితాలోనే చేరుతాయి. వీటన్నిటిలోకీ ముఖ్యమైనది, కృత్రిమగ్రహాలను అంతరిక్షంలోకి వదిలి, అవి తిరిగే మార్గాన్ని గమనించడం. ఈ పరిశోధనలను చేయడానికి వివిధ దేశాలలో సంఘాలేర్పడ్డాయి. ఈ సంఘాలు కనిపెట్టిన ఫలితాలను సమన్వయపరచడానికి అంతర్జాతీయ శాస్త్రజ్ఞసంఘాల మండలి అని ఒకటి ఉన్నది.

మనదేశంలో ఈ పరిశోధనలలో విశ్వవిద్యాలయాలు, అబ్జర్వేటరీలు, వైజ్ఞానిక పారిశ్రామిక పరిశోధనమండలి, ప్రభుత్వ విద్యాశాఖ, శాస్త్రపరిశోధనశాఖలలోని శాస్త్ర విభాగాలు, సమాచార బ్రాడ్‌కాస్టింగ్ శాఖ, తంతి తపాలాశాఖ, రక్షణ శాఖ ఇవన్నీ పాల్గొంటాయి. శాస్త్ర పరిశోధనల ఫలితాలను ప్రకటించడానికి, నిపుణులకు అందజేయడానికి ప్రభుత్వం భారీఎత్తున ఏర్పాట్లు చేసింది.

భూభౌతిక పరిశోధనల ఫలితంగా విశ్వ రహస్యాలనేకం బయటపడి మానవజాతి కల్యాణానికి ఉపయోగపడగలవు. రాజకీయ రంగంలో ఎన్ని విభేదాలున్నా, వైజ్ఞానిక రంగంలో అమెరికా, రష్యా, బ్రిటన్ భారతదేశం ఇత్యాది అనేక దేశాలు ఒకదానితో ఒకటి సహకరించడం హర్షించతగినది. ఈ సహకారం రాజకీయ, ఆర్థిక సహకారాలకు దారితీయగల నాంది అవుతుందని ఆశిద్దాం. ★



శబ్దగ్రాహక దూరదర్శిని అమెరికాలో వాడుతున్నారు. దీని వ్యాసము ౬౦ అడుగులు. సూర్యుని గమనాన్ని, సూర్యమండలంలో ఉత్పత్తిఅయ్యే రేడియో ధార్మికశక్తిని, శబ్దాలనూ, కల్లోలాలనూ, చూపుతుంది. వాటిసహాయంతో భూమిపై శీతోష్ణస్థితి ఎలా రూపొందుతూ ఉంటుందో తెల్పుతారు.

# ఉప్పు ఉపయోగం

వెంకటకొంక శాస్త్రులవారు భోజనం చేస్తూ కోడలితో "కాస్త లవణం వడ్డించమ్మా" అన్నారట. ఆయన ప్రక్కన కూర్చున్న ఒక అతిథి "లవణం అంటే ఆ చిన్నదాని కేం తెలుస్తుంది? అచ్చ తెనుగులో చెప్పరాదా?" అన్నారట. దానిమీద కోడలికి అభిమానం వేసి "అవధానులుగారి కూతుర్ని, శాస్త్రులుగారి కోడల్ని; లవణం అంటే తెలియదనుకున్నారా?" అని గొడ్ల చావిడిలోకి వెళ్ళి కాస్త గోమయం తీసుకొచ్చి విస్తరిపక్కన వడ్డించిందట.

లవణం అంటే చాలామందికి తెలియక పోవచ్చుగాని, అది లేందే ఎవరికీ నోట్లో ముద్ద దిగదన్నమాట అక్షరాలా నిజం. అచ్చతెలుగులో ఉప్పు అంటే సరిపోయే దానికి లవణమని ఎందుకు పేరొచ్చింది? లవణానికి "అమరకోశ" కారుడు "లునాతి వాతం జాడ్యం వా లవణః" అని అర్థమిచ్చాడు. వాతాన్ని, జాడ్యాన్ని పోగొట్టుతుంది గనక లవణం అనే పేరొచ్చింది. అతి ప్రాచీన కాలంలోనే ఉప్పు ప్రాధాన్యాన్ని మనవారు గ్రహించారు కనకనే దాని పేరుకూడా సార్థకంగా ఉండేట్లు చేశారని దీనివల్ల విదితమవుతుంది.

## ఉప్పు సత్యాగ్రహం

ఇక అతి నవీనకాలానికివస్తే మానవ జీవితంలో ఉప్పుకుగల ప్రాముఖ్యాన్ని గ్రహించి, దానిమీద ఒక బ్రహ్మాండమైన జాతీయోద్యమం నడిపించిన మనీషి గాంధీమహాత్ముడు దాదాపు ముప్ఫయ్యేళ్ళ క్రిందట బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గారెత్తించిన ఉప్పు సత్యాగ్రహం ఇప్పటికీ చాలా మందికి జ్ఞాపకం ఉండిఉంటుంది. ప్రాణావసరమైన పదార్థాల్లో ఉప్పు ఒకటి. దీనిమీద అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం పన్ను వేసింది. ఇది అన్యాయమని తోచి, గాంధీమహాత్ముడు "ఉప్పు తయారుచేయడం మానవుడి జన్మహక్కు" అని చాటారు. ఉప్పు తయారు చేయడంద్వారా శాసనోల్లంఘనం చేయండని ప్రబోధించారు. ఉప్పు సత్యాగ్రహం చేసినంతమాత్రంలో స్వరాజ్యం వచ్చేస్తుందా అని కొందరారోజుల్లో గాంధీగారిని వేళాకోళం చేశారు. ఉప్పు తయారుచేసినంతమాత్రాన వెంటనే స్వరాజ్యం రానిమాట నిజమేగాని, బ్రిటిషు ప్రభుత్వపు దురాగతాల మీద ప్రజలందరికి రోత పుట్టేట్లు, భారతీయులు యావన్మంది జాతీయోద్యమంలో పాల్గొనేటట్లు చేసిన మాటమాత్రం ఎవ్వరూ కాదనలేరు.

## అమెరికా స్వాతంత్ర్య యుద్ధం


ఇంకా వెనక్కి ప్రపంచచరిత్రలోకి తవ్వుకుంటూ పోతే, ఉప్పు పోరాటాలు చాలా బయటపడతాయి. అమెరికా స్వాతంత్ర్య యుద్ధంకూడా ఉప్పు సత్యాగ్రహంతోనే ప్రారంభమైంది. ఉప్పుకోసం ఎన్నో యుద్ధాలు జరిగాయనికూడా చరిత్రకారులు చెబుతారు. ఉదాహరణకు, "హియల్" అనే చోట ఉన్న ఉప్పు బావులకోసం పూర్వం జర్మన్ తెగలు తమలోతాము కలహించుకునేవట. ఆఫ్రికా ఖండంలో ఇప్పటికీ కొన్ని మారుమూల ప్రదేశాలలో జనం ఒక పిసెడు ఉప్పుకోసం ఎంతో ఖరీదయిన ఏనుగు దంతాలను, బంగారాన్ని కూడ ఇచ్చివెయ్యడం కద్దు. ఉప్పుకోసం తమ పిల్లల్ని అమ్ముకున్న నిదర్శనాలు కూడా ఉన్నాయట.

ఉప్పు అనేది ప్రకృతిలో స్వతస్సిద్ధంగా తయారైన మిశ్రమ పదార్థమేగాని మానవుడు తయారుచేసింది కాదు. ఒక అణువు క్లోరిన్ ఒక అణువు సోడియమ్ కలిసి ఉప్పు తయారవుతుంది. మానవునికే కాకుండా సమస్త జీవరాసికీ ఉప్పు ప్రాణాధారమైనది. ఉప్పు లేకపోతే భూమిమీద జీవకోటి ఉండేదికాదు

దేహంలో తగినంతగా ఉప్పులేనప్పుడు నీరసం పుట్టుకొస్తుంది. ముఖమంతా పాలిపోతుంది. స్పృహకూడా తప్పిపోతుంది. మరణం సంభవించవచ్చు. ముఖ్యంగా ఎండాకాలంలో ఉష్ణప్రదేశాలలో నివసించే జనానికి ఈలక్షణాలు సంభవిస్తాయి. విపరీతంగా చెమట పట్టినప్పుడు చెమటద్వారా లవణాలన్నీ బయటికి పోతాయి. దీనివల్ల విపరీతమైన బలహీనత కలుగుతుంది. అందుచేతనే, కొన్ని కొన్ని రకాల పరిశ్రమలలో వేడిగా ఉండేచోట్ల పనిచేసే కార్మికులకి యజమానులు ఉప్పు బిళ్లలు సప్లయిచేసే ఆనవాయితీ ఉంది. బాగా చెమటపట్టేవాళ్లు అప్పుడప్పుడు కాస్త ఉప్పుమింగుతూ ఉండడం మంచిది.

## ఉప్పు సరస్సు

శాస్త్రజ్ఞులు ఉప్పుతాలూకు తారతమ్య సాంద్రత 2.2 అని కనుక్కున్నారు. సామాన్య మానవుడికి ఉప్పు తాలూకు తారతమ్య సాంద్రత ఎంతైనా ఒకటే. కాని దీనివల్ల ఒక చిత్రం జరుగుతుంది. మామూలు నీళ్లలోకంటె సముద్రంలో ఈదడం తేలిక.



ఉప్పుమళ్లలోకి సముద్రజలంపట్టి మళ్లను నింపుతారు. తూముతలుపులను పైకెత్తి నీళ్లువదలడం పై చిత్రంలో చూడవచ్చు.

ఎందుకంటే సముద్రంలో ఉప్పునీళ్ళు. ఈ ఉప్పునీళ్ళను నిలిపి కొంత తేల్చి ఉంచుతాయి. ఇంతేందుకూ, అమెరికాలోని ఉటారాష్ట్రంలో "సాల్ట్ లేక్" (ఉప్పు సరస్సు) ఉన్నది. ఆ సరస్సు నీళ్లలో మనం బాసింపట్టు వేసుకుని మునక్కుండా హాయిగా కూర్చోవచ్చు.

సముద్రజలం ఎందుకు ఉప్పగా ఉంటుంది?

సముద్రంలోని నీరు ఆవిరై మేఘాలు తయారవుతాయి. మేఘాలు వర్షించి నదులు తయారవుతాయి. నదుల నీళ్ళు తాగటానికైతే తియ్యగానే ఉంటాయిగాని, నదులు కొండల్లోంచి, మైదానాల్లోంచి ప్రవహించేటప్పుడు నేలలో ఉన్న అనేక లవణాలను తమలో కలుపుకుంటాయి. ఆ లవణాలన్నీ నదీజలంతోపాటు సముద్రంలో కలుస్తాయి. సముద్రంలోని నీరు ఆవిరిగా మారినప్పుడు లవణాలు మాత్రం సముద్రంలోనే ఉండిపోతాయి. ఇలాగ కొన్నిలక్షల ఏళ్లనుంచి జరుగుతోంది. సముద్రంలోని ఉప్పు సముద్రంలోనే ఉండిపోతోంది. పైగా ప్రతి నిమిషమూ నదుల్లోంచి ఉప్పుకొత్తగా వచ్చికలుస్తోంది. ఈ కారణంచేతనే సముద్రపు నీళ్ళు కటికఉప్పగా ఉంటాయి. ఒక టన్ను సముద్రజలంలో 60 పౌనుల ఉప్పు ఉంటుంది.

ఉప్పు పరిశ్రమలో భారతదేశం ప్రప్రథమంగా 1951 లో స్వయం సమృద్ధి సాధించగలిగింది. అంతకుపూర్వం గత నూరేళ్లలోనూ దేశం ఉప్పుపంట విషయంలో స్వయంపోషకంగా వుండేదే కాదు. 1950 తర్వాత భారతప్రభుత్వం ఉప్పు దిగుమతులను నిలిపివేసింది. 1955 ఆగస్టులో చేసుకున్న ఒప్పందంలో సాలీనా 10 లక్షల మణుగుల సైంధవలవణం భారతదేశం పాకిస్తాన్‌వద్ద కొనాలనే షరతు ఒకటి వున్నప్పటికీ, దిగుమతి చేసుకోవలసిన అవసరమే మనకు లేకపోయింది.

ఉప్పు పరిశ్రమ మనదేశంలో మొత్తం 8 కోట్ల 80 లక్షల రూపాయల పెట్టుబడితో సాగుతున్నది. ఇందులో ప్రభుత్వం పెట్టిన పెట్టుబడి ఒకకోటీ 7 లక్షలు. మిగతాది ప్రైవేట్ వ్యాపారస్తులది.

1955 నాటి లెక్కల ప్రకారం ఈ పరిశ్రమలో రోజుకు 29,300 మంది శ్రామికులు పనిచేస్తున్నారు. వీరిలో ప్రభుత్వ యాజమాన్యాన పనిచేసే ఉప్పుకొఠార్లలో 3530 మందీ, ప్రైవేటు కొఠార్లలో 25,770 మందీ వున్నారు. వీరుగాక, లైసెన్సులుపొందకుండా పనిచేస్తు కేంద్రాలలో మరో పదివేలమంది పనివాళ్ళయినా అనుదినం పనిచేస్తుంటారు.

1953 లో 8 కోట్ల 60 లక్షల మణుగుల ఉప్పు ఉత్పత్తి అయింది. ప్రథమ పంచవర్ష ప్రణాళికలో దీనికిగాను నిర్దేశించిన లక్ష్యం 8 కోట్ల 37 లక్షల మణుగులు మాత్రమే.

వివిధ రసాయనిక పరిశ్రమలలోనూ ఉప్పు ఉపయోగం ఎక్కువవుతుందనే ఉద్దేశంతో ద్వితీయ ప్రణాళిక క్రింద 1960–61 నాటికి 10 కోట్ల మణుగులు పండించవలసి వుంటుందని పథకం వేశారు. దీనికిగాను 189 లక్షల ధనం కేటాయించారు.

మనదేశం మొత్తంమీద సైంధవ లవణం ఉత్పత్తి చేస్తున్నది ఒక్క మాండీ ఉప్పుగనులలో మాత్రమే. ఈగనుల అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రభుత్వం పైనచెప్పిన మొత్తంగాక ఒకకోటి రూపాయలు కేటాయించింది.

ఉప్పు వాఙ్మయంలో కూడా ప్రసిద్ధి కెక్కింది. "లక్షాధికారైన లవణమన్నమె కాని, మెరుగు బంగారంబు మ్రింగబోడు" అని ఒక కవిరాశాడు. "ఉప్పు కప్పురంబు నొక్కపోలిక నుండు, చూడచూడ రుచుల జాడవేరు" అని వేమన కవిరాశాడు. "ఉప్పూ కారం తింటున్న మనిషి కాదూ?" అంటూంటాం మాటల సందర్భంలో. ఏదన్నా కథ చదివినప్పుడో, నాటకం చూచినప్పుడో "అప్పచప్పగా ఉంది" అని చప్పరిస్తాం. అంటే 'ఉప్పులేని పప్పులాగా రుచిగా లేదూ' అని అర్థం. కృతజ్ఞత తెలుపుకోవలసి వచ్చినప్పుడు "మీ ఉప్పుతిని బతికిన వాణ్ని, మీ మేలుమరుస్తానా?" అంటారు. ఇంగ్లీషులో ఒక వాడుక ఉంది. అంతనమ్మదగినదిగా కనిపించని కబురేదైనా విన్నప్పుడు కొంచెం ఉప్పు కలిపి గ్రహించాలని అంటారు. 'నమక్ హారాం' అనే పర్షియన్ మాటకు ఉప్పుకు ద్రోహం చేయడం అని, అంటే నమ్మకద్రోహమనీ అర్థంఉంది. పూర్వకాలంలో ఉప్పును ధనంగా ఉపయోగించే వారట కూడా. అరబ్బులు తమ ఇంట్లో ఉప్పు తిన్నవాణ్ణి మిత్రుడుగానే పరిగణించడం ఆచారం. పూర్వపు రాజులు రాజద్రోహం చేసినవాణ్ణి ఉప్పుపాతర వేయించేవారు.

## ఊరగాయల్లో ఉప్పు

నిలవ ఉంచవలసిన పదార్థాలను ఉప్పులో ఉంచడం చాలా కాలం నుంచీ అన్నిచోట్లా ఆనవాయితీ ఉంది. ఆవకాయ, మాగాయలాంటి ఏడాది పొడుగునా ఉండే ఊరగాయల్ని ఉప్పులో ఊరబెట్టి ఉంచుతాము. ఉప్పు కేవలం రుచికోసమే కాకుండా శరీరానికి కూడా అవసరమైనదే. గాయాలైనప్పుడు ఉప్పుపట్టీ వేయడం శతాబ్దాలనుంచీ వాడుకలో ఉన్నది. గాజుతయారుచేయడంలో ఉప్పు ఉపయోగిస్తారు. కొన్నిరకాల కొయ్యలనుశుద్ధిచేయడానికి, జంతువుల చర్మాలను శుద్ధి చేయడానికి ఉప్పు వాడతారు. బ్లీచింగ్ చూర్ణాల్లో లవణాలను వాడతారు. సబ్బుల్లో వాటిని ఉపయోగిస్తారు. వెండి కరిగించడంలో కూడా ఉప్పు పనికివస్తుంది.

మనదేశంలో చంటి పిల్లలకి దిష్టి తీయడానికి ఉప్పును వాడడం అందరం ఎరిగినదే.



మళ్లలోకి పట్టిన నీటిని కదుపుతూఉంటే కొద్దికొద్దిగా ఉప్పు అడుక్కి దిగుతూ ఉంటుంది.

## సైంధవ లవణం

ఉప్పు సముద్రంలోనే కాకుండా గనుల ద్వారాకూడా లభ్యమవుతుంది. ఉత్తర భారతదేశంలోని విస్తారమైన ఉప్పుగనులు అలెగ్జాండర్ దండయాత్రకు ముందునుంచీ ప్రసిద్ధికెక్కాయి. ఫినీషియన్ వర్తకులు ఆకాలంలో మనదేశంవచ్చి ఉప్పు కొనుక్కుని పోయేవారు. ఉత్తరభారతంలోనిసిల్హెట్, కోహాట్ జిల్లాలలో బ్రహ్మాండమైన ఉప్పు గనులున్నాయి. అక్కడ 250 అడుగుల లోతున తవ్వితేఉప్పు దొరుకుతుంది.

మనదేశంలో తూర్పు ప్రాంతాల్లో ఉప్పు దొరక



కందలాడి ఉప్పుమళ్లను తయారుచేయడానికి చాలాకాలమూ, డబ్బూ, నీళ్లను ఇగరగొట్టడానికి చాలా శ్రమా అవసరం. ఉప్పుమడి కడుతున్న కార్మికులను పై చిత్రంలో చూడవచ్చు.

# ★ ఉప్పు ఉపయోగం ★

దంటారు. ముఖ్యంగా బెంగాల్ ప్రాంతంలో ఉప్పు లేనేలేదని చెబుతారు. బంగాళాఖాతంలో నీరు తీపినీరని, గాలిలో తేమ ఎక్కువనీ అదే దీనికి కారణమనీ అంటారు. కాని ఆ ప్రాంతంలో పెట్రోలియం దొరికే అవకాశాలుండడం ఒక విచిత్రం. నూనె నిల్వలను కాపాడడానికే అన్నట్లుగా అక్కడ భూమి అడుగున ఉప్పు పొరలున్నాయి. ఈ ఉప్పుపొరల అడుగున నూనె ఉన్నది.

## భూగర్భంలో ఉప్పునగరం

పోలెండ్‌లోని క్రాకౌనగరం చరిత్రాత్మకమైన ప్రదేశం. అక్కడ ప్రపంచప్రసిద్ధికెక్కిన ఉప్పుగనులున్నాయి. సుమారు ఒక వెయ్యేళ్లనుంచీ ఈ గనులను వాడుతూనే ఉన్నారు. భూగర్భంలో ఒక పెద్ద నగరంలాగా తయారైనది. ఒక అంతస్తు తరవాత ఒక అంతస్తుచొప్పున అడుక్కి తవ్వుకుంటూనే పోతున్నారు. కింది అంతస్తులో ఉన్న ఉప్పు స్తంభాలమీద పై అంతస్తు నిలిచిఉంటుందట. ఈ అంతస్తులు మామూలు భవనాలకంటె గట్టిగా ఉంటాయట. పిల్లలతోసహా ఆడ, మగ జనాభా తరతరాలుగా ఈ భూగర్భసౌధాల్లో నివసిస్తున్నారు. సుమారు వెయ్యమంది పనివారు ఎప్పుడూ పనిచేస్తూనే ఉంటారు. వీళ్లలో కొందరు ఎప్పుడూ సూర్యరశ్మిని చూడనైనా చూడనివారు ఉంటారట.

రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు ఈ భూగర్భనగరంలో 65 మైళ్ళ మొత్తం విస్తీర్ణంఉన్న ఇళ్ళు, గ్యాలరీలు, ఇరవై రెండు మైళ్ల ట్రాంమార్గాలు ఉండేవట. సంచుల్లోనూ, పీపాల్లోను ఉప్పు నింపబడి ఉండేదట. నూరడుగులఎత్తున ఉప్పుతో కట్టబడిన చర్చి ఉండేదట. ఇప్పటికీ అవి అలాగే ఉండి ఉండవచ్చును.

బహుశా చరిత్ర కందని అతి ప్రాచీన కాలంలో ఎవడో ఎలాగో ఉప్పు రుచి కనిపెట్టి ఉంటాడు. ఆనాటినుంచీ మానవులంతా ఉప్పు రుచి మరిగారు. రుచికే కాక దేహారోగ్యానికూడా ఉప్పు అవసరమని కనుక్కున్నారు. అప్పటినుంచీ సముద్ర జలాన్ని ఇగరబెట్టీ, రాతి ఉప్పును పరిశుభ్రం చేసీ ఉప్పు వాడుతూనే ఉన్నారు.


## ఉప్పు మళ్లు

సముద్రపు ఉప్పును తయారుచేయడానికి ఉప్పు మళ్లు కడతారు. ఈ మళ్లు సముద్రపు మట్టానికి పల్లానఉంటాయి. ఈ మళ్లలోకి ఉప్పునీళ్లుపట్టి ఎండబెడతారు. ఈ నీళ్ళని త్వరగా ఇగరగొట్టడానికి కలియబెడుతూ ఉంటారు. ఉప్పు తయారుకాగానే దాన్ని పోగుచేస్తారు. ఎండకీ, వానకీ, గాలికీ ఆ ఉప్పు క్రమంగా శుద్ధిఅవుతుంది. ఈ శుద్ధి క్రమం కొన్నేళ్లు పటవచ్చు.

టేబుల్ సాల్ట్ తయారుచేయడం ఖర్చుతోకూడిన పని. ఉప్పుమళ్లను సిమెంటుతో కట్టాలి. నీళ్ళను ఒకమడినుంచి ఇంకో మడికి మారుస్తూ, చివరికి పెద్దపెద్ద కాంక్రీట్ తొట్లలోకి పడతారు. అక్కడ వెడల్పాటి చెక్కలతో నీళ్ళనుకొడతారు. ఉప్పుతయారైనాక, దాన్ని తట్టల్లోకిఎత్తి దగ్గర్లోఉన్న ఒక కర్మాగారానికి తీసుకుపోయి పూర్తిగా పరిశుద్ధం చేస్తారు. టేబుల్‌సాల్ట్ ఆవిధంగా తయారవుతుంది.

రోజూ వాడుకునేదేగనక ఉప్పుప్రాముఖ్యం మనం అంతగా గమనించం. చవగ్గా దొరుకుతుందిగదా అని నిర్లక్ష్యంగా వాడ

(55-వ పేజీ చూడండి)



టేబుల్‌సాల్ట్ తయారుచేయడానికి సిమెంటుతోకట్టిన ఉప్పుమళ్లు అవసరం. నీటిని రోజూ కదుపుతూఉంటే త్వరత్వరగా ఆవిరి అవడానికి వీలవుతుంది. ఉప్పు ఏర్పడిన తరవాత దాన్ని బుట్టలలోకెత్తి శుద్ధియంత్రాలద్వారా బాగా శుద్ధంచేస్తారు.

—చిత్రాలు: 'స్టోన్వీక్' పత్రికనుంచి]

# రామరాజ్యం

పితృవాక్యపాలన కంకణబద్ధుడై, రామభద్రుడు జనకసుత, సౌమిత్రీ వెంటరాగా అరణ్యవాసానికి బయలుదేరాడు

మాతామహుని గేహంనుంచి తిరిగివచ్చిన భరతుడు, కళావిహీనమైన నగరవీథుల్నీ, చిన్నబోయి చిన్నతిరగియున్న అంతఃపుర మందిరప్రాంగణాల్నీ చూసి విస్తుపోయాడు.

మాతృదేవి కైకేయివల్ల తనపట్టాభిషేకమూ.. లోకోత్తరపురుషుడైన రామభద్రుని వనవాసమూ విని ఉగ్రుడై మాతృదేవికి తలమున్కగా చీవాట్లు పెట్టి రామాన్వేషణార్థియై బయలుదేరాడు. చివరకు రాముని కనుగొనికూడా ఆ మహానుభావుని నిరాకృతి కారణంగా రామపాదుకలను శిరమునదాల్చి అయోధ్యానగరము చేరుకొని పాదుకలను రత్నఖచిత కనకసింహాసనముపై నిల్పి వాటికి ప్రతినిధిగా అయిష్టతతో రాజ్యపాలన కుపక్రమించాడు.

అది ధర్మరాజ్యం! న్యాయధర్మాలు, నాలుగుపాదాలూని నడిచే బహుచల్లనికాలం.

ఒకనాడు సుమంత్రుడు, రాజప్రధానోద్యోగులు భరతునివద్దకొచ్చి "ప్రభూ! ఈ వత్సరం రైతులవద్దనుంచి శిస్తు యేవిధంగా వసూలుచేయమంటారు." అంటూ ప్రశ్నించారు.

భరతుడీదివిని క్షణం నిరుత్తరుడయాడు. చివరకు తెప్పరిల్లి "అమాత్యవర్యా! ఏమిటీ విపరీతం! మీకు నేను చెప్పేపాటివాడనా! కాకున్నా నేను మహారాజునని నా సలహా అడుగుతున్నారా? .కాదు! నాకా అర్హత లేదు! మాతృదేవి చేసిన క్షమించరాని అపరాధానికి అన్నగారు విధించినశిక్ష, ఈరాజ్యపాలనలోపడి అల్లాడమని! నాకెన్నడు విముక్తి లభిస్తుందో! ఆ మహానుభావుని పాదసేవచేసే మహద్భాగ్యం యీనీచుడికి లేనందువల్లనే, రామచంద్రుడులేని యీ శ్మశానవాటికలో కొట్టుమిట్టాడుతూ ండవలసి వచ్చింది" అంటూ కుమిలిపోయాడు భరతుడు.

సుమంత్రునికిగూడ కళ్లనీరు సుళ్లుతిరిగింది.

"ప్రభూ! రామభద్రులు మనకందరకూ పూజనీయులే. కాని వారి వనవాస కారణంగా తాత్కాలికంగా సంక్రమించిన ఈ విశాల రాజ్యభారనిర్వహణాధికారాన్ని కొదలదాల్చి ప్రజాశ్రేయస్సును పరిరక్షించండి! తెలిసినా తెలియకపోయినా యీగురుతర బాధ్యతను మీ భుజస్కంధాలపై మోయక తప్పదు. మీ నోటినుండి వెలువడిన ప్రతివాక్కు మాకు వేదవాక్కు. మీ ఆజ్ఞను శిరసావహించగలం. ఆజ్ఞాపించండి!" అన్నాడు సుమంత్రుడు.

చివరకు భరతుడు గుండె దిటవుచేసుకున్నాడు.

"ఆజ్ఞాపించేశక్తి నాకు లేకపోయినా ప్రజాశ్రేయస్సుదృష్ట్యా, రామభద్రుడే నాచేత పలికిస్తున్నాడనే భావనలో చెబుతున్నాను రైతులనునుగడకు ముప్పురాకుండా రాజోద్యోగులెల్లరు వ్యవహరించండి. శిస్తు ప్రభుత్వమే నిర్ణయించకుండా రైతులు శక్తికొలది యిచ్చినంత గ్రహించడం న్యాయం! అదే శ్రేయస్కరమనుకుంటాను. వ్యవసాయమూ, దాని కష్టనిష్ఠురాలు రైతులకు తెలిసినంత మనకు తెలియవనుకుంటాను! ఏమంటారు?" అన్నాడు భరతుడు.

## పురాణగాథ

"మీ యిష్టానువర్తులం!" అంటూ శెలవు పుచ్చుకున్నారు సుమంత్రులాదిగాగల ప్రధానోద్యోగులు.

భరతుడు ఉదారహృదయుడని, దీనజనపోషకుడని కొన్నాళ్ళకే అయోధ్యావాసులకు అవగతమైంది.

'కాకుమెత్తనైన ముకాలిపైస్వారి' చేయు అశ్వాల్లాంటి మనుషులు యీనాటే కాదు ఆనాడూ వున్నారు మరి!

ఆయేడు అయోధ్యానగరంలో పాడి పంటలు వెల్లివిరిశాయి. ప్రతియిల్లూ పచ్చతోరణాలతో కళకళలాడుతూ కనుల పండువుగా విలసిల్లింది. రైతుల హృదయకుహరాలలో మోసపుటూహాలు మొలచి చిలువలుపలువలుగా మహావృక్షరూపము దాల్చినాయి.

'రాజు మెత్తనయ్యా! పెత్తనం చలాయించడం చేతకాని అమాయకుడు! అదనుచూచి తెలివిగా వ్యవహరించామా బంగారపుమేడలు కట్టించవచ్చు!" రైతులు రహస్య సమాలోచనలుచేసి తేల్చిన సారాంశమిది.

మరునాడు రైతులు దర్బారులో హాజరయ్యారు.

"ప్రభూ! ఈ సంవత్సరం పంటలు పండడమైతే పండాయి! కాని కోతకాలంలో తెగుళ్లుతగిలి చాలావరకు పైరు నాశనమైంది. ఏదో వచ్చినంతవరకు యింటికి చేరవేశాము! దానిలో శిస్తు ఏమి కట్టాలో, మేము సంవత్సరంపాడుగునా, భార్యాపిల్లలతో ఏమితిని బ్రతకాలో అర్థంగాకుండావుంది! ప్రభువులు కృపాసముద్రులు కావాలంటే శిస్తు తీసివేయగలరు! కాని మామనసు అందుకు అంగీకరించదు. శిస్తు చెల్లిస్తాము!" అన్నారు.

భరతు డీదివిని చాలా విచారించాడు!

"అలాగా! పంట నాశనమైనా తిండిగింజలు శిస్తుగా చెల్లిస్తామని మీ ప్రభుభక్తిని ప్రకటించుకున్నారు. చాలు! ఈ సంవత్సరం శిస్తు ఏమీ యివ్వనక్కరలేదు." అంటూ చెప్పాడు. ప్రధానామాత్యులు నోరు మెదపలేదు. 'పంటలు పండక

**శింగంపల్లి అప్పారావు**

# ★ రామరాజ్యం ★

పోలేదు. రైతులు శిస్తు యివ్వదలచుకుంటే యివ్వగలరు. కాని మహారాజు శిస్తు రద్దుచేసినతరువాత మాట్లాడటానికి యింకెవరికే హక్కు లేదు' అనుకున్నారు. ఆనాటి ప్రభుత్వోద్యోగులు అంతటి రాజభక్తిపరాయణులు. న్యాయమైనా అన్యాయమైనా రాజవ్యతిరేకులు కారు.

మరుసంవత్సరం అయోధ్యావాసులు మళ్ళీ పాడిపంటలలో మునిగితేలారు.

బహుతక్కువగా ఎవరికితోచినశిస్తువారు ఖజానాకు జమకట్టారు. అడిగేనాథుడు లేడు. అందరూ భరతవాక్యపాలకులు. కిమ్మనలేకపోయారు. రైతుల ఆనందానికి అవధులులేవు. ఆశకులోబడిన మానవుడు దానిబారినుంచి తప్పించుకోలేడు.

ఏటేటా రైతులు ప్రభుత్వానికి ద్రోహంచేస్తూ, ఒకయేడు తోచినశిస్తు కడుతూ, మరొకయేడు శిస్తు యెగవేస్తూ వచ్చారు.


వారు నివసించేగృహాలు కొన్ని వత్సరాలకే రాజాంతఃపురముల తలదన్నునట్లుగా లేచి నిలచినవి.

## 2

ఘోరమైన పదునాలుగు నిండువత్సరాల అరణ్యవాసం ముగించుకొని, జానకీసౌమిత్రీసహితుడై, వాయుపుత్రుడు, జాంబవంతుడూ మొదలుగాగల వానరసైన్యము వెంటరాగా రామభద్రుడు అయోధ్యానగరానికి పుష్పకవిమానారూఢుడై వచ్చి చేరుకున్నాడు.

హాయిగా ఊపిరిపీల్చి రాజ్యభారాన్ని అన్నగారి హస్తగతంచేసి, నిశ్చింతుడైనాడు భరతుడు.

వచ్చిన మరునాటినుంచీ రాజకార్య నిమగ్నుడైనాడు రామభద్రుడు! ఏముంది? ఆర్థికంగా అయోధ్యారాజ్యలక్ష్మి అధోగతిపాలయింది. బొక్కసం వెలితిగా వెక్కిరిస్తున్నట్టు కనిపించింది. ఇదంతా చూడగానే చలిజ్వరంవచ్చినట్టు బాధపడ్డాడు రామచంద్రుడు



ఏ రాజ్యమైనా సగర్వంగా తలయెత్తుకు మనగలగటానికి దాని ఆర్థికశక్తియే హేతుభూతమవుతుంది. రామభద్రుడెంత లీలా మానుషవిగ్రహుడైనా మానవలోకంలో అతను సామాన్య మానవచక్రవర్తి. తదనుగుణంగానే అతనూ వ్యవహరించాలిమరి! నిర్ధనుడైన చక్రవర్తి రాజ్యపాలన సక్రమపద్ధతిలో ఎలా కొనసాగించగలడు? అతను సర్వసమర్థుడు! రామభద్రునికి తెలియని విషయమంటూ లేదు.

వెంటనే ప్రధానోద్యోగులను రావించాడు...

"రాజ్యపాలన మీకు చేతకాలేదని భావించమంటారా! లేక. దేశంలో న్యాయధర్మాలు నామావశిష్టస్థితికి వచ్చాయని విచారించమంటారా! చెప్పండి! ఆర్థికంగా ప్రభుత్వ మెందుకింత బలహీనస్థితికి వచ్చింది! దీనికంతకీ మూలకారణమేమిటి?" రుద్రరూపం ధరించి అరుణారుణ వీక్షణాలు వాళ్లపై ప్రసరిస్తూ మేఘగంభీరస్వరంతో ప్రశ్నించాడు.

ఆ గంభీరముద్ర చూడగానే ప్రధానోద్యోగులు అచేతనులైపోయారు. ప్రభువు యింత కఠినంగా ప్రశ్నిస్తాడని ఎవరూ కలనైనా తలంచలేదు.

ప్రధానామాత్యులు రైతుల ఆగడమూ, తెగువా, భరతుని మెతకతనమూ, తమ ప్రభువాక్యపాలనా, విన్నవించుకున్నారు.

రామభద్రుడు సంగతి సందర్భాలు క్షణంలో క్షుణ్ణంగా అవగాహన చేసుకున్నాడు. ఆనాటిరేయి రెండు యామములు గతించగానే మారువేషంలో అయోధ్య యావత్తూ తిరిగి రైతుల సంపత్తినీ, వారి ఊహాలనూ, రాజద్రోహాన్నీ అర్థంచేసుకొని తలపంకించి, ఒకింత యోచించి తిరిగి అంతఃపురం చేరుకున్నాడు.

ఆ మరునాడు నగరం మూలమూలలా ఇలా దండోరా వేయించబడింది!

"ఇందుమూలమున తెలియచేయడమేమనగా:—రేపు ఉదయమే శ్రీరామచంద్ర ప్రభువులవారి పట్టాభిషేక మహోత్సవము అతివైభవోపేతంగా జరిపించబడుతుంది కాన చాతుర్వర్ణ్యకులజులు తగువిధమైన కానుకలు తీసుకొని రావలసింది..... ... యుద్ధంలో ప్రభువులవారికి అండదండలుగా నిలిచి, గెలిచి విజయం సాధించిన వానర సైన్య సమూహమునకు గుమ్మడికాయ వంటకము అతిప్రీతిపాత్రమైనది గనుక రైతులు ఒక్కొక్కరూ ఒక్కొక్క గుమ్మడికాయ విధిగా రాజాజ్ఞగా భావించి తీసుకొని రావలసిందిగా కోరడమైనదోహో!" అని.

ఇది విని రైతులు నవ్వుకున్నారు. వారి యిళ్లపై గుమ్మడికాయలు విరగకాసి వున్నాయి.

'ఎవరువచ్చి యాచించినా కొల్లలుగా గుమ్మడికాయలు దానంచేయవచ్చు! పిచ్చి మహారాజుకు ఖచ్చితంగా ఒక్కటేకాయ కావలసివచ్చింది!" అనుకున్నారు రైతులు.

* * *

వర్షికలా కారుచీకట్లతో రాత్రి ముంచుకొచ్చింది. ఊరు మాటుమణిగింది. ఎల్లరు నిద్రాదేవి ఒడిలో ఉయ్యెలలూగుతున్నారు. అర్థరాత్రివేళ విచిత్రంగా కొన్ని ఆకారాలు రాజప్రాసాదంనుంచి బయటపడి, అయోధ్యానగరంపై యెగురుతూ యిళ్లపై వాలుతూ చప్పుడుకాకుండా ఏమిటో భీభత్సంచేస్తూ తూరుపు తెలతెలవారుతూండగా అన్నీ కలిసి రాజాంతఃపురం దిక్కుగా యెగిరిపోయాయి!

## 3

తూర్పున సూర్యుడు పొడవకముందే అంతఃపురంనుంచి మంగళవాద్యఘోషలు మిన్నుముట్టినవి. శ్రీరామచంద్రుడు పన్నీట జలకమాడి రాజలాంఛనోపేతమైన ఉడుపులు ధరించి సభాస్థలికి చేరుకున్నాడు.

పట్టాభిషేక మహోత్సవం అనుకున్నట్టు అతివైభవంగా జరిగిపోయింది మంత్రిసామంత, దేశదేశాల ప్రతినిధులతో, ప్రజాసమూహంతో విశాలసభాభవనం కిటకిటలాడుతోంది. తమ ప్రభువుకు ఓపినకొలది ప్రతివారు కానుకలు చదివించి తమజన్మ ధన్యత చెందిందని ఉప్పొంగిపోతున్నారు.

రామభద్రుడు కానుకలవైపు దృష్టినిగిడించి చూశాడు. కాని అతనికి కావలసిన గుమ్మడికాయలు మాత్రం అందులో కానరాలేదు...వెంటనే సింహాసనంనుంచి లేచాడు...సభాస్తారులు మంత్రముగ్ధులవలె చప్పుడుచేయకుండా ఆ లీలామానుషవిగ్రహునివైపు చూస్తూ, హఠాత్తుగా ప్రభువు లేచిన కారణమేమిటో తెలియక ఆశ్చర్యమనస్కులయ్యారు.

"ప్రజలు, ప్రభుత్వోద్యోగులు నాయందు ఇంత రాజభక్తిని ప్రదర్శిస్తున్నందుకు చాలా సంతోషంగావుంది. కాని ఘోరరాక్షససంగ్రామంలో యెనలేని శౌర్యప్రతాపాలు ప్రదర్శించి నాకు విజయంచేకూర్చిన వానర సైన్యానికి ప్రీతికరమైన గుమ్మడికాయలు యిందు కనిపించడంలేదు. చాలా శోచనీయమైన విషయం! ఇది ప్రధానవిషయంగా పరిగణించమని చాటింపుకూడ వేయించబడింది! మరి రైతుల అలక్ష్యానికి హేతువేమిటో అనూహ్యం! వారు రాజశాసనోల్లంఘన చేశారు! ప్రప్రథమనిందితులైన యీ రైతులకు న్యాయశాస్త్రదృష్ట్యా యేదండన విధించాలో యీ సభలోనే నిర్ణయించబడుతుంది." అన్నాడు శ్రీరామచంద్రుడు గంభీరంగా.

ఏమి ఉపద్రవం ముంచుకొస్తుందోనని అరచేత ప్రాణాలుపెట్టుకున్న రైతులు యిది వినగానే గడగడలాడిపోయారు.

వారంతా వినయంగా చేతులుకట్టుకొని ముందుకువచ్చి "మహాప్రభూ! మావల్ల ఏమాత్రం దోషంలేదు! విరగకాసివున్న గుమ్మడికాయలు విచిత్రంగా తెల్లవారేసరికి మచ్చుకు ఒక్కకాయగూడ లేకుండా ధ్వంసమైపోయాయి ఎక్కడైనా వెదకి తీసుకువద్దామన్నా దేశమే గొడ్డుపోయింది ప్రభూ! ఒక్కరాత్రిలో యింతటి అల్లకల్లోలం ఎలా జరిగిందో వూహించ శక్యంగాకుండావుంది! మన్నించండి! కావలిస్తే ప్రభువులకు గుమ్మడికాయతో సరితూగగల బంగారమైనా యివ్వగలంకాని గుమ్మడికాయలే తీసుకురావడం మావల్లకాదు! ఆతరువాత ప్రభువులు ఏ శిక్ష విధించినాసరే! ధనగర్వాన్ని ప్రదర్శిస్తూ ఎంతో దర్పంతో అన్నారు.

"ఏమిటీ! గుమ్మడికాయతో సరితూగగల బంగారాన్ని యివ్వగలరా!" అన్నాడు రామభద్రుడు ఆశ్చర్యంతో.

"చిత్తం! యివ్వగలం! లేకపోయితే మీరు విధించే శిక్షకు పాత్రులం!" అన్నారు

"అయితే సరే! అలాగే యివ్వండి! ఆ ధనంతో, ప్రపంచంలో ఎక్కడున్నా సరే

# రా మ రా జ్యం

గుమ్మడికాయలను తెప్పిస్తాం! ఒక్క ముఖ్య విషయం. గుమ్మడికాయబరువుకు అరగింజంత బంగారంకూడ తగ్గకూడదు! గుర్తుంచుకోండి!” అన్నాడు రామచంద్రుడు.

బంగారాన్ని మణుగులకొద్దీ దాచివుంచిన రైతులు ప్రభువు అంగీకరించినందుకు సంతోషిస్తూ యిళ్లకు పరుగెత్తారు. అంతఃపురోద్యానంలో పండిన ఒక్క గుమ్మడికాయనూ విశాలమైన త్రాసునూ తెచ్చి సభాభవన మధ్యంలో అమర్చారు భటులు.

రైతులు తమ తమ బంగారాన్ని పట్టించుకు వచ్చారు. త్రాసులో ఒకవైపు గుమ్మడికాయ వున్నది. ఒక రైతు తనవంతు బంగారాన్ని త్రాసులో వేశాడు. వీసమెత్తుకూడ త్రాసు చలించలేదు!. ఇక చెప్పేదేముంది? ఈశ్వరాంశసంభూతుడైన వాయుపుత్రుడు గుమ్మడికాయలో ప్రవేశించాడాయె! ఇంకేం కదులుతుంది! ఒక్క రైతుకాదు... అయోధ్యలోని రైతులందరు తమతమ బంగారాన్నంతటనీ తెచ్చి త్రాసులో వేశారు.. సంపద యావత్తూ కరిగించి తెచ్చి పడేశారు... కాని త్రాసు కదల నన్నట్టుగా భీష్మించుకు కూర్చుంది. రైతులంతా కలిసి కనీసం ఒక్క గుమ్మడికాయబరువుకు తగిన బంగారమైనా యిద్దామని శాయశక్తులా ప్రయత్నం చేశారు. కాని ఫలితం కనిపించ లేదు! రైతులు ఆశ్చర్యంతో నోళ్లు వెళ్ళబెట్టారు.

చివరకు చేయగలిగినదేమీ లేక వినయంగా చేతులు జోడించి “ప్రభూ! ఇక మా వద్ద పూచికపుల్లకూడా లేదు. మణుగులకొద్దీ తెచ్చి తూచినా లాభం లేకపోయింది. చూడగా యిదంతా ఏదో మాయగావుంది! ఇక మా వల్లగాదు” అన్నారు.

రామభద్రునికి కోపం ముంచుకు వచ్చింది! “అవును యిది మీ వల్లగాదు రాజద్రోహం చేయడం మీ వల్లనవుతుంది! ధర్మపథాన నడిచే సామ్రాజ్యానికి కళంకమాపాదించడం మీ వల్ల నవుతుంది! ధనమదాంధతలో కన్నుమిన్ను గానక రాచమర్యాదనే రచ్చకెక్కించడం మీ వల్లనవుతుంది! అధర్మ వర్తనులారా! రాజ్యలక్ష్మి గౌరవప్రతిష్ఠలకే ముప్పు తెచ్చారు. ఇది మొదటి తప్పిదంగా భావించి ఇంతటితో మిమ్ము క్షమించి విడిచి పెడుతున్నాను ఇకముందు బుద్ధిగా మెలగండి, పొండి” అంటూ ఆజ్ఞాపించాడు.

ఆ తరువాత సభాసదుల నుద్దేశించి “ఏ కాశం దొరికిందని అధర్మానికి పూనుకోవద్దు. ధర్మనిరతులై నీతిమార్గాన్ని అనుసరించండి! నా పాలనలో ధర్మం వర్ధిల్లుతుంది-న్యాయం, వర్ణభేదము లేకుండా పాటించబడుతుంది. నీతి న్యాయ ధర్మాలు, కొనసాగినంతకాలం సామ్రాజ్యం అవిచ్ఛిన్నంగా, వెలుగొందుతుంది!” అంటూ శ్రీరామచంద్రుడు ఆ నాటికి సభ చాలించి అంతఃపురానికి వెళ్ళిపోయాడు! ★



# బుడుగు టపా

ఉరేయి బుడుగూ,

మరేమో మా కాలేజీలో రాద లేదూ? ఆ అమ్మాయంటే నీ కన్నా, గులాబ్ జాం కన్నా, రేలంగి సినిమాకన్నా, కిశోర్ కుమార్ కిచ కిచలకన్నా, గాబర్డీన్ సూట్ కన్నా కూడాచ్చాలా ఎంతో కొండంత ఇష్టం. సరే ఇపుడు నేనా అమ్మాయితో మాటాడాలి కాని ఆ అమ్మాయి నా ముందర నిలబడితే నాకు ఒణుకు వస్తో అలాఅని మా వెలిపతిరావు చెప్పాడులే అందుకని బాబాయి నేదేనా అయిడియా అడిగినువ్ తీసుకురావాలి. త్వరగా వస్తావు గదూ, బామ్మ ఏవంటోంది మొన్నటి ఎండలకు "హారీ" అందా? ఉందా?

జె. గోపాలం,

(ఏలూరు)

★ హారీ అనలేదుట. హారి! ఎంతపొగరు అందిట. ఇలాని చెప్పమంది మరేమో మీ కాలేజీలో రాద నీకు ఎంత ఇష్టమో బాబాయికి చెప్పానుగదా వాడు 'అబ్బ!' అన్నాడు

డియర్ బుడుగు పిడుగూ,

నీవు చెప్పే సలహాలు చాలా బోల్డు బాగుంటాయి నువంటే నాకెంతో హిషం. ఆంధ్రపత్రికలో నువ్వు పడుకుని ఉత్తరాలు చదువుతున్న ఫోజు చూస్తే నాకు ముద్దోస్తూంది

కూచిమంచి పాండురంగ

ఆంజనేయులు, అమలాపురం.

★ నాకూడా నీపేరు చాలాపొడుగుగా ఉందే నాకన్నా కాదనుకో.

ప్రియమైన బుడుగుకి,

నిన్నుగురించి చదివినప్పటినుండి నీకు ఉత్తరం రాసి నీతో నేస్తంకడదామని పించింది కాని ఈ మధ్యలో వేసంగి శెలవులివ్వడంవల్ల బొత్తిగా తీరుబడి లేనందువల్ల (అమ్మ కోప్పడకుండా ఉన్నట్టయితే వీధిలోను, కోప్పడితే ఇంట్లోను ఆడుకోవడంవల్ల—మా నాన్న అల్లరిఅంటాడనుకో) నీకు ఉత్తరం రాయలేదు కాని మళ్ళీ బడి తెరిచినట్టయితే మరీ తీరుబడి అవదేమో అని ఇప్పుడే రాసేశాను

పూడి పెద్దినాని,

విశాఖపట్నం

★ నీకు బడీలేదు తిరుబడీలేదు. ఎంత హోచ్చెరం!

హారి చిచ్చుల పిడుగూ!

ఎంతటివాడవయ్యావ్! మరేమోనూ కొత్త సమ్మత్సరం వచ్చినపుడు సీగాన పెసూనాంబను పిలిచి కుంచెం పంచాంగమున్ను మరి కుంచెం కొత్త సమ్మత్సర విశేషాలున్ను చెప్పేశావు కదా! మరిపుడేమో పెసునాంబకు తెలియకుండా వుత్తరాలన్ని నువ్వొక్కడివే చదివేసు కుంటున్నావా దొంగా!

నా పేరు డి అప్పారావు మా వూరు గోదావరి బ్రిడ్జి దగ్గరవున్న రాజమండ్రీలే

★ లేదులే ఇవన్ని రాసిపెట్టేవాడు ఇప్పుడే వస్తానని పరిగేతు కెళిపోతాడుగదా అందుకని ఆ సీ గాన పెసూనాంబే కుంచెం చదివి పెటుతోంది ఉత్తరాలు దానికి నాకన్న కొంచెంఅఆలుఎక్కువొచ్చుటలేఏంచేస్తాం

డియర్ బుడుగు,

నీకు ఉతరం రాయాలని ఎన్నాళ్ళ నించో అనుకుంటున్నాను. ఇప్పటికి వ్రాయడానికి వీలు కలిగింది బుడుగూ అన్నింటికంటే అంటే నీవు పాయాలూ అవీ అన్నమాట వాటికంటే నీపేరు ఎంతబావుంటుందీ, నిఝంగా నీలాటి పేరు నేనెక్కడా వినలేదు బుడుగూ! నిద్రపోయినా నువ్వే కలలో కొస్తున్నావు నిన్ను చూడాలని వుంది ఒక్కమాటు మాయింటికి రాకూడదూ వీధిలో జెటకా వెడుతుంటే నువ్వే

## ★ బుడుగు టపా ★

ప్రాతో కొట్టాను. బుడుగు పత్రికలో నువ్వు కోలంబియా కాలేజుకుని ఉత్తరాలు చదువు తున్నట్టున్న బొమ్మ ఎంతబావుందనుకున్నావు చెమ్మరాజుసూర్యకుమారి, కాకినాడ.

★ చెప్పు చూద్దాం.

-టీ బుడుగుడు,

నీవు చాలా గొప్పవాడవని ప్రతి వూడ దాదా చాటుచున్నది. మాకాకే ఇప్పట బరేగా ఎందుకు! కొంట్లో చేసి నిన్ను మా వూరు పిలవలేము. మా యిల్లు చాల పెద్దది మూడెట్లే అప్పుడేగా పెదబాబా తెలుంటుంది, ఇంతకొన్న అదుకోవచ్చు. మాయింట్లో పదోటాలు, తెలకొంకొయలు వున్నాయి. ఇంతేకాక రేడియో వుంది. 10 రికార్డులు అదే పాడుతుంది నీవు మాట్లాడింది మరలా రికార్డు చేసి మాట్లాతే చేపు రికార్డు వుంది.

టి రఘులింగారెడ్డి (బాపట్ల)

★ ఏం లాభం రావద్దన్నావుగా. కాని అవన్నీ పొట్లాం కట్టేసి, మెద్రాసు రైలో వేసిపెం తోత, వురేయ్ చోటుఅయిపోయింది

# అబద్ధం రక్తి కట్టింది

సమూరి వి. విమల

అబ్బ! వండర్‌ఫుల్ పిక్చర్. హిచ్‌కాక్ పిక్చర్స్ అంటే పడిచస్తాను. అలాంటి పిక్చరు మా వూరు వచ్చింది జన్మానికి శివరాత్రి. మావూరు మంచి ఇంగ్లీషు పిక్చర్స్ రానేరావు. వస్తేమటుకు తప్పకుండా చూస్తాను ఆఫీసునుండి వస్తూ వాల్ పోస్టరు చూశాను. రాక్సీలో "రియర్ విండో" వస్తూ వస్తూ మూర్తితోగూడా చెప్పాను. నేను వచ్చేటప్పటికి రెడీగా ఉండమని, తొందరగా వెడితేగాని టికెట్లు దొరకవనీ చెప్పాను. ఇంటికివచ్చి డ్రెస్సు మార్చుకుని టిఫిను తీసుకుని కారు తిన్నగా మూర్తిఇంటికి పోనిచ్చాను. కారులో కూర్చొని హారన్ వేశాను మూర్తి నాకోసం ఎదురుచూస్తూ కూచుంటాడనుకున్నాను పోనీ నా హారన్ విని ముందుకు వచ్చిగూడా చూడలేదు అలాంటి లక్షణాలు ఏవీ కనపడలేదు. ఇంట్లోకి వెళ్లి చూశాను. ఈజీఛైర్‌లో కూర్చుని సిగరెట్టు పొగ వదులుతూ ఊహాతరంగాలలో తేలిపోతున్నాడు. చెప్పద్దూ నాకు చెడ్డ ఒళ్ళుమండింది. నేను చెప్పినది ఏమిటి? వీడు చేసినది ఏమిటి?

మూర్తీ! అలావున్నావేరా! ఆఫీసులో బాగానే వున్నావుగా ఇంతలోకి ఏమి ముంచుకు వచ్చిందిరా" అన్నాను.

కొద్దిగా తలనొప్పి వచ్చిందిరా. అదీ కాకుండా ఇవాళ మా నాన్న వస్తున్నాడురా. సారీ ఏమీ అనుకోకురా నువ్వు వెళ్లు" అన్నాడు.

"అదేమిటిరా! వస్తానన్నావుగా కాస్త గదురా తలనొప్పి. ఇదుగో ఈమాత్ర వేసుకోరా. ఊ జల్దీ మంచి పిక్చర్‌రా. లేవరా మీనాన్న వచ్చేటప్పటికి నువ్వు పిక్చర్ నుండి వచ్చేస్తావులేరా" అన్నాను.

"సారీ గోపాల్, ఏమీ అనుకోకు. నువ్వైనా తొందరగా వెళ్ళు. లేకపోతే టిక్కెట్లు దొరకవు" అన్నాడు.

"ఇవాళ రాకపోతే పోనీ రేపు వస్తావా? నేను ఇవాళ మానేస్తాను. భలే డిటెక్టివ్ కథరా, రేపు వస్తావా?" అన్నాను.

"ఒరేయి, నువ్వు వెళ్దామనుకున్నావు నువ్వు వెళ్ళు. డిటెక్టివ్ కథ అంటున్నావు. నాకసలే తలనొప్పి. వెధవ కథలు వాళ్లూను. రేపుగూడా నేను రానురా, అనుకున్నడేదో అనుకున్నాతె. నువ్వు వెళ్లిరా" అన్నాడు.

ఆవేళ నేను వెళ్లటమే మంచిదయింది. నేను వెళ్ళకపోతే నా జీవితపథం ఇంకోలా వుండేది. ఒక్కొక్కరి జీవితపథం కేవలం ఒక్క సంఘటనతో పూర్తిగా మారిపోవడము చాలాచోట్ల సంభవిస్తుంది ఆ సంఘటన అట్లా జరగకపోయినా యిదే ఫలితం వేరే విధంగా పొందడానికి అవకాశాలున్నాయనటం వాదంకోసమే అవుతుంది. ఏమయితేనేమి ఆవేళ పిక్చర్‌కి వెళ్లాను.

ఒక్కళ్లే బయలుదేరానన్న అసంతృప్తి తప్పించి అంతా బాగానేవుంది రాక్సీ థియేటర్ ఇంచుమించుగా నాలుగుమైళ్లుంది మా ఇంటిదగ్గరనుండి టికెట్లు దొరకవేమోనని కారు స్పీడుగా పోనిచ్చి 6-15 కల్లా హాలు దగ్గర చేరుకున్నాను. కారు లాక్ చేసి బుకింగ్ దగ్గరకి వెళ్లాను. "హౌస్‌ఫుల్" అని బోర్డు కనపడింది మూర్తిమీద విసుక్కున్నాను వాడి మూలానే నాకి ఆలస్యమయింది. ఇప్పుడేమి చెయ్యను? ఎంతో ఆశ కొద్ది వచ్చాను, పిక్చర్ చూద్దామని ఏమి చెయ్యటానికీ తోచలేదు సరిగ్గా బుకింగ్ ఆఫీసుకి మూడుగజాల దూరంలో ఒక సుందరాంగి నిలబడి వుంది. ఆమె ఎవరికోసమో చూస్తోంది మొట్టమొదటిసారిగా ఆమెనివీక్షించాను. సన్నగా పొడుగ్గావుంది. కాంతివంతమైన ముఖం. బంగారుఛాయగల శరీరం. అద్దాలవంటి చెక్కిళ్ళు, సౌందర్యం, సౌకుమార్యం ఆమె సొత్తు. ఆమె కళ్ళల్లోనించి ఆమె మనస్థైర్యం తొంగి చూస్తున్నది కవి మనోభావంలోని సుందరాంగిలా వుంది చాలా లావుపాటి జడలు రెండు వేసుకుంది. తెల్లటి సిల్కుజాకీ వేసుకుంది. తెల్లటి సిల్కుచీర ధరించింది. జాకీకి, చీరకి, సరిపడ్డట్లుగా రెండు అంగుళాలున్న హైహీల్డు శాండల్స్ వేసింది. వయాపైసాకన్న ఓచుట్టు చిన్నదైన పెద్ద లోపుకుంకుమబొట్టు పెట్టుకుంది. ఆమె నిజంగా అందంగా వుంది ఒక చేతికి వాచ్ వుంది. మాటిమాటికి టైము చూసుకుంటోంది.

నిజంగా చెప్పాలంటే ఇరవైయోశతాబ్దపు నవనాగరిక లక్షణాలు ఆమెలో పూర్తిగా మూర్తీభవించి వున్నాయి. ఇంతసేపు నన్ను చూడలేదు. ఒక్కసారిగా చూచింది. నఖశిఖ పర్యంతం పరీక్షగా చూడటంవల్ల ఆమెకి కోపం వచ్చింది. నావైపు నుంచి ముఖం తిప్పేసుకుంది అదేగాని మహా పతివ్రతలకాలమే అయినట్లయితే ఆమె తీక్షణ దృక్కులకు మాడి భస్మమయిపోయేవాడిని. ఇంక పిక్చర్ ఒక పదినిమిషాలలో ప్రారంభం చేస్తారు. ఆ సుందరాంగికి ఏమి చెయ్యాలో తోచటంలేదు. ఏముంది ఎవరో స్నేహితురాలు వస్తానని మోసంచేసి వుంటుంది. నాకయినట్టుగానే ఇంక గత్యంతరం లేక తిరిగి వెళ్లిపోదామనుకున్నాను అలా, అనుకుని రెండడుగులు ముందుకు వేశాను. ఇంతలోకి "మిస్టర్" అన్న ఒక కోమల కంఠధ్వని వినపడింది. వెనక్కి తిరిగిచూశాను. ఆ సుందరాంగే అక్కడే నిలబడివుంది ముందర నాకు భయంవేసింది అలా చూసినందుకు నన్ను నాలుగుచివాట్లు పెడుతుందేమోనని అనుకున్నాను. కాని దేవుని దయవలన అలాంటిదేమీ జరగలేదు. ఆమెదగ్గిరికి వెళ్లాను "మీరు మరోలా అనుకోకపోయినట్లయితే నా దగ్గర ఒక టికెట్ వుంది. నా స్నేహితురాలు థియేటర్ దగ్గర కలుసుకుంటానని దగాచేసింది. మీకేమి అభ్యంతరం లేకపోతే ఈ టికెట్ తీసుకోవచ్చు. అనవసరంగా వృధా అవటం ఇష్టంలేదు. మేము ముందరే బుక్ చేయించుకున్నాము," అంది. నాకు నిజంగా ఏమీ అనాలో తెలియలేదు. ఆ సుందరాంగిని మనసులో అభినందించుకున్నాను. మిస్ మీరు

"సారీ! మిసెస్ గీతాశేఖర్" అని నవ్వుతూ వున్న నవ్వును బలవంతంగా ఆపుకుంది ఎందుకో నా నోటిలోమాట నోటిలోనే ఆగిపోయింది ఆమెకి థాంక్స్ చెప్పాను. ఎందుచేతోగాని ఆమె "మిసెస్" అనగానే నాకు పిక్చర్ మీద ఆసక్తిపోయింది. టికెట్టు లేకపోతే తిరిగి వెళ్ళిపోయేవాడిని. కాని అప్రయత్నంగా టికెట్టు వచ్చింది. నాలో మార్పుచూస్తే నాకే నవ్వు వచ్చింది ఆమెకి కనపడకుండా, ముఖంమీద ఏర్పడిన చెమటబిందువులను తుడుచుకున్నాను. టికెట్టు వచ్చిందన్న

# ★ అబద్ధం రక్తికట్టింది ★

ఆనందం అంతరించిపోయింది. ఏమిటో ఆమె 'మిస్' అయితే నాకు వచ్చే లాభమేమిటి? 'మిసెస్' అయితే వచ్చిన నష్టమేమిటి? నాలో నేను నవ్వుకున్నాను ఇదంతా రాయటానికి ఇంతసేపు పట్టింది గాని ఒక్క క్షణంలో జరిగిపోయింది. నా భావాల్ని కొన్ని పసికట్టి ఆమె చిరునవ్వు నవ్వుకుంది. నా ఆలోచనలకి అంతరాయం కలిగించింది. "ఏదో చెప్పబోయారు. ఇంతలో నేనే అడ్డు వచ్చాను" అంది. "గీతా, మీరు నాకు టికెట్టు ఇచ్చినందుకు మిమ్మల్ని ఎలా అభినందించాలో తెలియటంలేదు" అన్నాను ఇంతలో ఫస్ట్ బెల్ వినపడింది. ఆమె అంది "దండి Mr . "

"ఆ, నాపేరు చంద్రశేఖర్" అన్నాను. ఇలా అనగానే ఆమె ముఖకవళికలు మారిపోయాయి. ఇందాక నేను అనుభవించిన బాధ అనుభవించింది. నాపేరు వినగానే ఆమె సిగ్గుతో తల వాల్చేసింది. ఎందుకో నాకు తెలియలేదు థియేటర్ లోకి వెళ్ళాము. లైట్లు ఆఫ్ చేశారు ఇద్దరిసీట్లు పక్క పక్కనే వున్నాయి. "మీరు వెళ్ళండి" అన్నాను కాని సరిగ్గ ఆమె కూర్చుండే సీటు పక్కనే ఒక యువకుడు కూర్చున్నాడు అందుచేత "మీ రెళ్ళండి" అంది. సరేనని నేనేవెళ్ళి కూర్చున్నాను అక్కడికి ఆయువకుడెవ్వడో పరాయివాడయినట్లు నేను కానట్లు. ఆవిడ భావానికి నాలో నే నే నవ్వుకున్నాను. ఇద్దరం చెరో సీటులోను కూర్చున్నాము. అసలు పిక్చరుకు ముందు 'మికీ మౌస్' చూపిస్తున్నారు గీత అదిచూసి ఒకటేనవ్వుతోంది అది నిజంగా చిన్నపిల్లలుచూసి ఆనందించవలసింది గీతలో ఇంకా చిన్నతనం పోలేదు నేనుఒక వేపు పిక్చర్ చూస్తున్నాను, ఒక వేపు ఆమెని చూస్తున్నాను. ఫాన్ గాలికి ఆమె ముంగురులు నుదుటిమీద నాట్యం చేస్తున్నాయి. ఆమె సిల్కుచీర గాలికి అలలలా కదులుతోంది. ఆ పిక్చర్ అయిపోయింది. ఇంక "రియర్ విండో" మొదలు పెట్టారు.

మధ్యకాలం చెము విశ్రాంతివచ్చింది: నేను బయటికివెళ్ళి కూల్ డ్రింకులు ఆర్డరిచ్చి వచ్చాను. అవి పట్టుకువచ్చాడు. "ఎందుకండి మీకింత శ్రమ. చాలా థాంక్స్" అని స్వచ్ఛమైన నవ్వు నవ్వింది. ఇంక అసలు పిక్చర్ మొదలు పెట్టారు. మొదటినుంచి చివరవరకు మంచి సస్పెన్సులో వుంది గ్రేస్ కెల్లీ చాలాబాగా యాక్టుచేసింది. ఆ హీరో గూడా చాలా బాగా వేశాడు. ఆ హీరో గ్రేస్ కెల్లీని ఆ హంతకుడి ఇంట్లో ఒక ఉత్తరం పెట్టిరమ్మనప్పుడున్న దృశ్యం చాలా థ్రిల్లింగ్ గావుంది. ఆ ఉత్తరంపెట్టి వచ్చేలోపుగా ఆ హంతకుడు వచ్చేస్తాడు. హీరో వాడి ఇంట్లో కిటికీదగ్గర కూర్చుని బైనాక్యులర్స్ లోంచి చూచి కూడలిపోతాడు, ఆమెకి ఏమి అపాయం వస్తుందోనని. ఇది చూసేసరికి గీత హృదయంలో అలజడి ప్రారంభమైనది. ఆ హీరోయిన్ కి ఏమవుతుందోనని. ఆ హంతకుడు పసికడతాడు హీరోని. ఆ వేళరాత్రి బయలుదేరి వస్తాడు ఆ హంతకుడు. ముందర తలుపు సందుదగ్గర నీడ పడుతుంది అదిచూసి "బాబోయి వస్తున్నాడు" అంది గీత భయపడుతూ. అసలే హీరోకి ఒకకాలు లేదు. చక్రాలకుర్చీలో కూర్చునే గొడవపడుతున్నాడు. ఆ హంతకుడు దగ్గరకి వస్తున్నాడు, "బాబోయ్ వచ్చేస్తున్నాడు" అని ఒక్క అరుపుఅరచి గీత కుర్చీమీద వాలిపోయింది. చెప్పద్దూ, నాకు చెడ్డకోపం వచ్చింది. అంత భయమయినవాళ్లు డిటెక్టివ్ కథలు చూడటం ఎందుకో ! వెంటనే వెళ్ళి నా రుమాలు తడుపుకువచ్చి ఆమె ముఖం మీద వేశాను. ఇంతలో లేచి కూర్చుంది. ఇంతలోకి అక్కడ హీరోకాస్తా మేడ మీదనుండి కిందపడ్డాడు. అసలే ఒకకాలు కుంటి, రెండోకాలుకూడ కుంటి అయింది. అయితేమాత్రమేమి ఇంట్లో కుర్చీలోకూర్చుని హంతకుడిని కనుక్కున్నాడు పిక్చర్ అయిపోయింది. ఇద్దరము థియేటర్ లోంచి బయటికి వచ్చాము. గీత అటు యిటు చూసింది. వాళ్ళ కారుకోసం కాబోలు, కాని కారు రాలేదు గీత నిస్పృహ చెందింది. "ఛీ! నాన్నగారు ఎప్పుడూ ఇంతే కారు పంపించమంటే పంపలేదు. ఒకవేళ నా స్నేహితురాలి కారులో వస్తానని అనుకునివుంటారు. పాపం ! ఆయనకిమటుకు ఏమి తెలుసు ఆమె రాలేదని. ఇప్పుడు ఏమిటి చెయ్యటం ?" అంది. "మీకేమి అభ్యంతరం లేకపోతే నా కారువుంది. మీ ఇంటిలో మిమ్మల్ని దింపి నేను వెళ్ళిపోతాను" అన్నాను అప్పటికింకా టైము 9 అయింది. ఇంగ్లీషు పిక్చర్ కదూ అందుకని. గీత సరే నంది. నా కారులో బయలుదేరాము.

కారు స్టార్టుచేసాను. నెమ్మదిగా పోనిస్తున్నాను. నేనే మొదలుపెట్టాను సంభా

మను. "ఏమండీ, గీతా, మీరు అలా భయపడి పోయారేమిటి? దీనికే భయపడితే మీరు డిటెక్టివ్ సినిమాలు చూడలేరన్నమాట. అంత తేలహృదయం మీది. మొత్తానికి అబల అనిపించారు". అన్నాను

"లేదండి, నేను ఎప్పుడు భయపడలేదు. ఇవాళ యేమిటో భయం వేసింది పోనీలెండి, యింక సినిమాసంగతి వదిలెయ్యండి మన పరిచయం కొద్దిగంటలే అయినా, మీరు నాకెంతో ఆప్తమిత్రులులాగ కనపడుతున్నారు మిమ్మల్ని యెప్పటినుంచో యెరిగివున్నా ననిపిస్తోంది కాని యెంత ఆలోచించినా మిమ్మల్ని యిదివరకు ఎక్కడా చూడలేదు," అంది చిరునవ్వు నవ్వుతూ.

"ఇందులో యేముంది? నాకు ఫ్రెండ్ రాలేదు, మీకు మీ ఫ్రెండ్ రాలేదు. ఇద్దరం ఒకే అవస్థలో వున్నాము కొద్దిగంటలలో నే చాలా సన్నిహితత్వం యేర్పడింది విడివిడిగా సినిమాచూస్తే ఆనందించలేము. కంపెనీ లేకపోతే పిక్చర్ బోరింగ్‌గా ఉంటుంది అలాంటిదేమీ లేకుండ పిక్చర్ ఎన్‌జాయ్ చేసాము" అన్నాను

"మీరు లేకపోతే నేను కుర్చీలో అలాగే పడివుండేదానిని మీరు నిజంగా నాకు ఆప్తమిత్రులు ఈ గొడవలోపడి అసలు మిమ్మల్ని గురించిన విషయాలు తెలుసుకోలేదు. అయితే మీరు ఏ ఉద్యోగం చేస్తున్నారు" అంది

"ఏదో చిన్న ఉద్యోగం అసిస్టెంటు ఇంజనీరు ఈ మహాపట్టణంలో ఎంతమందో నాలాంటివాళ్ళు మానాన్న పోతూ పోతూ కొంచెం ఆస్తిగూడ ఇచ్చివెళ్లాడు" అన్నాను

"ఇది చిన్న ఉద్యోగమా? భలేవారే మీరు. ఇప్పుడు కాకపోతే భవిష్యత్తులోనైనా పెద్దఇంజనీరు అవుతారు ఎంతమందో ఇప్పుడు విదేశాలకు స్కాలర్‌షిప్ మీద వెడుతున్నారుగదా, మీరేమి ప్రయత్నంచేయటంలేదు?" అంది.

"ప్రయత్నంచేసినా వెంటనే అవుతుందా! దానికి ఎంత రికమెండేషన్ వుండాలి నా వుద్యోగంసంగతి అలా వదిలిపెట్టండిగాని మీరేమి చేస్తున్నారో, మీవారేమి చేస్తున్నారో చెప్పారుకాదు" అన్నాను.

"నేను బోటని ఆనర్సు చదువుతున్నాను. మావారు అమెరికాలో వున్నారు" అంది తెచ్చుకున్న నవ్వును ఆపుకుంటూ. అదే నవ్వు, "గీతాశేఖర్" అని చెప్పినపుడు నవ్విన నవ్వే నాకామసకచీకటిలో ఆమెముఖంలో వుండే మిగతా భావాలు కనిపించలేదు.

"మీరు చదువుకున్నందుకు సార్థకత సంపాదించారు. మీరేకనక బిడియపడి టికెట్ ఇయ్యటం మానేస్తే అది వృథా

# ★ అబద్ధం రక్షించింది ★

అయిపోయేది. నేను మళ్లీ రేపు వచ్చేవాడిని. ఇవాళ మూర్తికోసం నేనుకూడ మానుకోక పోవటం నిజంగా నా అదృష్టమే మీ పరిచయం లభించింది" అన్నాను "ఇవాళ ఇలా జరుగుతుందని పుంగి ఎవ్వరూ అనుకోవక్కర్లేదు ఇందులో ఉపయోగం ఇద్దరిదీను. అదుగో మా యిల్లు వచ్చేస్తోంది ఆ.. కుడిపక్కన పెద్ద మేడలేదూ! అక్కడ ఆపండి రేపు తప్పకుండా వస్తారుగదూ, మా నాన్నగారికి పరిచయంచేస్తాను మళ్లీ కొరడంటానికి వీలు లేదు. తప్పకుండా రావాలి" అంది ఇంతలో ఇల్లు వచ్చేసింది "రేపు కాకపోతే రెండు రోజులు ఆగి గాకూడదు మా ఆవిడని గూడ మీకు పరిచయంచేస్తాను పోనీ రెండి, మీకు కోపం వస్తున్నట్టుంది రేపే వస్తాను" అన్నాను ఈ మాట వినగానే గీతహృదయం స్తంభించిపోయింది. ముఖవర్ణం ముకుళించుకుపోయింది ఆమె ముఖకవళికలు ఆ మసకచీకటిలో బాగా కనిపించలేదు ఆమెకోపం అంతా నా కారు తలుపుమీద చూపించింది బహుశ మనసులో నేను రాకూడదని అనుకుని వుంటుంది.

జరిగినసంగతి అంతా మూర్తికి పూసగుచ్చినట్లు చెప్పాను

"నేను చెప్పానా! ఓడదామనుకున్న రోజున వెళ్ళమని ఎవరికి ఎప్పుడు వీలయితే అప్పుడు పోవాలంటాను మొత్తానికి భలే ఛాన్స్. కంగ్రాట్స్" అన్నాడు మూర్తి

"ఏమిటి ఛాన్స్? నీ తలకాయ. ఆమెకి పెళ్ళయింది ఇవాళ వాళ్ల నాన్నగారికి పరిచయము; కాఫీ అంతేనా" అన్నాను వాడిధోరణి నచ్చక.

"ఏమో" అన్నాడు.

ఆవేళ సాయంత్రం ఆఫీసునుండి తొందరగా వచ్చి, వాళ్లఇంటికి వెళ్లాను గీత, వాళ్ల నాన్నగారు నాకోసం ఎదురు చూస్తున్నారు. తిన్నగా లోపలికి వెళ్ళాను. "నాన్నా, వీరే Mr చంద్రశేఖర్" అంది గీత. "సారీ! గీతగారు, నా పేరు గోపాల్" అన్నాను గీతాశేఖర్ ముఖం కోపంతో భగభగ మండిపోతోంది. నేను అదేమి గమనించనట్లే వాళ్ల నాన్నగారితో మాట్లాడుతున్నాడు. పరిచయవాక్యాలయినతరువాత, గీతని ఇంటివద్ద దింపినందుకు, కొద్దిగా స్మృతి తప్పగానే జాగ్రత్త తీసుకున్నందుకు అనేకవిధాల కృతజ్ఞత తెలియచేశారు. మాటలసందర్భంలో మా కుటుంబం సంగతి, నాన్నగారి ప్రసక్తి వచ్చింది. నేను ఫలానా ఆయన కొడుకునని చెప్పారు. అది వినగానే ఆయన "ఎవరు? గోపాలం! నువ్వా నాయనా! ఏమే మా చెల్లెలుకొడుకు గోపాల్ ఇవాళ ఎవరిముఖం చూశానోగాని నిజంగా ఎంత సుదినం" అంటూ ఆయన కనుకొలకులనుండిరాలే ఆనందబాష్పాలు తుడుచుకున్నారు నాకేమీ అర్థంకాలేదు. మా అమ్మ ఈయనచెల్లెలా? మళ్ళీ ఆయన మొదలుపెట్టారు. "గీతా, మీ బావమ్మ మీ అత్తయ్య పోయేనాటికి నువ్వింకా పుట్టలేదు వీడికి రెండేళ్ళు వుంటాయేమో మా అమ్మ అడిగింది వీడిని ఇచ్చెయ్యమని, తను

పెంచుతానని. కాని వాళ్లనాన్న వీలులేదన్నాడు. వాళ్లనాన్న మళ్లీ పెళ్ళి చేసుకున్నాడు. అంతే అప్పటినుండి వీడిసంగతే తెలియలేదు" అన్నారు. నాన్నగూడ చచ్చిపోయినట్టు చెప్పాను. అలా జరిగినందుకు ఆయన విచారం వెల్లడించారు. నాన్నగారి ప్రస్తావన అయినతరువాత నన్ను గురించి అంతా అడిగితెలుసుకున్నారు. ఎంతో ఆనందించారు నేనింత అభివృద్ధిలోకి వచ్చినందుకు. మళ్ళీ అన్నారు ఆయన. "అయితే గోపాల్ నీభార్య ఎప్పుడు తీసుకువస్తావు? రాత్రి అమ్మాయి చెప్పింది. అయితే నాకు సుభలేఖన్నా వెయ్యకుండా పెళ్ళిచేసుకున్నావన్న మాట" అన్నారు.

"క్షమించాలి, నాకు ఇంకా పెళ్ళి కాలేదు. ఏదో సరదాకి అన్నాను అంతే" అన్నాను గీత కాఫీకలుపుతూ తల పైకెత్తి చూసింది ఆమె పెదిమలు సన్నగా వంపు తిరిగాయి. వస్తున్న నవ్వును ఆపుకోటానికి ప్రయత్నిస్తోంది.

"అయితే మీ అల్లుడుగారు అమెరికా నుండి ఎప్పుడు వస్తారు? వెళ్ళి ఎన్నాళ్ళయింది? వస్తేమాత్రం నాకుకబురుచెయ్యండి" అన్నాను.

"ఎవరూ! అల్లుడా అమెరికానుండా" ఆయనకి మూర్ఛవచ్చినంత పనయింది గీత ముఖం రంగులు మారుస్తుంది. "అంది . అలాగే అంది మా బా.. గా టోపీ వేసింది" అంటూ పొట్ట చెక్కలయ్యేలా నవ్వుతూ కాఫీ అంతా టేబుల్ మీద ఒలకపోశారు. గీత లోనికి పరుగెత్తింది అప్పటికర్థమయింది గీతచేసిన తమాషా

తరువాత ఏమయింది చెప్పనక్కర్లేదనుకుంటాను. అమెరికా అల్లుడి స్థానాన్ని నేను ఆక్రమించాను. నా ఫ్రెండు చెప్పినది కరెక్టు అయింది.

గీత తన గొప్పతనాన్ని చాటుతూ వుంటుంది పదే పదే నన్నలా ఫూల్ చేసింది. "ఆహా హా! నాపేరు చంద్రశేఖర్ అనగానే అమ్మాయిగారి మొహం చూడాలి. మా ఆవిడనిగూడా తీసుకువస్తానన్నపుడు చూడాలి ఆముఖం. నాకారు తలుపు బ్రద్దలయిపోతుందేమో ననుకున్నాను అమ్మాయిగారి కోపానికి" అన్నాను

"మా బాగా అయింది పాపం! లేకపోతే నన్నేడిపిద్దామనుకున్నావా? ఆహాహా. మిసెస్ గీతాశేఖర్ అనగానే చూడాలి అబ్బాయి మొహం ఎలా వుందో అబ్బ! ఏమి ముఖం! ఆముదం తాగినవాడిలా వుంది ఆముఖం" అంటూ నవ్వుతూ ఉడికించేది. ★

# తాళంచెవులు

నా మాట ఎవరూ మర్యాదకైనా వినడం లేదు నాకు ఏడుపొస్తుందనిపించి ఆ ఆలోచనతో కొద్దిగా నవ్వొచ్చింది. బాగానే ఉంది! షేక్స్పియర్ చెప్పిన 'తిరిగి వచ్చే శైశవం' కాబోలిది! కాకపోతే నలుగురూ నామాట వినడంలేదని ఏడుపు రావటం ఏమిటి ఈ వయస్సులో!

మిగతా స్నేహితులంతా ఇంకా వాదిస్తూనేఉన్నారు వాదిస్తారు. వాళ్ళకేం! సీరియస్‌గా తీసుకోకపోతే ఆటంబాంబు, అగ్నిపర్వతంకూడా కమ్మగానే ఉంటాయి నలుగురూ వినేలా చప్పరించడానికి. నేనెంత ఘోషించినా వాళ్ళెవరూ పట్టించుకోరే! పైగా నవ్వుతున్నాడు ఒక్కొక్కడూ అరవై ఏళ్లు నెత్తికెక్కినా ఇంకా ఒక్కడికీ పెద్దమనిషితరహా నిలపెట్టుకోడంచేతకా లేదు

నేను అన్నదిది: "తాళంకప్ప, తాళంచెవి అన్నవి కొత్తలోతుగా ఆలోచిస్తే అతి నీచమైన వస్తువులు. అవి మనిషిమీద మనిషి విశ్వాసాన్ని అపహాస్యంచేస్తాయి వాటిని చూసి సిగ్గుపడాలి ఈ నాగరిక మానవుడు" అన్నాను. అంతే. అందరూ విరగబడి నవ్వారు. శ్రీహరిరావు మరీని నవ్వడమే కాకుండా 'తాళంకప్ప, తాళంచెవి'.. నమ్మకం, నిజాయితీగల ఫలానా బీరువాలనే వాడుడు. భద్రతకు చిహ్నము," అని ఉచితంగా, అయాచితంగా ప్రచారంచేస్తున్నాడు తాళంఉన్న బీరువాలకి

వాళ్ళకి నచ్చచెప్పాలని చూశాను నా వాక్చాతుర్యాన్నంతటినీ వినియోగించాను. అచ్చే వాళ్ళు నమ్మనివిషయాల్ని నమ్మించడం ఎవరితరం? డెమాస్తనీసు, సురేంద్రనాథబెనర్జీ ఆఖరికి గిరీశంకూడా ఆపని చెయ్యలేరు. అడవిమనుష్యులు! మళ్లీ తాళంకప్పలు ఉండాలంటారు? అడవిమనిషి ఇతరవిషయాల్లో ఎంత అమానుషంగా ప్రవర్తించినా తాళంకప్పలు వాడకపోడంతో అతను నాకు ఆదర్శప్రాయుడయ్యాడు. అతను తనజాతివాళ్ళని తనలాగే భావిస్తాడన్నమాట. ఇనప్పెట్టె తాళంచెవులు గలగల్లాడించుకుంటూ, పెళ్లాన్నికూడా నమ్మకుండా వెంటతీసుకుపోయే ఓ నాగరికుని మానవత్వం ఆటవికుడి మానవత్వంకంటె ఏం ఎక్కువ? ఈవాదన ఘాటుగా ఉందనిపించి వెంటనే బయటపెట్టాను. వాళ్లు ఇంకా తీక్ష్ణంగా నవ్వడంసాగించారు.

సుబ్బారావు ఒక్కడే దూరాన కూచుని పేపరు చదువుతున్నాడు కొంచెం కులాసాగా కనిపించిందికాబోలు పైకి చదివాడు. "ఇద్దరు మనుషులు ఒక లక్షాధికారి ఇంట్లో పదివేలరూపాయల రెండుఅణాల తొమ్మిది పైసలు దొంగిలించారు సమంగా పంచుకోగా పైగా మిగిలినపైసను ఒక కంసాలివద్దకు తెచ్చి రెండు చేయమన్నారు. కంసాలి వాళ్ళ ముఖారవిందాల్ని చూసి అనుమానించి"

శ్రీహరిరావు ప్రశంసాపూర్వకంగా అన్నాడు "ఏం నిజాయితీ?"

"నీకార్థం దొంగతనం చేశారంటున్నాడాయె నిజాయితీ ఏమిటి?"

"నిజాయితీకాక మరేమిటీ. పెద్దపులి పేరంటాలికి వెడుతుందా అన్నట్టు వాళ్ళలో నిజాయితీ లేకపోతే ఎవడోఒకడు రెండో వాణ్ణి దగాచేసో, పీకకోసో అంతా స్వాహా చెయ్యచ్చుగా!" గర్వంగా అన్నాడు శ్రీహరిరావు చిత్రం! ఈఆలోచన ఆ దొంగలిద్దరికీ రానేలేదు, ఒకానొక పెద్దమనిషి శ్రీ శ్రీ శ్రీ శ్రీహరిరావుకి ఒచ్చింది!

## "జ్యేష్ఠ"

శ్రీహరిరావుకి అటువంటి ఉద్దేశాలున్నాయనికాదుకాని అదీ సాధ్యమే. ఓ మనిషిని దోచినవాడు తోడుదొంగనిమాత్రం ఎందుకు దోచలేడూ? అంతవైచిత్ర్యంలోనూ అదోనీతి! మనిషిలో ఒక్కొక్క సుగుణం ఉంటుంది బురదలో పద్మంలాగా.

ఆ 'దొంగ' గొడవలోపడి అసలు గొడవ మరిచాను.

అసలీ తాళంచెవుల ద్వేషం నాకీనాటిది కాదు. నేను గిండీలో ఇంజనీరింగ్ చదువుతున్నప్పుడే కలిగింది. కాని యవ్వనపు సమస్యలే వేరు — వాటిల్లో నికార్సయిన సమస్య ఏదీ ఉండదు. కాని ఆ సమస్యలలోనే ఉంటుంది ఆనందం అనేది పెద్దవాళ్లమయ్యాక బోలెడన్ని విజయాలు చూస్తాం, అనుభవిస్తాం. కాని నాకు పదేళ్లప్పుడు హార్మోనియంమీద "రఘువంశ సుధాంబుధి" వాయించడం మొదటిసారి చాతనయినప్పుడు కలిగిన ఆనందం ఇంకెప్పుడూ కలిగినగుర్తు లేదు ఈ అరవైయేళ్ళవరకూ . ముందుకలిగే అవకాశమూలేదు ఇంతమాట్లాడేనా! చాదస్తం వృద్ధాప్యపు లక్షణాల్లో ఇదొకటి. యౌవనుల్లో చాదస్తం ఉందంటే దానర్థం వాళ్లవి ముసిలి మనస్సులన్నమాట.

నేనూ, హనుమంతరావు అనే మరో వాడూ ఓరూం తీసుకుని ఉండేవాళ్లం. గదికి తలుపుంటుందిగా . తలుపుంటే తాళమూ ఉంటుంది ఆ తాళంకప్పకి ఒకటే చెవి. అది జేబులో వేసుకుని హనుమంతరాయ్ ఎక్కడికో పోయేవాడు నా బతుకు వీధి పాలయ్యేది 'హోవిథ్' అనుకుంటూ ఏ అరుగుమీదో కూర్చోనేవాణ్ణి బి. యీ. చదువుతూ ఇదేం ఖర్మం అని ఏడుపొచ్చేది. చూడండి. చలీ, వీధిలో అనికాదు బాధ— బి. యీ. స్టూడెంటు అరుగుమీద కూర్చోడమేమిటీ అనీ? మనిషి ఇలాగే కొన్నాళ్లకి మనిషిలా ఆలోచించడం మానుకుంటాడు. పోలీసు పోలీసులాగే ఆలోచించడం నేర్చుకుంటాడు; నేను సామర్సెట్‌మామ్ నవలలు చదివి అతను డాక్టరని అనిపిస్తోందంటే మా రెండోవాడు మామ్ మెడిసిన్ చదివాడు కాని ప్రాక్టీస్ చేయలేదన్నాడు... ఇంతకీ నేనేంచెప్తున్నానూ.. ఆఁ హనుమంతరావు సంగతి నాకూ హనుమంతరావుకీ ఆ విషయమై పోట్లాటలు జరిగేవి. హనుమంతరావునాన్న లక్షాధికారి. అంచేత వాడికి బాధ్యతలూ అవీ తెలియవు. మనకి ఓరూమ్‌మేటు అనబడే ఒకడున్నాడు, వాడికి రూంకొచ్చాక లోపలికి వెళ్లాలనే కోరిక ఉండడం సహజం, మనం తాళంచెవి ఏ పొరుగింటి బామ్మగారికో ఇచ్చి 'ఇచ్చ వచ్చిన నీతిని పోడం ఉత్తమం, అని వాడికి అనిపించేదేకాదు. ఆలోచించగా ఈ విషయంలో వాణ్ణి తిట్టి, నీతులు పాఠంచెప్పి ప్రయోజనం లేదనిపించింది. ఏ సమస్యకైనా మొదలెక్కడో చూడ్డం మంచిది. ఆలోచించాను. అసలు కారణం తాళంకప్ప. గదికి తాళం లేకపోతే హనుమంతరావుని అనవలసిన అవసరం ఉండదు

"గదికి తాళంవేయడం మానేద్దాం" అన్నాను హనుమంతరావు నాకు మతిభ్రమించిందేమో నన్నట్లు చూశాడు. నేను ధీమాగా నవ్వాను నా ఆలోచన అనాచరణీయమైనా, అపురూపం కాదూ! మానవ

# ★ తాళంచెవులు ★

...త్యాన్ని ఆకాశానికెత్తే ఆలోచనే ఇంతవరకు మహాత్ములకే వచ్చింది! "ఈ ఆస్తిపాస్తులూ, నగలూ, నాణాలూ ఎందుకివన్నీ!" అనేకదా గొప్పవాళ్ళంతా బోధించింది ఆ బోధన చివర వాళ్లు చెప్పని, చెప్పదగిన మాటేమిటంటే 'ఇక నీకు తాళంకప్పల బాధ ఉండదు' అనేకదా!

వసే హనుమంతరావు తాళంచెవి పక్కింటి శామ్మగారి కిచ్చి వెళ్ళేవాడు ఆవిడకి కళ్ళు మసక. నేను తాళంచెవికోసం అడిగితే ఆవిడ నాచేతులు తడిమిచూసి "నీచేతికి మురుగుల్లేవు నువ్వు దొంగవెధవ్వి (హనుమంతుడిచేతిని మురుగులున్నాయి వాడు ఇంజనీరయినా మురుగులు విడిచిపెట్టలేదు. పెళ్ళాంనగలన్నీ కొనగా తనకూడా నగలు కొనే తాహతు తనకుందని చెప్పుకోవాలనీ!). పో! నాకు తాళం ఇచ్చింది, ఆ మురుగుల పుత్రాడు" అన్నది. ఆవిడ అమాయకత్వం అలాంటిది ఆ మురుగులబ్బాయి తాళంచెవికొరకలసివచ్చే మరోమురుగుల్లేని అబ్బాయి సౌకర్యార్థమే కాకపోతే తనకి తాళంచెవి ఇవ్వడం ఎందుకు? అనే ఆలోచనలేదు ఆవిడకి! మాతరంవాళ్ళకి ఎంత అమాయకత్వం ఉంటే అంత మంచిది నీళ్ళల్లో తన నీడచూసి ఎవరో పుత్రాడందులో ఉన్నాడని ఊరందర్నీ వాడల కొట్టిన ప్రబుద్ధుడొకడుండేవాడు మాలో. వాణ్ణి అప్పుణ్ణుంచీ 'మృగరాజు' అని గేలిచేసేవాళ్లం. పంచతంత్రంలో ఓ కథ ఉంది—ఈమధ్య ఆంధ్ర పత్రికలో బొమ్మలకథగా పడిన పంచతంత్రం. మేం అది కథగానే చదువుకున్నాం. అప్పటివాళ్లకిలా బొమ్మల్లో కథలు చెప్పడం అంతగా తెలీదు-కుందేలు సింహాన్ని నూతిలో నీడచూపించి దూకేలా చేస్తుంది, ఆ కథలో మృగరాజన్నమాట

అప్పటికే నాకు తాళంచెవంటే వద్యాభరం వన్నగిల్లి ప్రారంభించింది జేబులో చిల్లర ఎక్కువగా ఉంటే గుల్ల తాళంకప్పలుకొని ఎవరూ చూడకుండా పప్పుచేసేవాణ్ణి తలుచుకుంటే నవ్వొస్తుంది ప్రపంచంలోని తాళంకప్పలు కొన్ని ఇలా తగ్గుతాయీ అని కాబోలు అనుకునేవాణ్ణి

తాళం కప్ప ఏ దుర్మార్గుడు కనిపెట్టాడో కాని— వాడు డబ్బు కనిపెట్టినవాడి తోడల్లుడై ఉంటాడు. ఇద్దరూకలిసి శనిదేవత అల్లుళ్ళు మానవత్వంపాలిటి యమదూతలు

నేను డబ్బునిల్లా తిడుతూంటే మీక్కోపం రావచ్చు. "ముసలాడు ఇప్పుడు ఎన్ని కబుర్లైనా చెప్తాడు—అన్నీ సుఖాలూ అనుభవించేక" అని కాని దాన్నిగురించి వాదించడానికి చాదస్తం ఒక్కటే చాలదు. పుర్రవాళ్ల ఓపిక కావాలి నాకు చాదస్తం ఉంది కాని ఓపికలేదు కాని ఒకటే నిజం—ఈ నాణాలు రాకపూర్వంకూడా సంపద ఉండేది.

నేను ఉద్యోగంలో చేరాక ఈ తాళంచెవుల్లో అనుభవించిన బాధలు ఇన్నీ అన్నీ కాదు వాటిలో చాలావాటికి మాఆవిడ కారణం. ఇప్పుడు నేనా బాధలు తల్చుకుంటే నవ్వుతూ ఉంటుంది

ఓ మారు ఆవిడ బయటుంది-బయటున్న మనిషి తిన్నగా ఉండచ్చా? ఉహుఁ వరండాలో తన బిచాణా పరచింది నేను ఆఫీసు కెళ్లాక ఇంటికి తాళంవేసి ఆ తాళంచెవి మైలగుడ్డలమీద భద్రంగా ఉంచి (దొంగలొస్తే తాకరని కాబోలు) పెత్తనాలకి పోయింది నేను సాయంత్రం ఒచ్చిచూస్తే తాళంచెవి తాకరానిచోట ఉంది. ఏం చేసేది? దిక్కులేనివాళ్లు ఏం చేస్తారో అదే చేశాను నెమ్మదిగా రాత్రి ఎనిమిదిగంటలకు ఇంటికొచ్చింది మహా ఇల్లాలు ఏమిటిది?

అని అడిగితే "ఈమాత్రందానికేనా? అయ్యో?" అని చేతులూపుతూ ఆటవిక నృత్యం చేసింది మెల్లగా అడిగితే ఇది తంతు కొంచెం ధాటీగా "అడిగావా! ఆయుధం ఉండనే ఉంది. ఉధృతంగా కనురెప్పలచేత కసరత్ చేయించి కన్నీరు కార్చి 'ఆడదై పుట్టడంకన్న అడవిలో మానై పుట్టడం మేలు" అనేయడం "మానుని పెళ్లాడితే చక్కగా పచ్చనిచీర కట్టకుని, చిగుళ్ళూ, పువ్వులూ వేసుకుని కలకల్లాడుతూ ఉంటుంది (నీకుమల్లే ఏడవకు) అప్పుడు తాళంచెవులు మైలబట్టలమీద ఉంచి ఊరేగను కూడానూ" అన్నాను ఓ మారు ఆవిడ ఏడిశావులే నిన్ను మూడు గంటలు ఇంట్లోకెళ్ళకుండా చేశానా లేదా?" అన్నట్టు తల ఆడించి, "చెప్పాగు లెండి. మహా" అంది మనిషికి తాళంచెవి ఇవ్వాలనే ఆలోచనే రాదే! ఏమైతేనేం మూడు గంటలు నిష్కారణంగా పోయాయి. తాళంచెవి సమస్య లేకపోతే నేనప్పుడు రామాయణం చదివి ఉందును రామాయణంలో పిడకలవేట అంటే అదే కాబోలు అలాంటిదే.

ఆఫీసు కాగితాలు దాచిన పెట్టెతాళం పోయిందో సారి పోడంకాదు గుత్తిలోంచి జారిపోతే మా ఆవిడే మెంతులడబ్బాలో పడేసింది ఆ కాగితాలు తెమ్మనేవాడు ఆఫీసరు

"పెట్టెతాళం పోయింది సార్"

"నే నడిగేది తాళం కాదండి డాక్యుమెంట్స్"

"చిత్రం. రెండిటికీ సంబంధం ఉందండీ నా విషయంలో"

"ఇంజనీరింగులో తాళం చెవికీ, ఆఫీసు ఫైలుకీ ఏం సంబంధం లేదనుకుంటాను లేక ఏమైనా రీసెంట్ గా కనుక్కున్నారా?" అని అనుమానంగా అడిగేడు. "మీరు బి యీ యేనా అది కాకుండా"

మా రెండోవాడు ఓ కొత్తరకం తాళంకప్ప తీసుకొచ్చాడు దానిలో అయిదు రింగులుంటాయి వాటిమీద ఏవేవో అక్షరాలుంటాయి అయిదు రింగులమీద ఉండే అక్షరాల్లో ఓ అయిదు (అవి ప్రతితాళానికీ మారుతూ ఉంటాయి) ఓ వరసలో ఉన్నప్పుడు మాత్రమే ఆతాళం తెరిచే వీలుంది వసే వీడు సెలవలకి బనారస్ నుంచి వస్తూ ఆతాళంకప్పతెచ్చాడు. అది నాబీరువాకి వేశాడు. వాడు ఆప్యాయంకొద్దీ ఇచ్చాడు కదా అని వాడుతూన్నాను ఆ బీరువాలో నే నాకళ్లజోడూ, పుస్తకాలూ, బట్టలూ ఉండేవి ఉన్నట్టుండి ఆ అక్షరాలు మరిచిపోయాను తాళంరాదూ. అబ్బాయి నడిగితే వాడూ తప్పు చెప్పాడు వాడిస్నేహితుడెవడికో తెలుసుట, వాడికి ఉత్తరం రాశాడు. ఆ మూడురోజులూ నేను పడ్డబాధ దేవుడి

కెరుక. కళ్ళజోడు లేకపోతే నాకెయ్యి నాకు సరిగా కనిపించదు. నేను తెలుగు భారతం పది పద్యాలేనా చదవందే ఉండ లేను రెండూ బీరువాలో నే ఉన్నాయి, ఆ స్నేహితుడు మంచిలెక్కల్లో మనిషి— అసలు పేరు టెలిగ్రాం ఇచ్చాడు మావాడి ఉత్తరం అందగానే ఇతరుల గురించి అంత శ్రద్ధగలవారు అరుదు.

ఇన్నిమార్లు తాళంకప్పలు నాచేతగడి తినిపించినా తమిస్తూ ఒచ్చాను—"దొరకని పక్షిని వేటగాడు చంపకుండా విడిచిపెట్టి నట్లు" అనిపించి నేనే నవ్వుకుంటూ ఉంటాను. మన అసమర్థతచూసి నవ్వుకోడం మనకి చాతనవాలి అప్పుడు మరొకళ్లు వేలెత్తిచూపితే వాళ్ళంటే మింగేసే కోపం కలగదు

నాద్వేషం క్లైమాక్సు నందుకున్నది మా పెద్దమ్మాయి పెళ్ళిలో. అది కాలేజీలో తనతో చదువుకునే ఓ కుంకాయిని ప్రేమిం చింది. సిగ్గుతో మాతో చెప్పకుండా ఒచ్చిన పెళ్ళిసంబంధాలన్నిటిని తిప్పికొట్టడం సాగించింది! ఇది పురుషద్వేషిణి కాదుకదా, మరి ఒక్కసారికూడా చూడకుండా ఆ యువమర్కటాల్ని నిరాకరిస్తోందే, ఏదో కారణం ఉండాలని నిలదీసి అడిగితే అసలుకథ బయట పెట్టింది. సరే ఆసంబంధమే ఖాయంచేశాం. కట్నం మూడువేలూ మొయ్యడానికి వీలుగా ఉంటుందని చిన్న సూట్‌కేసులో ఉం చాను. మా ఆవిడ తాళంవేసి చెవి తనదగ్గరే ఉంచుకుంది. ముహూర్తం దగ్గిరపడుతోంది. ఆవిడని తాళంచెవి అడిగాను. ఉలిక్కి పడింది. వాకబుచేస్తే మా తోడల్లుడి కొడుకు నాలుగేళ్ళవాడు దాన్ని పాటవ పెట్టు కున్నాడని తేలింది (నిజంగానే మింగే శాడు!) మా వియ్యంకుడు అది విని అనుమాన ముగా చూశాడు, నేను కట్నం ఎగయ్యా లనిచూస్తున్నానేమోనని. అది నాజీవితంలో కల్లా పెద్ద అవమానం నిజానికి నాలో నేను ఏ అవమానమూపడేలా ప్రవర్తించలేదు. కాని కలుగుల్లోనూ? వెంటనే సూట్‌కేస్ తెచ్చి గొడ్డలితో తాళం పగలేసి నోట్లూ, నాణాలూ నివేదించుకున్నాను. పెళ్ళి ఐదు రోజులూ ధుమధుమ లాడుతూనే వున్నాను.

ఆ తర్వాత ఆవిడదగ్గర తాళం చెవులుత్తి తీసుకొని ఇంట్లో వున్న ప్రతి తాళంకప్పా తెరిచేశాను. గుత్తి బావిలో పడేస్తానంటే చిన్నమ్మాయి అడ్డుకుంది. "మనం అనుకున్న వన్నీ చెయ్యలేం నాన్నా. జీవహింస అని, పాలు పిండడం మానుతున్నామా? లేని పిండడం మానుతున్నామా? నిజమే తాళం తాళి మనిషి సర్వమానవ సౌభ్రాత్రానికి తల వంపే. నేను పెట్టికి తాళం వేయలేదోసారి అన్నయ్యగా రబ్బాయి ఒచ్చేసి నా గ్రీటిం

ద్నూకి పంపాలని కొన్న గ్రీటింగ్ కార్డుల మీద "కాకి నక్క అ ఆ ఇ ఈ"అంటూవాడి చిన్నభాషలో ఆధునిక కవిత్వం రాసేశాడు. మనకీ పరిస్థితులలో తాళంచెవి లేందే బతుకే లేదు" అని చెప్పింది. అమ్మాయి తెలివి చూస్తే ముద్దొచ్చింది. కాని—నిజం చేదు. మనుషులు అందరూ 'మన పరిస్థితుల్లో ఇంత కంటె గత్యంతరం లేదు' అని ఊరుకునే వాళ్ళయితే వోల్టెయిర్ ఎవరు? వీరేశలింగం ఎవరు? రామ మోహనరాయలు ఎవరు? అసంతృప్తిలోంచే కదా సంస్కరణా, పురోగమనం ఒచ్చేది! ఒంటెద్దు బండితోనే మనిషి తృప్తిపడి ఉంటే.

కాని ఏం చెప్పాలో తెలియలేదు "నువ్వు చెప్పింది నిజమేతల్లీ, కాని—" అని క్లబ్‌కొచ్చేశాను. అది ఊళ్ళోఉన్న రిటైరైన పెద్దమనుషులం స్థాపించినది దాని కింకా పేరుపెటలేదు. 'గ్రేబియర్డ్' అని ఒకరు సూచించారు. కాని అది మోటుగా ఉంది. 'సెకండ్ చైల్డ్‌హుడ్' అనాలని మరొకరు ఏదీవద్దని ఇద్దరు; అది కోరికలు చంపుకోడానికి చిహ్నంట!

క్లబ్‌లోనైనా మెదడూ మెదడూ రాపా డితే ఏమైనా పరిష్కారమార్గం జ్వలించ వచ్చునని ఆశపడి చర్చలేవదీశాను కాని జోగీజోగీ రాసుకుంటే బూడిదే వన్నట్టు రెండు తెల్లతలల సంఘర్షణల ఫలితం శిరో వేదన అయికూర్చుంది.

* * *

ఆలోచించాను. ప్రస్తుతవ్యవస్థ ఉన్న న్నాళ్లూ తాళంకప్ప తప్పదు; అసలు నాగరికతే చాలావరకు నాకు నచ్చదు. అసలు నాగరికత లక్ష్యమేమిటి? నల్లరాతి లాంటి ఆదిమమానవుణ్ణి నాగరికత తన సూత్రాలతోటీ, నియమాలతోటీ చిత్రిక పట్టి సుందరశిల్పంలా చేయాలనీ అసలు ఆశయం. ఆదిమమానవుడు ఇప్పుడు కొద్దిగా దవడఎముకల్ని మార్చుకున్నాడు, బట్టలు వేసుకుంటున్నాడు, భాష వాడుతున్నాడు, పరిశోధనలు చేస్తున్నాడు. కాని తనతోటి మనిషిని బాధించడం, ద్వేషించడం మానాడా? కుట్రలూ, కుతంత్రాలూ, విష వాయువూ, దొంగసభ్యతా, ఇత్యాది విషయాల్లో అనాగరీకులే నయం (వాళ్లకి తాళంకప్పల అవసరం లేకపోబట్టి సోదర భావం ఎక్కువఅని తేలుతుంది)

ఎక్కడికి పోవాలో తేలలేదు.

మా పెద్దవాడికి ఏజెన్సీలో ఉద్యోగం ఐంది మేం అక్కడ ఉంటేది చిన్న ఊరే చుట్టూ కొంతమైదానం దాని చుట్టూ కొండలూ, చక్కని ప్రకృతి నడుమ సెల యేరుల్లా మెరిసే దారులోద్దు.

నేను ఊళ్ళో ఉండనన్నాను. చూస్తూంటే నాకు తాళంకప్పలు, తాళం చెవులతో పిచ్చెత్తేలా ఉంది. ఇప్పుడు వికారం కలుగు తోంది. కడుపులో ఓ బొంగుతాళంచెవితో ఎవరో కెలుకుతున్నట్టు బాధ.

పోట్లాడాను ఊరవతల కొండపాదాలవద్ద నాకో గుడిసె వేశారు. తలుపులు వద్దన్నాను కాని చలిగాలి వీస్తే కొయ్యబారిపోతావని తలుపులు బలవంతంగా కట్టారు.

నాకు మంచం వద్దన్నాను. మా వాడు బతిమాలాడు. అంతగా నేను నేలమీద పడుకోడం ఇష్టంలేకపోతే ఓ అరుగు కట్టించమన్నాను

నాగరికతలో ఉన్న సుగంధం ఒక్కటే. అదే సాహిత్యం—పోనీ లలిత కళలు. ఇదే ఈ కీకారణ్యంలోని సుగంధకుసుమాలు. మిగతావన్నీ నిర్గంధకుసుమాలు. దొంగతేళ భక్తి, కుహనా సంస్కారం, ఆర్థిక బాధలు ఇవన్నీ ముళ్ళు. అదీ నాగరికత నాకు పుస్తకాలు కావాలన్నాను. ఎందుకు అజ్ఞానం? జ్ఞానంకోసమే జ్ఞానం అని సమాధానించు కున్నాను

కొన్ని నెలలు శ్రమించి ఓ చిన్న ఉద్యానవనం తయారుచేశాను ..

ఒక్కొక్క రోజున నాకు మనిషి అన్న వాడు కనపడ్డు. మనిషిమాట వినకుండా నాలుగేసి రోజులు గడిపిన సందర్భాలు న్నాయి. పిట్టలు మాత్రం జాస్తిగా ఒస్తూ ఉంటాయి. ఉదయాన్నే కొంతసేపు భగవ ద్ధ్యానం చేసి పుస్తకం ఒడిలో పెట్టుకుని ఇవతల ఎండలో కూర్చుంటాను, పిట్టలు మాట్లాడుకుంటూ ఉంటై—అదేదో వాళ్ళ ఇల్లయినట్లు ఓ చక్కని ఇల్లాలు భర్తతో ముచ్చటిస్తున్నట్లు హుందాగా మాట్లాడుతూ ఉంటాయి రెండు పక్షులు. చూస్తూ ఉంటే సూర్యుడు చూరెక్కుతాడు—పుస్తకం నిద్రపోతుంది.

పగలో, రాత్రో కలల్లో ఇల్లూ, పిల్లలూ గుర్తొస్తారు నేను వాళ్ళకి దూరమై సాధిం చేదేమిటి? అని ఒళ్ళు జల్లుమనిపిస్తుంది. వెం టనే పోయి 'నా ఇంటి' తలుపు చూస్తాను— అప్పుడే పుట్టిన పాపలా బోసిగా నవ్వుతుంది— ఎదురు తలుపు-తాళంచెవుల్ని జయించానని ఒళ్ళు పులకరిస్తుంది—అంతే. ★

# అసంప్రేక్ష్యకారిత్వము... పంచతంత్రము ...అయిదవ భాగము




నండూరి. రామమోహనరావు
బొమ్మలు.. బాపు
పరమ దారుణమైన గాడిద
అరపు విని మేల్కొన్న రైతులు
పరుగు పరుగున వచ్చిరి
"చేలు, తోటలు పాడు చేయుట
బాలకా! ఈ గాన" మంచును
బాల మోదిరి గాడిదను
బడితె పూజలు వేసి, చివరకు
మెడకు నొకగుదిబండ
తగిలించి
విడిచి పుచ్చిరి దానిని
అన్నితన్నులు తిన్న గాడిద
తన్ను కాదను కొన్న మాదిరి
తిన్నగా నిలుచున్నది
ప్రేమగీతము మెచ్చనేరరు,
పశునరు'లని జాలిపడినది
ఝాముసేపా గాడిద
తరుల వెలువడి నక్క అన్నది
మరల పాడుము ఖరవరా! నీ
ఖరహరప్రియ రాగము.
మెచ్చి ఇచ్చిన పతకమా అది?
నిచ్చెనా గాంధర్వ గర్వము!
నెచ్చెలీ! చను మింటికి!
అవును నిజమే! హితుని వాక్యము
చెవిని పెట్టకనే గదా! ఒక
సారి పూర్వము చేతులారా
కొలువు పోయెను పాపలాము!
ఎవరా పాతె?
ఏమా కథ?

# అసమర్థుడు

శ్రీహరి ఆఫీసునుంచి ఇల్లు చేరుకునేసరికి ఆరుదాటింది. అతను ఏడాదికి నాలుగైదుసార్లు మాత్రమే వస్తాడు. మేనేజరు ఆఫీసుకు రాకపోవడంమూలాన అతను అయిదున్నరయ్యేసరికి టంచనుగా పైపు మినను మూసేసి తతిమా గుమాస్తాలతో బయలుదేరాడు. అతన్ని చూసి అందరూ వెకిలిగా నవ్వారు

'నువ్వు వట్టి అసమర్థుడివోయ్! ఇంత ఆఫీసు ఎక్స్‌పీరియన్స్ వుంది. ఇక్కడ కాకపోతే మరోచోట రాజాలాంటి వుద్యోగం దొరుకుతుంది ఎందుకిక్కడ ఎనర్జీ వేస్టు చేసుకుంటావు? మేం నీలాగ ఎనిమిదింటిదాకా పనిచేస్తున్నామా? పెద్దముల్లు ఆరుమీద కెప్పుడువస్తుందాని ఎదురుచూస్తాంటాం.' అంటూ హితోపదేశం చేశాడువో గుమాస్తా. శ్రీహరికూడా ఆమాటల్లో అబద్ధం లేదని అంగీకరించాడు కానతనిలో వున్న లోపం ఒక్కటే-ప్రతి చిన్నవిషయానికీ భయపడతాడు. మేనేజరుకూడా తన్నులోకువకట్టి వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాడు. ఎదిరిస్తే ఉన్న వుద్యోగం వూడుతుంది అప్పుడు ప్రతి ఆఫీసుకీ ఎక్కిదిగుతూండాలి చివరి కెప్పుడో మరో ఆధారం దొరుకుతుంది. ఈ బాధంతా ఎవరుపడతారు?

అదీ అతనితత్వం.

'ఆరింటికే ఇంటికెళ్ళి చేసిపొడిచేదేముంది? ఈ రెండు నరకాలమధ్య పడి చస్తున్నా' అనుకున్నాడు. అతని వ్యక్తిగత జీవితానికి సంబంధించిన సమస్య లెవరికీ తెలియవు.

'బహుశా మేనేజర్ని మెప్పించి హెడ్ గుమాస్తా కావాలనుకుంటున్నావేమో? ప్రస్తుతం వున్నవాడికి నలభై దాటాయంతే-ఇప్పట్లో రిటైరు కాడుకదా, పైనుంచి కాల్ వచ్చే అవకాశంకూడా లేదు. దుక్కలా వున్నాడు.' అంటూ హెచ్చరించాడు భవిష్యత్తులోకి తొంగిచూడగలిగిన మరో గుమాస్తా.

మెయిన్‌రోడ్డు నాలుగు దిక్కులకూ చీలిపోయేవరకూ అందరూ కలిసివచ్చారు. అందులో వొక గుమాస్తా మల్లెపూలు కొన్నాడు. వాళ్ళావిడకు అవంటే యిష్టం కావొచ్చు. మరోగుమాస్తా తనపిల్లలకని మిఠాయుండలు, పకోడీలు పొట్లం కట్టించాడు. స్వయం-తనకు పిల్లల్లేరు. శ్రీహరికూడా ఏదో కొందామనుకున్నాడు జేబులు తడుముకుంటే చిల్లికానీ తగిలింది అందుక్కారణం అతనికి జీతం తక్కువై కాదు. నూటపాతిక రూపాయలు-భార్యతప్పించి సంసారం లేదు అప్పులూ,గిప్పులూ లేవు మరోగుమాస్తా బెంగుళూరు టెయిలరింగు షాపులోంచి కొత్త పంట్లాంతీసుకున్నాడు. శ్రీహరి తనబట్టలకేసి చూసుకున్నాడు. పంట్లానికి మూడు పేచీలు-చొక్కాకి రెండుమాత్రం వున్నాయి.

'ఈ డబ్బంతా ఎక్కడ పోగడుతున్నావయ్యా? మాకు తెలిసినంతవరకూ ఈవూళ్ళో ఏ బాంకులోనూ నీకు ఎకౌంటు లేదే?' అని వరైనా అడిగితే అతను సమాధానం చెప్పడు. అదంతా వ్యక్తిగతవిషయం. అది మరొకళ్ళకి తెలియటం అతని కిష్టంలేదు.

**ఆర్. యం. చిదంబరం**

ఇంటికొచ్చేసరికి అంతా హడావుడిగా వున్నారు. వదినగారు నెలరోజులక్రితం కొన్న నిలువుటద్దంముందు నిలబడి తనపాతికేళ్ళ సౌందర్యాన్ని చూసుకుని మురిసిపోతోంది. ఆమె వంటిమీది గులాబీరంగు జార్జెట్ చీర జిగేలుమంటోంది మెళ్ళో నెక్లెసు మరోవంక పోటీ పడుతోంది

అన్నయ్య టిప్‌టాప్‌గా అరుగుమీద కొచ్చాడు.

'అరె! త్వరగావచ్చేశావే?' అన్నాడు.

'సర్కస్‌కా అన్నయ్యా?' అనడిగాడు. నాలుగురోజులక్రితం వచ్చిన సర్కసును గురించి వదిన చాలాసార్లు ప్రశంసించటం అతను విన్నాడు.

'ఛీ. అది చూసేదేవిటి? అది సరేకాని త్వరగావెళ్ళి ఓరిక్షా తీసుకురా.'

శ్రీహరి భగవంతుడికో నమస్కారం పారేశాడు అతను బ్రహ్మాండమైన ప్రోగ్రాం వేసుకొచ్చాడు. ఆవేళ తన భార్యను తీసుకుని సినిమాకు వెళ్ళాలని. సినిమాకు వెళ్ళటం అంత గొప్ప విషయమేవిటని ఎవరైనా అడగొచ్చు. కాని శ్రీహరి దృష్టిలో అది 'ఎనిమిదో విచిత్రం' అనటంలో సాహసంలేదు. అన్నయ్య సర్కస్‌కి వెళ్తుంటే తనప్రోగ్రాం అంతా గంగపాలయ్యేది. బహుశా షాపింగ్‌కి వెడుతున్నాడుగామోలు! రిక్షా వచ్చింది.

'మినర్వాలో కొత్త సినిమావచ్చిందోయ్ మీవదిన ఒక్కటే పోరు. ఆదివారం మేట్నీకి వెడదామంటే నసేమిరా వల్లకాదంటుంది'

శ్రీహరికి ప్రతిఅక్షరం ఒక్కొక్క పిడుగులా నెత్తిమీద పడింది

'అరె!.. నేనివాళ సరళను తీసికెడదామనుకున్నాను' అన్నాడు ధైర్యంచేసి

'దానికేం రేపు వెడుదువుకాని'

'రేపు మేనేజరు వస్తాడు ఎనిమిదయ్యేదాకా కదలనివ్వడుగా'

'అంతమాత్రంలో ఏం మునిగిపోయింది? నువ్వు వట్టిభయస్తుడివికనక ఓపూట ముందు రాలేకపోతున్నావు సెలవైనా పెట్టు. అంతగా వీలుపడకపోతే సెకండుషోకి వెళ్ళవచ్చు.

ఇదంతా శ్రీహరి హాల్లో వుండగా జరిగింది

వంటింట్లోకి వచ్చేసరికి సరళ పిల్లాణ్ణి ఆడిస్తోంది. అతను తనపిల్లాడైతే తనూ ఎత్తుకునేవాడు. కాని అన్నయ్యకొడుకు-కొడుకుని కూడాతీసికెడితే సినిమా చూట్టం వీలుపడదని వదిన సరళకప్పగించి పోతుంది. తన ఖర్మకొద్దీ వాడు రాత్రి పదకొండుదాకా నిద్రపోడు. శ్రీహరి భార్యను పరీక్షగా చూశాడు. కట్టుకున్న సాదాచీర బాగా మాసిపోయింది. వదినవంటిమీది సిల్కుచీర మరోసారి తళుక్కుమంది. కళ్లు లోతుకుపోయాయి. పాపం-జడ వేసుకోటానికూడా తీరిక లేదుగామోలు-స్టూలుమీదున్న పళ్లెంలో మల్లెపూలున్నాయి.

'సరళా! నేను పూలు తెద్దామనుకుని మర్చిపోయాను. నువ్వే కొన్నావుగా!'

'నేను కొనలేదండి. మీ వదినగారికెక్కువై వదిలేసింది' అంది నవ్వుతూ. ఆ నవ్వు వెనకాలుండే అర్థాన్ని గ్రహించుకునే శక్తి శ్రీహరికి లేదు. సరళ వృత్తి వెర్రిబాగులదని బి. సి.కి చెందినదని చుట్టుప్రక్కల వున్నవాళ్లంటారు. 'ఏవమ్మోయ్! సరళమ్మా! అన్నం అదీ పొయ్యిమీదుంచు వచ్చాక తింటాం. ఇప్పటికే ఆలస్యమైందని ఆయన కేకలేస్తున్నారు. పిల్లాణ్ణి ఆట్టే ఏడిపించకమ్మోయ్.'

సరళ సరేనన్నట్టు తలూపింది. కంగారు పడుతూ వంటచేసినట్టుంది అన్నయ్యా-వదిన సినిమాకెళ్లారు

శ్రీహారి అన్నయ్య చదివి వదిలేసిన ఫిలిం ఫేర్ తిరగేశాడు. సరళ కాఫీ తీసుకొచ్చింది. వస్తూ గడపకి కాలుతగిలి పడిపోయింది. కాఫీ అంతా నేలపాలయింది. అతని కొకవంక కోపం, ఒకవంక జాలి కలిగాయి ఆమెను లేవదీశాడు.

'కళ్లు తిరిగి పడిపోయానండి. చిటికలో కాఫీ కాచి తీసుకొస్తా.' అంటూ వంటింట్లో కెళ్లింది, సీతాకోకచిలుకల్లా వున్న సినిమాతారలకేసి చూస్తూ కూర్చున్నాడు.

కాఫీ అందిస్తూ సరళ అడిగింది. 'ఏవండీ చీర కొనుక్కొస్తానన్నారు. తెచ్చారా? బొత్తిగా లేవండీ పోదా నేతచీరయినా సరే.'

శ్రీహారి మాట్లాడకుండా హాల్లోకి పోయాడు గోడవారగా కూర్చున్నాడు. ఒకవంక వుద్రేకం - మరోవంక ఏడుపూ కలిగాయి. ఛీ. ప్రతిదానికీ అన్నయ్య నడగాలి ఒకటో తారీఖున తనజీతం అన్నయ్య చేతిలో పొయ్యకపోతే అతనుకాని, వదినకాని అరక్షణం ఆలస్యంకాకుండా జ్ఞాపకంచేస్తారు. తనదాస్యం యిలా వుండగా అటు ఇంటెడు చాకిరీ సరళే చేస్తోంది. వదిన పర్యవేక్షిస్తుంది. అంతే - బోడిపెత్తనం. అన్నం వుడికివుంటే మధ్య నోసారి వచ్చి చూసి 'అన్నం వుడికిందమ్మోయ్' అంటుంది. సరళ రెండు మిరపకాయలు తీసే 'మరోటి వుండనివమ్మా ఇద్దరికీ కారం అంటే యిష్టం' అంటుంది. ఆ మాటలు వింటున్న తనుకాని అన్నయ్యకాని ఆమెకూడా సరిసమానంగా వంటపని చేస్తోందనుకోవాలి. మధ్యాహ్నం కనీసం గంటయినా నిద్రపోకపోతే ఆమెను 'దిక్కుమాలిన' జ్వరం పట్టుకుంటుందట - పాపం - ఇంత విశాలప్రపంచంలో ఆ జ్వరాని కెక్కడా దిక్కులేక ఈవిడ్నే వరించాలి! మామగారు కన్యాదానం చేసి సరళను తనచేతిలో వుంచినప్పుడు సరళ నిమ్మపండులా వుండేది. ఇప్పుడు మసిబొగ్గులా వుంది.

'దీని అంతు తేల్చేయాలి' అనుకున్నాడు. ఉద్రేకంతో లేచి నిలబడ్డాడు. అతనిలా అనుకోటం ఇది మొదటిసారి కాదు

సినిమాకెళ్లిన దంపతులు ఏడింటికే తిరిగి వచ్చారు. అంతసేపటివరకూ ఆడుకొంటూన్న పిల్లాడు అమాంతం బాకావెత్తాడు. వదిన 'మా బాయనా!' అంటూ ఎత్తుకొంది. 'అదేవిటమ్మా!.. పిల్లాణ్ణి అంతలా ఏడిపిస్తున్నావ్? .. తప్పు నాదేలే! కూడా తీసుకుపోవలసింది. అయ్యో! గుక్కతిరక్కుండా ఎట్లా ఏడుస్తున్నాడో!' అని వాపోయింది. అంతటితో వూరుకోక ఆ సుందరాకాండు ఆమె కట్టుకున్న సరికొత్త సిల్కు చీరమీద వారుణాస్త్రప్రయోగంలాంటిదిచేశాడు. దాంతో ఆవిడ పిల్లాణ్ణక్కడ వదిలేసి (విసిరేసి) చీర మార్చుకోటానికి పోయింది. సరళ నేలంతా శుభ్రంచేసి పిల్లాణ్ణి ఎత్తుకుంది.

శ్రీహారి పదిసార్లు రిహార్సలు వేసుకుని అన్నయ్యముందు వచ్చి నిలబడ్డాడు.

'అన్నయ్యా! నాకు అర్జంటుగా వంద రూపాయలు కావాలి.'

చదువుతున్న పుస్తకంమీదనుంచి దృష్టిని మరల్చకుండానే అన్నయ్య అడిగాడు: 'దేనికి?' శ్రీహారికి చుర్రుమంది.

'దేనికా? ..నా పెళ్లానికీ నాకూ బట్టలు కొనుక్కోవాలి. అదీ నేనూ అడుక్కునే వాళ్లలా తిరగటం నాకు తలవంపుగా వుంది.'

'తమ్ముడూ! నన్ను సందిగ్ధావస్థలో పడేశావు సుమా! నిజానికి నా దగ్గర ఇప్పుడు చిల్లిగవ్వకూడా లేదు. రెండురోజులు ముందుగా చెప్పివుంటే బాగుండేది అటువాయిదా చెల్లించటమైనా మానుకునేవాణ్ణి.'

'అదేవిటన్నయ్యా! ... ఎప్పుడడిగినా అలా గంటావు. నా జీతం నీ చేతిలో పోసేది నువ్వు అవసరానికిస్తావనేకదూ! మేమిలా బికారుల్లా తిరగాల్సిందేనా?'

పరిస్థితి విషమించిందనుకున్న అన్నయ్య చదువుతున్న పుస్తకం మూశాడు.

'చూడు తమ్ముడూ!... నేను నిన్నేదో మోసంచేసి నీ డబ్బంతా నా స్వంతానికి వాడుకుంటున్నట్టు మాట్లాడుతున్నావు. నాకలాంటి అభిలాష ఎన్నడూ లేదు. మన కుటుంబపరిస్థితులు నీకు తెలుసు. చిన్నప్పుడు నాన్న పోయినా, నీకేలోటూ రానీయకుండా రాగాబంగా పెంచాను ఆఖరుకు నువ్వివిధంగా ప్రతిఫలం ముట్టజెప్తావని అనుకోలేదు.' అన్నయ్య ముఖంమీదికి విచారపుతెరలు దింపుకున్నాడు.

శ్రీహారి మాట్లాడకుండా వెళ్లిపోయాడు. తను ఎప్పుడు డబ్బడిగినా అన్నయ్య ఈ కథ చెప్తాడు. నాన్న దమ్మిడీ అయినా మిగల్చకుండా చనిపోయాడట. అందుకని తన్ను చదివించటానికి (స్కూలు ఫైనలు వరకు మాత్రమే!) ఎవరో అజ్ఞాతవ్యక్తిదగ్గర అప్పు

# ★ అసమర్థుడు ★

చేశాడట. ఇప్పటివరకూ ఆ బాకీ తీరలేదు. తను తీర్చాలి.

ఆ రాత్రి శ్రీహరికి నిద్ర పట్టలేదు. సరళ వచ్చి పడుకు నేసరికి గడియారం పన్నెండు కొట్టింది. ఒంటిగంటకు కొద్దిగా కన్నులు మూతపడ్డాయి. లేచి చూసేసరికి సరళ మంచంమీద లేదు. కిటికీదగ్గర నిలబడి బయటకు చూస్తోంది. మెల్లిగా లేచివెళ్ళి ఆమె వెనకాల నిలబడ్డాడు. ఆకాశంనిర్మలంగావుంది. చందమామముఖం పాలిపోయింది. చుక్కలు ఆకాశజ్యోతుల్లా మిణుకు మిణుకు మంటున్నాయి. సరళ చెక్కిళ్ళమీదుగా కన్నీటి వాహిని!

'సరళా! ఏడుస్తున్నావా?' అనడిగాడు.

పరధ్యానంలో ఉన్న సరళ ఉలిక్కిపడి కన్నీటిని దాచుకోడానికి వృధాప్రయత్నం చేస్తూ 'లేదండీ!...జలుబుచేసింది' అంటూ పొగదీసింది. ఎంత అసమర్థుడయినా శ్రీహరి ఈ మాటలు విశ్వసించలేదు.

ఆమె ఎందుకేడుస్తోందో కూడా అతను ఊహించగలడు.

'ఏడవకు సరళా!.. కష్టాలు కలకాలం ఉండవు.' అన్నాడు.

ఆ మాటకు సరళ తుంచివేసినట్టు నవ్వుతూ 'అవును...కలకాలం ఉండవు' ఒక్కసారి ముక్తివస్తుంది' అంది.

మర్నాడుదయం సరళకు బాగా జ్వరం వచ్చింది. లేవటానికి ప్రయత్నించింది కాని లాభంలేకపోయింది. వదిన విసుక్కుంటూ పొయ్యి రాజేసింది. వంటింట్లోంచి ఆమె విసురులు వినిపిస్తూనే వున్నాయి.

'చన్నీట్లో స్నానం చేయొద్దంటే ఆ మహారాణి వింటుందీ? మొన్న కుండపోతగావర్షం కురుస్తున్నా లెక్కలేకుండా తిరిగింది. కొంత తనకూ తెలియాలి. ఇప్పుడందరూ నామీద విరుచుకుపడతారు.'

'అబ్బ!...ఈ పెంకులడబ్బా ఎక్కడ ఉంచిందో కదా! ఒక్కటీ వరసక్రమంలో వుండవు.'

'ఇతనేమో మంచికట్టెలు తేనూలేడు. ఆయనకు తీరికా—శ్రద్ధా వుండవు. మధ్య నాకళ్లు పోతున్నాయి. ఇంక చెయ్యో—కాలో పొయ్యిలో వుంచాలి.' పిల్లాడు ప్రొద్దున్నుంచీ ఏడుస్తూనే వున్నాడు. డజనున్నరసార్లు వీపు విమానంమోతెక్కింది కూడా. సరళ అయిదారుసార్లు లేచి నడవటానికి యత్నించింది, కాని కళ్లు చీకట్లు కమ్మాయి. కాళ్లు వణికాయి.

తొమ్మిదయ్యేసరికి శ్రీహరి వంటింట్లోకి తొంగిచూశాడు.

'ఇంకా వంటగాలేదు' అంది కసిరికొట్టినట్టు వదిన – మరో అరగంటవరకూ పిలుపు వస్తుందేమోనని చూశాడు. సరళైతే అతన్ని పిలిచి అన్నంపెట్టేది. అన్నం తినకుండానే ఆఫీసుకు పోయాడు.

శ్రీహరి ఇంటికి పెందలాలే వెడదామనుకున్నాడు. కాని మేనేజరు నిన్నటి పాపానికి పరిహారమన్నట్టు మరో యిన్ని ఫైల్సు అతనిముందు పడేశాడు. అయిదింటికి అన్నయ్య ఆఫీసుప్యూను పరుగెత్తుకొచ్చాడు.

'ఏమండోయ్! మీ అన్నయ్యగారు అర్జంటుగా ఇంటికి రమ్మన్నారు.'

శ్రీహరి అయోమయంగా చూస్తూ 'దేనికి?' అనడిగాడు.

'ఏమోనండి! ఇందాకనే ఆయన కూడా వెళ్ళారు. మీ యింటిదగ్గర్నుంచి ఏదో కబురువచ్చింది. అంతకంటె నాకూ ఏం తెలియదు.' శ్రీహరి మేనేజరుముందు చేతులుకట్టుకుని నిలబడి పర్మిషన్ అడిగాడు.

'దేనికయ్యా?.. ఊ... వెళ్ళు' అన్నాడు.

అతను వెళ్ళేసరికి ఇల్లంతా గొల్లుమంటోంది. అతన్ని చూడగానే నలుగురూ నాలుగుమాటలూ విసిరారు.

'ఎందుకూ మొగుడు? అప్రయోజకుడైన తరవాత.'

'అయినా ఆవిడేవిటమ్మా! పూర్వకాలంమనిషిలా! అసలు పూర్వకాలంవాళ్ళుకూడా అలావుండరు'

'అదలావుంచి ఈముండ కెంతపొగరు! రాక్షసిముండ! అది కోడలే! తనూ కోడలే! దానివుసురు తగలకుండా వుంటుందీ!'

శ్రీహరి ఇంట్లో అడుగుపెట్టాడు. ముందు కనిపించింది సరళశవం. అన్నయ్య అతన్ని కౌగలించుకుని ఏడ్చాడు. వదిన కూడా అతన్ని చూడగానే ఆలాపనస్థాయి హెచ్చించింది. కొంతసేపయ్యాక జరిగింది తెలిసింది.

'అదేమో మధ్యాన్నం నిద్రపోతూందట– సరళ ఎప్పుడువెళ్ళిందో యేమో! నూతి



దగ్గర కెళ్ళింది. కాలుజారి పడిపోయింది గామోలు! ఆసంగతి నలుగురికీ తెలిసొచ్చే సరికి ఆలస్యమైంది. డాక్టరు వచ్చి చూశాడు. ఏంచేస్తాడు? అసలు నూతిదగ్గర కెందుకెళ్ళింది?

శ్రీహరి పక్కగదిలోకి పోయాడు. కిటికీ దగ్గర సరళ నిలబడ్డచోట నిలబడ్డాడు. జుత్తు పీక్కున్నాడు. తల గోడకేసి బాదుకున్నాడు...సరళ కాలుజారి పడటం అబద్ధం! తనే పురికేసివుంటుంది! నిన్ననే అంది-కష్టాలకు ఒక్కసారి విముక్తి వస్తుందని - ఈ బాధలు - ఎత్తిపొడుపులూ - కలిమివుండీ దారిద్ర్యం, అసమర్థుడైన భర్త అమాయకత్వం భరించలేకపోయింది. తనే సరళ చావుకు కారకుడు! వదినను అన్నయ్యను ఎందుకు వృథాగా నిందించటం? దాని కడసారికోరిక - ఒక్కచీర కొనివ్వలేకపోయాడు తను. వంటలక్క అయినా స్వాతంత్ర్యం - సుఖం వుంటుంది.

పిచ్చిగా పెట్టెలోంచి ఓ ఫోటో తీశాడు. అది సరళ పెళ్ళినాటిఫోటో. ఎంత అందంగా వుంది! పెదవులమీద అమాయకమైన చిరునవ్వు! జీవితానికదిచాలు!

'మాయింటో మల్లెమొక్క వుందండి. రోజా తీగపూస్తుంది. అవంటే నాకు ప్రాణం. మీరుకూడా రోజా మల్లెపూలు తెస్తారుకదూ!'

సరళతోబాటు తనుకూడా పోతే బాగుండును! కాని ఆమెను బాధపెట్టినందుకు ప్రతిఫలం అనుభవించొద్దూ?

తనజీతమంతా వదినగారి సింగారానికి హారతి కర్పూరం!

పావలా దొరికితే చాన్తో పెళ్లాన్ని సుఖపెట్టే రిక్షావాడు తనకంటే నయం!

'అంతచాకిరీ నేను చేస్తున్నానుకదా! ఈవిడెందుకు నూతిదగ్గర కెళ్ళిందమ్మా?' అంటోంది వదిన.

అన్నయ్య అతన్ని ఓదార్చాడు.

'మంచి పిల్ల. అమాయకురాలు. వంద రూపాయలు తీసుకొచ్చానుసుమా!...ప్చ్...ఎందుకూ! నీరుపోయాక ఆనకట్ట!'

* * *

మూడునెలలకాలం బరువుగా గడిచింది. శ్రీహరి మరీ మందమతిగా తయారయ్యాడు. అతనిప్పుడు పదింటికివచ్చినా బాధలేదు. అతనికోసం ఏడ్చేవా రెవరూ లేరు. అతని అనురాగంకోసం పాకులాడేవారూ లేరు. తోబుట్టువయిన అన్నయ్యదగ్గర్నుంచి, ఆఫీసుప్యూనుదాకా అతన్నెవరూ మనిషి కింద గౌరవించరు. జీతంరాగానే అన్నయ్య చేతిలో వుంచాడు. అతను వద్దంటూనే పుచ్చుకున్నాడు. బట్టలు కుట్టించలేదు. ఇంకెవరికోసం? గోచీ పెట్టుకున్నా అడిగే వాడు లేడు.

# ★ అసమర్థుడు ★

ఓనాడు అన్నయ్య పిడుగులాంటివార్త తీసుకొచ్చాడు.

'తమ్ముడూ! ఎంతకాలం యిలా ఒంటరిగా వుంటావు? నీకేమో వయస్సు ముప్పై కూడా కాలేదు. పోయిన సరళను తల్చుకుని ఎంతకాలం ఏడుస్తూ కూర్చుంటావు? నీబాధ యిలావున్నా ముందు నేను చూడకలేక పోతున్నాను. నిన్న నీకోసంబంధంవచ్చింది. నువ్వు సరేనంటే ఈ నెల్లోనే పెళ్ళి కానిచ్చేద్దాం. ఇలాంటిఅవకాశంమళ్ళీరాదు. అమ్మాయిగురించి నాకంతగా తెలియక పోయినా వాళ్లనాన్నను తెలుసు. చాలా నెమ్మదస్తుడు. నా సలహా విను.'

ఇదివరకటి సంబంధంకూడా అన్నయ్యే కుదిర్చాడు. పల్లెత్తుమాటనకుండా చాకిరీచేసే సరళను తీసుకొచ్చాడు. అన్నయ్యకు దూరదృష్టి ఎక్కువని వప్పుకోవాలి అందుకే కోపంవచ్చి పుట్టింటికి పోతాననకుండా డబ్బులేని మామగార్ని ఎంచుకొచ్చాడు. శ్రీహరికీకూడా ఒంటరిబతుకు భారంగానే వుంది. సరేనన్నాడు.

పెళ్ళి సామాన్యంగానే జరిగిపోయింది. అమ్మాయి కాపరానికూడా వచ్చింది. వచ్చిన రెండు రోజుల్లోనే ఇరుగు పొరుగువారితో చెలిమిచేసుకుంది. నలుగురూ ఆమెకు సరళ జీవితాన్ని పలవలు చిలవలుగా వర్ణించి చెప్పారు

ఆదివారం రాగానే ఆ అమ్మాయి సినిమాకు వెళ్లాలంది. ఆనాడే అన్నయ్య వదిన వెడదామనుకున్నారు.

'అందరం కలిసే వెడదాం...పిల్లాడికోసం నే నింట్లో కూచోవాలా యేం? నావల్ల కాదు.' ఈ మాటలు విన్న వదిన ముక్కుమీద వేలేసుకుంది. ఆవేళ పిల్లాడు సినిమా హాలంతా స్వైరవిహారంచేసి సినిమా చూడనివ్వలేదు. శ్రీహరికొత్తపెళ్లాం మాత్రం తనకేం పట్టనట్లు సినిమాతో ఐక్యమైపోయింది. ఇదంతా చూస్తున్న శ్రీహరికి మాత్రం ప్రళయం దగ్గరపడిందన్న భయం పట్టుకుంది.

మరో రెండు రోజులు గడిచాక శ్రీహరి ఆఫీసునుంచి వచ్చేసరికి అన్నయ్య చిర్రుబుర్రులాడుతూ - ఆ చిన్న హాల్లో అటూయిటూ నడుస్తూ వాకింగ్ ఎక్సర్‌సైజ్ చేస్తున్నాడు. అతన్ని చూడగానే చరచర ముందుకు వచ్చాడు.

'ఇదుగో! నీ పెళ్లాం వచ్చి పట్టుమని పది రోజులైనా కాలేదు. అప్పుడే దాన్తో కయ్యం పెట్టుకుంది. సరళ ఇలాగే వుండేదా? మీ వదినమాత్రం ఒకరిచేత పల్లెత్తుమాట పడే రకం కాదుసుమా!' అనరిచాడు.

శ్రీహరి తన భార్యను పిలిచి సంజాయిషీ అడుగుదామనుకుంటుంటే ఆవిడే వచ్చింది.

'ఏమండోయ్! నేనిప్పుడే చెప్పేస్తున్నా. ఈ యింట్లో అందరూ సమానులే! ఎక్కువ తక్కువలేవు. ఇంటెడు చాకిరీ నేనొక్కత్తెనే చేయటానికి నేనేమైనా వంటలక్కననుకున్నారా? వందరూపాయ లివ్వండి- అది కూడా చేయదు. ఆవిడ మాత్రం మహారాణిలా కూర్చోవాలి? అది నావల్ల కాదు. మీ చిత్తంవచ్చినట్టు ఆడించటానికి నేను సరళను కాను. అది వెర్రిబాగులదికనక కుక్కిన పేనులా పడివుని చివరికి ప్రాణం తీసుకుంది. నేనంత తెలివితక్కువదాన్ని కాదు...మరోమాట—మధ్యాన్నం కనీసం రెండుగంటలైనా నిద్రపోకపోతే జ్వరం వస్తుంది. వారానికో సినిమా చూడకపోతే మతిపోతుంది!

అందరూ నోరుతెరిచి చూస్తున్నారు. ఇలాంటి "రాక్షసి"ని కోరి తెచ్చుకున్నందుకు అన్నయ్య చెంపలు వాయించుకున్నాడు.

'చూస్తావేరా ఆడదానిలా?—మెడపట్టి గెంటక—గయ్యాళిదాన్ని. ఎంతపొగరు?' అని గద్దించాడు అన్నయ్య.

'ఏమండోయ్! మీరు వయసులో పెద్దలే కావొచ్చు. కాని అనవసరంగా మాటలు విసరకండి మీరెవరు నన్ను గెంటటానికి?' అనింకా ఏదో అనబోతుంటే శ్రీహరి 'నోరుముయ్' అనరచి చెంపమీద ఛెళ్ళుమని కొట్టాడు.

కందిపోయిన బుగ్గల్ని ఓ చేత్తో తడుముకుంటూ 'నోరు మూసుకునుండటానికి నేను సరళననే అనుకుంటున్నారు కదూ!... నేనిప్పుడే పుట్టింటికి పోతున్నా.' అంటూ సామానుసర్దటం మొదలెట్టింది. శ్రీహరి కేం తోచలేదు.

'ఎలాగో ఏడవండి' అంటూ బయట కొచ్చాడు.

ఇతరులకి సలహాలివ్వటానికి సంసారాలు సరిదిద్దటానికి-పూనుకున్న నలుగురైదుగురు ఇరుగుపొరుగువాళ్లు అతన్ని పిలిచి ముందు జరగవలసినదాన్ని గురించి హితోపదేశం చేశారు.

తత్ఫలితంగా వారంరోజులు గడిచాక శ్రీహరి వేరేకాపరం పెట్టాడు. ఒకటోతారీఖున వచ్చిన జీతమంతా భార్యచేతిలో పోస్తున్నాడు. కాని నలుగురూ అతన్ని అసమర్థుడనే అంటున్నారు.

'ఆడుదానికి పెండ్లామెవ్వరు'? అంటూ ఓగుమాస్తా యక్షప్రశ్న వేస్తాడు.

'అప్రయోజకుడైన మగడు' అంటూ శ్రీహరివంక చూస్తూ మరోగుమాస్తా సమాధానం చెప్తాడు. కాని ఆమాటలకు శ్రీహరి అంతగా బాధపడటంలేదు. ఇదివరకు అన్నకు వదినకూ దాసుడు-ఇప్పుడు భార్యకుదాసుడు. గట్టిగా మందలిస్తే 'ఈ బెదిరింపులకు భయపడడానికి నేనిదివరకటి అమ్మాయిని కాదండోయ్!' అంటుంది ఛెళ్లున. పొద్దున్న వంట పనికూడా మూడువంతులు అతనే చేస్తున్నాడు.

అయితేనేం!

లోకం ఇప్పుడుకూడా అతన్ని 'అసమర్థు' డనే అంటోంది. కాని-అతని అసమర్థతకు ఇదివరకు చూపిన కారణం వేరు, ఇప్పుడు చూపుతున్న కారణం వేరు. ★

# అణాకాని తప్పులు

చంద్రం స్వతహాగా మంచివాడే అతనెప్పుడు ఒకర్ని మోసగించలేదు. చిన్నప్పటినుంచి మంచి వాతావరణంలో పెరిగాడు

ఇప్పుడు సెంట్రల్ గవర్నమెంటులో ఎల్. డి. సి. వుద్యోగం సంపాదించాడు. అంత మంచివాడు మంచి వుద్యోగంలో ప్రవేశించటం చాలమందికి సంతోషం గల్గించింది అక్కడ కూడ తన మంచితనం వల్ల అందర్నీ కూడ కట్టుకొని పలుకుబడి సంపాదించాడు

నిజంగా అది శాపమే అయివుంటుందేమో! గవర్నమెంటులో పనిచేస్తున్న ఈ తరగతి గుమాస్తా లిండ్లల్లో కరువు కాటకాలు ప్రతి నెల 11 వ రోజునుంచి ప్రవేశిస్తాయి. చంద్రం మాత్రం దేముడా యేం? అతనూ ఈ పదకొండవ అవతారం దర్శించవలసిందే!

నల్గురికీ మంచిగా వుంటాడు కాబట్టి అప్పులు పుట్టుతాయి! ఎంతో నమ్మకస్తుడు కూడా నేమో అతనడిగితే అప్పు లేదనరు.

ఒకొసారి శెట్టి అంగట్లో కొల్గేట్ టూత్ పేస్టు కొని రూపాయిచ్చాడు శెట్టి అది చూచుకోకుండా గల్లాలో వేసుకున్నాడు. ఇంకోకరికేవో పరుకులిచ్చి తరువాత చంద్రానికి చిల్లర 4-1-0 ఇచ్చాడు, అతను 5 రూపాయల నోటు ఇచ్చాడు అనుకొని

"ఏం శెట్టిగారు? ఇలా అయితే మీరు వాదిలా తీయాల్సిందే! నేనిచ్చింది రూపాయి మంచివాకే" అంటూ చంద్రం అణా తీసుకొని బయటకు నడిచాడు.

శెట్టికి అప్పటినుంచి చంద్రం అంటే ఎంతో నమ్మకం! ఇలాంటివి చంద్రాన్ని గురించి ఎన్నో చెప్పుకోవచ్చు కాని మచ్చుకొకటి చాలుగా! అన్నమంతా పట్టి చూడాలా?

అది 26 తేది అతన్ని ఇంకో ఊరు మార్చబోతున్నారని తెల్సింది అప్పటికి చిల్లి గవ్వ లేదు చేతిలో. పాలు, పెరుగు వాళ్ళకు డబ్బులిచ్చి ఇంటి అద్దె బాకీలు తీర్చి శెట్టి కివ్వాల్సిన 18 రూపాయలిచ్చి బయలు దేరాలంటే కనీసం 50 రూపాయలు కావాలి వీటికే. కుటుంబానికి ప్రయాణపు ఖర్చులు? అన్నీ ప్రశ్నలే!

కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి వస్తున్నాడు ఆరింటికి మనస్సు ఆలోచిస్తోంది కాళ్ళు నడుస్తున్నాయి! జేబులో చేయిపెట్టి చూచుకున్నాడు కాని వుంది ప్రక్కనే వున్న కిళ్ళీ దుకాణం దగ్గర ఆగి "స్టార్ సిగరెట్ ఒకటి" అన్నాడు

"స్టార్ లేదు ప్లేయర్సు వున్నాయి"

చంద్రం ఒకటివ్వమన్నాడు అతనన్నది బియర్సు అనుకొని దాన్ని తీసుకొని అంటించి ఒక దమ్ము పీల్చి, పొగసిగరెటు నిప్పు మీద ఊదుతూ దాన్ని చూచాడు అది ప్లేయర్సు! తన అదృష్టం అనుకున్నాడు. తెలేకుండానే కల్సి వచ్చింది అణా కాని

## "శ్రీసాయిశ్రీ"

అది బియర్సు కాదు, ప్లేయర్సు అని తెల్సుకొని డబ్బు ఇచ్చే అతని మంచితనం ముఖం త్రిప్పుకుంది. అతని వ్యక్తిత్వం దెబ్బతిన్నది సమయంచూచి చెడు మంచి మీద దెబ్బ తీసింది

ఒక్క అడుగు వేయగానే "సార్ ఇక్కడకానే వుంది. అది ప్లేయర్సు 0-1-3 రావాలి" అన్నాడు కిళ్ళీ కొట్టువాలా! అతనికి ఒక్క నిమిషంలో ఆటం బాంబు తన కాళ్ళ కిందనే పగిలినట్లుంది. తన గుండె నెవరో పిసికినట్లుంది. ముఖాన చెమట పొంగింది తన నిజాయితీ ఏమైంది? తను ఏదో సమాధానం చెప్పాలి! అబద్ధం ఆడాలి! తప్పదు తాను ఒక అణాకాని కోసం రెండు తప్పులు చేయాలి! మరి పరువు తక్కొద్దూ?

"అరే! పర్సు మర్చిపోయాను ఇంటి దగ్గర" అని అనగల్గాడు జేబులు తడుముకుంటూ వడివడిగా అనలేక ఒక్కొక్క అక్షరమే అనగల్గాడు. దేనికైనా అలవాటుండాలి!

"తర్వాత ఇవ్వవచ్చు మీ దగ్గ రెక్కడికి పోతుంది?"

"వెధవది సెలాఖరుకదూ." అని ఏదో అర్థంలేని మాటగొణిగి ఇంటికొచ్చాడు చరచర తొరాజువ్వలాగా. రహస్యంగా భార్యను పిల్చి, "0-1-3 వుందా?" అని అడిగాడు

"ఆ! నాదగ్గరెక్కడిది? అయినా ఎందుకుం?"

తన ఘనకార్యం చెప్పాలి లేదా ఇంకో అబద్ధం! నామర్దా అయినా అసలు సంగతి చెప్తే 0-1-3 అప్పు అయినా తెస్తుంది పక్కింటి మామ్మగారి దగ్గరనైనా. తన పరువు భార్యదగ్గర పోయినా బయటవుంటుందిగా. చెప్పాడు. పాట్ట చెక్కలయ్యేటట్లు నవ్వి ఆవాల డబ్బాలో నుంచి బేడా కాసు తీసి ఇచ్చింది అర్ధాంగి.

పాలిపోయిన ముఖంతో ఆ బేడా కాసు తీసుకొని అంగడి వానికిచ్చాడు. తన పరువు భార్య దాపరికం వల్ల దక్కింది. కొబట్టే ఒక కానికి అకులు, ఒక కానికి వక్కలు, బాబు గాడికి కానికి మిఠాయి తీసుకొని, ఇంటి ముఖం పట్టాడు అవమానపు చెమట తుడుచుకుంటూ. ★

# పొద్దునే లేచి ముఖం చూ

తెల్లవారుఝామున అయిదుగంటలకి, అలవాటుప్రకారం సుబ్బమ్మగారు ప్రక్కమీంచి లేచి స్నానానికని బయటకొస్తోంది...


ఆ సమయానికే—కమల కూడా యివతల గదిలోనుండి వచ్చింది. ఎప్పుడూ అంత వేగిరం లేవకపోయినా, ఆ నాడు తెలివి వచ్చేసింది. మరి నిద్రరాక లేచి వస్తోంది,

ఇక సరిగ్గా అదే సమయానికి, చంద్రం కూడా తనకేదో పనివుండి తయారవడానికని-లేచి మొహం కడుక్కొని కాలకృత్యాలు తీర్చుకుందికని బయటకు వస్తున్నాడు...

చీడీకి తగిల్చిన బెడ్ లైటు గుడ్డికాంతి-తెలతెలవారుతూన్న వెలుతురులో కలిసిపోతుంది. యీలాటి వెలుగు నీడల్లో...అకస్మాత్తుగా అనుకోకుండా, ముగ్గురూ తారసిల్లడం,...ఒకరి మొఖాలు ఒకరు చూసుకోడం తటస్థించింది-అయితే ఎవరెవరు ఎవరెవరి ముఖాలని మొట్టమొదటిక్షణంలో చూసుకున్నారో అది వారికే తెలియాలి!

ఈ సంఘటనవల్ల-చూసుకోడం జరగ్గానె ఏదో సందేహం. ముగ్గుర్లోనూ క్షణంలో పుట్టి, చప్పున వెనక్కు తగ్గారు. ఆ జంకడం వారికి తెలియకుండానే...జరిగిపోయింది... ముగ్గురూ కూడా...తమలో-'నిద్ర లేవగానే యీ ముఖం చూశానే'...అని... తప్పకుండా అనుకున్నారు. అందుచేతే వెంటనే బయటకు రావడానికి సందేహించారు. మళ్ళీ అంతట్లోనే-తిరిగి ఆ విధంగా వెళ్లి పడుక్కుంటే ఎదుటివా రేమనుకుంటారో అన్న మొహమాటంవల్ల, ఆ సందేహాన్ని కనబడనివ్వకుండా...మామూలుగానే...ఏమీ అనుకోనట్టుగానే - ఎవరి మానాన్ని వారు తలలు వంచుకొని - ఎవరి పనిలోకి వారు వెళ్లేరు.

తిరిగి వెళ్లి పడుక్కొని, తరవాత లేస్తే, ఆ ప్రభావం పోతుందని, ఏమీ ఫరవాలేదని



అనుకొని కొందరలా చేస్తుంటారు. కాని చూసేయటం - జరిగిపోయిందా లేదా? వెళ్లి పడుక్కుంటే, కాలదోషం పడుతుందా? ... జరిగేదేదో జరక్క తీరదు... అని వీళ్ళు అనుకున్నారు. కాని ఆ పిచ్చి నమ్మకం మాత్రం, ఆక్షణంలో ముగ్గుర్లోనూ అనుకోకుండా కలిగింది ... ఆ వెంటనే— ఏమిటి! యీ పిచ్చినమ్మకం! మొఖం చూస్తే ఏమౌతుంది? చాదస్తుల్లా యీలాటివి నమ్మడమా! అంతా భ్రమ అని అనుకున్నారుగాని...మనసుల్లో మాత్రం లోజల్లా ఏమౌతుందో! ఎలా గడుస్తుందో! అని పీడిస్తూనే వుంది, ఆ అనుమానం.

* * *

చంద్రం గుమ్మందిగి బయటకి నడవగానే-పడాలుమని—కాలినిరాయి ముద్దులాడింది, కాలిబ్రొటనవేలిబొట్ట బ్రద్దలయి గోరు, మొసలినోరులా, తెరుచుకుపోయింది.'అమ్మా' అని కూలబడిపోయినాడు ... ఒక్కసారి ప్రాణంపోయినంతపని అయింది... నెత్తురు కట్టడంలేదు...అంత బాధలోనూకూడ ... అతనికి స్ఫురణకివచ్చింది...'మా పెట్టిందిరా తమాఖా! వూర్తిగాపోతుందా? అయినా లేవగానే దానిముఖం చూశాను! ఇక్కడితో పూరుకుంటే వుంది దారి!' అని అనుకొని కాలికి గుడ్డచుట్టుగొని, కొత్త చెప్పులిల్లి తిరిగి వెళ్ళిపోయినాడు...

కమల ముఖంకడుక్కొని స్నానాలగదిలోండి వస్తూంటే చీర కొంగు తలుపుకు తగులు


కొని, చర్ మని చిరిగిపోయింది, మూరెడుమేర!...

"చ్చా...చ్చా ... చ్చా ... ఖర్మ... యింకా నెల్లాళ్ళుకాలేదు.. కొని...నిక్షేపంలాంటిచీర...ఇలా అయిపోయింది!"అని విసుక్కుంది. ఆ వెంటనే...అవును నిద్ర లేవగానే ... వెధవముండముఖం చూశాను మరేమవుతుంది!" అని అనుకుంది.

ఇంక సుబ్బమ్మగారిసంగతి, ఆమె విధవే

★ ద్వివేదుల సో

అయినా జాత్తువుంది...చాదస్తం, ఆచారం, కూడా కద్దు. ఆవిడ స్నానంకానిచ్చుకొని.. పొయ్యిఅంటిద్దామని...కిరసనాయిలు తెచ్చి బొగ్గుల్లో పోయబోయింది...అదేం ఖర్మమోగాని...చేయిజారి సీసాపాళంగా తుబుక్కున క్రిందబడింది. యిల్లువళ్ళు అంతా గుప్పుమని కంపుకొట్టేసింది ... ఆవిడేంచేస్తుంది!... "అమ్మో! యిదేమిటి ప్రొద్దుటే!" అని అనుకుంది. అంతటితో వూరుకుండా అత్త్వే



# ఎవరి

# శాన్నో!

లేదు ఆవిడకూడా ఇది మరేంకాదు లేచినవేళావిశేషం చూచిన ముఖ విశేషం."అని అనుకుంది తనలో

ఇక్కడే వుంది చిన్నవిశేషం .. చూశారూ వెధవముండలుగాని ఇంకెవరయినా యిలాటి—చూడరాదు అనిచెప్పిన వారినిచూసి పైవారు ఎలాభావిస్తారో.. అలాగే వీరినిచూసినపుడు వారూ అనుకుంటారు .. వారికి వీరు శకునాలు అయితే

## మనాథశాస్త్రి ★

వీరికి వారు శకునాలు

ఇటువంటి నిదర్శనాలు ముగ్గురికి, ప్రత్యక్షంగా జరిగాక, వారులేచి చూచిన ముఖ విశేషంవల్లనే యిలా జరుగుతున్నాయని నిశ్చయపడ్డారు ఇంకేం జరగనుందో అని బితుకుబితుగ్గావున్నారు

* * *

చంద్రం ఆఫీసుకి గబగబావెళ్ళాడు అంత తొందరగా వెళ్ళినా అర ఘంట లేటయిపోయినాడు రోజూ రాని హెడ్‌క్లర్కు, అప్పటికప్పుడే—భూతం లా వచ్చి కూర్చున్నాడు. 'ధృవనక్షత్రంలోనే వాడూ లేచినట్టున్నాడు వీడిదుంపతెగా!' అని అనుకున్నాడు చంద్రం.

చంద్రం లోపలికి వెళ్ళగానే;

"ఇప్పుడా తీరుబడిఅయింది! రోజూ యిలాగే జరుగుతోందన్నమాట! కొత్తమెత్తనయితే, గుజ్జం మూడుకాళ్ళతో పరుగెట్టదూ మరి!.. అన్నిపనులూ పనిలోకి వచ్చినతర్వాతే జరుపుగోవాలి! బజారులు చెయ్యాలి! విశ్రాంతి కావాలి! కాఫీలు, టిఫిన్లకి, యిందులోనే టైము కావాలి! గంటలకొద్దీ లేటు రావాలి! మళ్ళీ టైము అయేసరికి ఒక్కనిముషం ఎక్కువ వుండమంటే వీల్లేదు! కానీండి ఏమయినా అంటే. నే చెడ్డవాణ్ణి!" అని అన్నాడు హెడ్‌క్లర్కు.

"ఎంత మాటన్నావురా! బధిరాంధకవమూ!" అనుకొని "లేదండి! వస్తుంటే కాలికి దెబ్బతగిలింది ఇదుగో. అంచేత" అని చూపబోయినాడు, చంద్రం.

"అవును, ఏదో ఒకకారణం అందులోనూ ఇవాళ ఆఫీసరు వస్తాడు అని కదా! నేను వచ్చి. కూర్చున్నది! ఆ మాత్రం బాధ్యత వుండొద్దూ! ఉదయం లేచి ఎవరిమొఖం చూశానో! యింకా నయం యీపాటికి దిగబడలేదు—వస్తే నీకూ నాకూ, వాయిద్యాలు మ్రోగేవి!" అని అన్నాడు ఆ హెడ్‌క్లర్కు ఎవరి మొహం చూశాను చెప్మా అని జ్ఞాపకం తెచ్చుకుంటూ.

అది వినగానే చంద్రానికి జ్ఞాపకం వచ్చింది.

"అవును నేనూ అలాగే ఒకరిమొఖం చూడబట్టే యింతవరకూ వచ్చింది, లేకపోతే బాగానే వుండేది ఆఫీసరు వస్తాడనికదా! వాడు అంతవేగిరం వచ్చేడు. లేకపోతే తను మాత్రం వస్తున్నాడా! అయినా ఆఫీసరు వస్తాడని తన కేంతెలుసును! ఇంతకీ. లేచి చూచిన మొహం విశేషం ఇది. అతనితోవాదించినా ఏం లాభం. అని అనుకొని పూరుకున్నాడు.

"ఉద్యోగం అయేవరకూ నానాగడ్డి కరచి నానావాళ్ళనీ ఆశ్రయించడమున్నూ. ఉద్యోగం అయేక, ఈవిధంగా ఖాతరు లేకండా నాశం! అన్నట్లు వుండడమూ.

"ఇంతమంది రిటైర్ అవుతున్నారుగాని. నీకని విరగడవడంలేదు బాబూ!" అని కళ్లుమండి అనుకున్నాడు చంద్రం.

అదిమొదలు 'ఇదేమిటిలా అవుతూంది. ప్రతీదీ!' అనే ఆలోచన అతడికి పట్టుకుంది. దానితో బుర్రసమంగా పనిచేయక, చిన్న చిన్న పొరపాట్లు డ్యూటీ జరుగుతున్నంతసేపూ జగుతూనే వున్నాయి పొరపాటు జరిగినపుల్లా.. "ఆముఖం చూడ్డంచేతనే ఇలా జరిగింది" అని అనుకుంటూనే వున్నాడు.

మళ్ళీ వెంటనే—ఆమెమొఖం చూడబట్టి ఇక్కడితో సరిపోయిందేమో! లేకపోతే— ఆ ఆఫీసరే ముందరవచ్చి చూస్తే ఏమయేది! అనికూడా అనుకున్నాడు. అనుకున్నా... మరో అనుమానం వెంటనే తోచింది. అసలు ఆముఖం చూడకుండా వుంటే, ఆలస్యమూ జరగదేమో! ఆ ఆఫీసరూ రాడేమో! అని కూడ అనుకున్నాడు

ఈ విధంగా అతనికి పరిపరి విధాల ఆవిషయమై ఆలోచనలు పోతున్నాయి. ఆ ఆలోచనలని కట్టలేకండా వున్నాడు, అందుకతనికే ఆశ్చర్యంవేసింది

ఆ యింతలో ఆఫీసరు పర్యవేక్షణకి వచ్చాడు. అందరూ లేచి మర్యాద చూపారు ఆ ఆఫీసరేవేవో హెడ్‌క్లర్కునడిగి, వెళ్లిపోడానికి తిరిగేడు, అందరూ కేయి కేయి దేముళ్ళకి మ్రొక్కుకున్నారు. అతనికంట ఏమీ పడనందుకు. కిగటువంటి వంటి ఆయన దృష్టి పథంలో తాము కనబడనందుకున్న 'లేచి ఎవరిమొహం చూశామో బ్రతికి బయటపడ్డాం!' అని అందరూ నిబ్బరపడ్డారు

వెళ్లిపోతూ వెళ్లిపోతూన్న ఆఫీసరుదృష్టి. దురదృష్టవశాత్తూ. ద్వారంప్రక్కనే కూర్చున్న. . చంద్రంమీద పడింది పిల్లికి ఎదురుగా తారసపడిపోయి. బిక్కమొహంవేసి బితుకు బితుకుమనే ఎలక





# ★ పొద్దున్నేలేచి ఎవరిమొహం చూశానో! ★

పిల్లలా నోరు ఆవలించేశాడు మన చంద్రం.

"నీ యూనిఫారం ఏదీ!" అని పిడుగులా అడిగాడు ఆ ఆఫీసరు,

చంద్రానికి అది విన్నాక జ్ఞాపకానికి వచ్చింది.—ఆ యూనిఫారం సంగతి.— అలవాటుప్రకారం వచ్చేశాడు చేతులూపుకుంటూ... అయినా ఆఫీసరు వస్తాడని ఎవడికి తెలుసు? వచ్చినవాడు, తెలియచెప్పొద్దూ. అంత సడన్‌గా ఏ ఆఫీసరూ రాకూడదు. వస్తే ఇలాటివి అడక్కూడదు ఎప్పుడూ నామకానికి యూనిఫారం తెచ్చి పర్సుకి తగిల్చేస్తున్నారుగా! అవేం తొడుక్కుందికి పనికిరావాలా? పోనీ ఆలస్యంగా వచ్చావని అడిగిని ఆ హెడ్‌క్లర్కు. వాడి బుర్ర ఏదీ అంట? వాడేనా అడగొద్దూ!.. అడిగితే, వెంటనే తెచ్చుకుందునే... వచ్చిందిరా గొర్రి! అనుకున్నాడు! ఏమీ జవాబు చెప్పకుండా తప్పు ఒప్పుకున్నట్టు తలొంచుకొని నిలబడి వూరుకున్నాడు "నామీదే పడాలి! నీ దృష్టి! యింతకీ. ఆ ముఖం లేవగానే చూశాను! ఎవరిని అని ఏంలాభం?" అని అనుకున్నాడు.

"ఇది క్రమశిక్షణ," అని ఆ హెడ్‌తో అంటూ "ఇంకమీద జాగ్రత్తగా వుండాలి! ఇది నౌఖరీ! నువ్వు వుత్తి పుణ్యానికి చెయ్యలేదు కాబట్టి—నిబంధనలకి—నీ డ్యూటీ అంతకాలం లొంగివుండాలి!" అని చెప్పి... వెళ్లిపోయినాడు.

తనలో కూడ తప్పువున్న హెడ్ మాత్రం కుడ్లగూబలా 'తర్వాత చెప్తాను!' అన్నట్టు ఇతడివైపు చూస్తున్నాడు.

చంద్రానికి తెలుసు పొరపాటుకు ప్రాయశ్చిత్తంగా రెండు రూపాయిలు జరిమానా తప్పదని ..

ఆఫీసరు వెళ్లగానే ..

"అనుకున్నంత చేశావోయ్! నా పరువు తీశావు! ఛా!" అని చీదరించుకున్నాడు హెడ్‌క్లర్కు "లేవగానే ఎవరిమొహం చూశావోయ్! ఇవాళ" అని పరామర్శించేరు తోటి క్లర్కులు.

చంద్రం మరోసారి తను ఉదయాన్ని లేవగానే చూచినమొఖం జ్ఞాపకం చేసుకొని తలవంచుకు ఊరుకున్నాడు.

ఇహ ఆనాడల్లా అలా జరక్క తప్పదని—తను భరించక తీరదని అనుకున్నాడు మొత్తంమీద ఆఫీసుపని అయిపోయింది. యింటికి వచ్చేద్దామని గబగబా వచ్చేస్తున్నాడు. వచ్చేస్తుంటే మధ్య దారిలో నలుగురు స్నేహితులు ఎదురయినారు; 'ఓహో! అంటే—ఓహో!! అనుకున్నారు కాని చంద్రానికి మాత్రం ఆ వేళకి ఉత్సాహంగా లేదు, వాళ్ళతో ఆట్టే సేపు మాటాడాలని కూడా లేదు అసలు వారు ఆ సమయంలో కనబడి పలకరించడమే ఇష్టంగాలేదు ఆఫీసులో గొడవలు, ఆలోచనలు, వీటివల్ల బుర్ర వేడెక్కిందేమో ఇంటికి వేగిరం పోయి నిర్మలంగా కూర్చుందామని అనుకున్నాడు కాని వీళ్లు పిడల్లా తగిలేరు. ఇంక ఆ స్నేహితులెలాటి వారు! అంతసుళువుగా వదిలేఘటాలు కారు వారిని చూడగానే 'హతోస్మి' అనుకున్నాడు

"ఏమిట్రా సంగతి? ఎక్కడా దర్శనాల్లేవే!" అని ఒకడు అడగ్గా.

"రావోయ్ అలా తిరిగివద్దాం! ఆఫీసు వదలగానే అంత వేగిరం ఇంట్లో ఎవెండెన్సు ఇవ్వక్కర్లేదులే!" అన్నాడు మరొకడు

'ఎక్కడికి వెళతాం లెస్తూ!' అని ఒకసారి అన్నా. చంద్రం వెళ్లక తప్పలేదు ఎలా కాదనగలడు? వాళ్లు చాలాసార్లు తనతో తిరిగినవాళ్లు.

వెళ్ళి వెళ్ళి అందరూ ఒక హోటల్లో దూరారు చంద్రం గాభరాపడటం తప్పదు కదూ! ఫలహారాలయాక కాఫీలలోకి వచ్చారు. ఇక్కడే వాళ్ళని, వాళ్ల మొహాలనీ చూడవలిసింది ఎవరికి వారే అతి తాపీగా కాఫీ తాగడం మొదలెట్టారు ఒక బొట్టు పెదిమలకి అంటగానే ఉఫ్ అని పిల్చి క్రిందని బెట్టి వూదుకుంటూ 'అబ్బా వేడిరా!'అని మాటాడుతూ తాగుతున్నారు ఒకటికి నాలుగు సార్లు చల్లారబోసుకుంటూ తక్కినవాళ్ళ గ్లాసుల్లోని పరిమాణాలని పోల్చుకుంటూ తాగుతున్నారు ఎందుకంటె ఎవడయినా ముందుగా తాగేసి బిల్లు చెల్లిస్తాడేమో అని 'వీడు యింకా తాగుతున్నాడు కాబట్టి ఇవ్వలేదు. లేకపోతే యిచ్చేవాడే' అని అనుకుంటారు అన్నివాళ్ళ ఊహ

కాని ఆఖరికి అందరికీ విసుగెత్తి 'లెండ్రా!' అని అనుకొని అందరూ ఒకసారే లేచారు ఇంక, పర్సులు అందరూ అతి తాపీగా తీయడం, జేబులు వెతికిన జేబే వెతకడం-పర్సులో చూసిన కవరే నాలుగుసార్లు చూడడం లేకపోతే మూతిరుమాలుతో తుడుచుకున్నట్టు, చిల్లర లేనట్టు-ఎవరితోనో కలిపించుకొని .. ఆ మాటల్లో వుండి ఈ బిల్లుసంగతి గుర్తించనట్టు ... ఇలా ఎవరికి వారు ఆలస్యంచేయడం ... వెనక్కి తగ్గుతూండడం చేస్తున్నారు. ఇదంతా ఎందుకూ బిల్లు చెల్లించడం తప్పుతుందనే. ఎలాగయితేనేం ఆఖరికి...

'నీదగ్గర వుందా! లేక నేతీసేదా!'— అని ఒకడు చంద్రాన్ని ఉద్దేశిస్తూ మహా ఖాతరులేకండా అడిగేడు ఏమిటో చంద్రం ఇచ్చేస్తున్నాడు కాబట్టి తను ఆగినట్టు.

చంద్రం అదివిని తబ్బిబ్బయినాడు ఎలా కాదనగలడు స్నేహితుడావిధంగా డొంక తిరుగుడుగా, పెద్దమనిషిలా తనని, బిల్లు చెల్లించమని చెబుతున్నపుడు కాదనగలడా! తనకి వాళ్లు ఎన్నిసార్లు ఇప్పించలేదు? ఏదయినా ఇంతేకదా?— ఒకరిదగ్గర ఏదయినా ఆశించామూ అంటే— వారికి మనం మొహమాట పడిపోక తప్పదు... అని అనుకొని అయిదురూపాయలు చెల్లించాడు. డబ్బిస్తున్నపుడు మాత్రం. "లేచిన వేళ! ఇలావుంది! ఆ ముఖం ఎంతచెడ్డది! ఒక్కొక్కరి ముఖంచూస్తే అంతే!" అని అనుకున్నాడు.

ఆ తర్వాత ఎవరితోవని వారు వెళ్ళిపోయినారు.

* * *

మరి సుబ్బమ్మగారిసంగతి ... పొయ్యి అంటించేప్పుడు సీసా జారిపోవడం మొదలు వంటఅయేవరకూ, అన్ని .. చెప్పలేనన్ని సంగతులు జరిగేయి వెధవ అగ్గిపెట్టె అరఘంట తంటాపెట్టి దొరికింది .. అంత అవసరం ఏమిటోగాని... అడుగడుగునా మనిషి తిరువుకుని పోయింది. ఆ పొయ్యి ఒక ఘంటకి గాని అంటుకోలేదు వేశే బొగ్గులు వేదామంటే నిండుకున్నాయి పోనీ కఱ్ఱలంటించవచ్చు అనుకుంటే— పచ్చి ముద్దలు ఎలాగో వాటినే అంటించి ముక్కంట, కళ్లంటా, గంగా భాగీరధులు ప్రవించుతూవుంటే పాపం ఆ గంగా భాగీరధి ఎలాగో కష్టపడి వంటకి కూర్చుంది.

చంద్రానికి తొలిసారి కాఫీ ఇచ్చినపుడే అందులో పంచదార మరచిపోయింది. అడిగితే జ్ఞాపకంవచ్చింది. బియ్యంలో తగినన్ని నీళ్లుపోయడం .. రోజూ అలవాటయినా మరిచిపోవడంచేత అన్నం, అటు గంజిదిగక... యిటు అత్తెసరుగాక ఏడవలేక నవ్వేవాడి మొఖంలా తయారయింది అంత అనుభవశాలి అయి, వంటలో దిట్టఅయిన ఆమెకి యిలాగయితే ఎంత చిన్నతనం!

ఉదయం పదిగంటల లోపునా నాలుగుసార్లు ఆ చల్లో చలినీళ్లతో స్నానం చేయవలసి వచ్చింది. శ్రేష్ఠంగా మడికట్టుకుంటే, పిల్లడు ముట్టేసుగున్నాడు. రెండోసారి అంటులగిలేసింది. ఇలాగే నాలుగుసార్లూ అయింది ఆఖరికి తడిగుడ్డలోనే వుండిపోయింది. వెధవ మడికూడా లేకపోతే— ఎలా? అడొక్కటే వాళ్లకి కొవ

వరకూ మిగిలేది ఈ మడికి, — చిన్న పిల్లలకి అసలు పడదు. మడికట్టుకుంటే చాలు, ఎలాగో తగిలేస్తారు! మడి బట్ట ఆరవేస్తే అటువయిపు మరి చూడకూడదు! చూశామా అంటే అది ఎలాగో అలాగ మైలపడిపోయే వుంటుంది.

ఈ విధంగా ఆ రోజల్లా ఆమెకి పొరపాటుజరగని పని లేదు. అంగు చేత ఆ రోజల్లా విసుక్కుంటూనే వుంది విసుగువల్ల చికాకు, చికాకుచేత కోపం, దానితో మతిమరపు, మరపువల్ల పొరపాట్లు లావయినాయి అయితే సుబ్బమ్మగారికి అందుకు కారణం తెలుసు — అంచేత అలా జరిగిన ప్రతి నిముషం ... "ఎవరి మొహం చూశానో . లేవగానే చూశానుగా పూరికే విడుస్తుందా!" అని అనుకుంటూనే వుంది

* * *

ఇహ మిగిలింది కమల—ఆమెకి ఒక్క చీర చిరిగిపోడం తప్పించి రోజల్లా మరేమీ అనుకోనేపాటి జరగలేదు జరగలేదని ఆమె సంతోషపడుతూనే వుంది . కాని ఆఖర్ని భోజనాలయాకమాత్రం . చిన్న జట్టీ వచ్చిందికి. ఇంక నిర్భయంగా రోజు గడిచేసింది అనుకొనేటప్పటికి, అనుకున్న అనుమానం నిజమయినట్టుంది చూచిన మొఖవిశేషం వృధా పోనట్టుంది

చంద్రం ఆఫీసులో పడిన గొడవ, దారిలో తగిలిన జరిమానా వీటితో అలిచికొగ్గా ఇంటికి వచ్చాడు. రాగానే ఆలోచనలో పడిపోయినాడు—అలాగే ఎవరితోనీ మాటాడకండా విచారిస్తున్నాడు

కాలం గడిచిపోవాలంటే అన్నిటికన్నా గొప్ప అలవాటు ఆలోచన. ఆలోచిస్తూంటే కాలం తెలియదు కొందరికి ఆటలవల్ల, కొందరికి—తిరగడంవలన, కొందరికి చదవడంవల్ల, మరికొందరికి పనులవల్ల, ఇలాటి అలవాట్లు వ్యాపకాలు వలన కాలం సులభంగా గడిచిపోతుంది ఇంకొందరికి నిద్రవల్లకూడా గడిచిపోతుంది కళాకారులకి వారు కళకోసం చేసే కృషివల్ల సరిపోతుంది అలాగే కొందరికి ఆలోచనలవల్ల కాలంగడుస్తుంది. మరికొందరికి విచారంవల్లగాని, సంతోషంవల్లగాని, కలిగిన ఆలోచనలవల్ల కాలం తెలియదు. ఇవన్నీ ఇలావున్నా—కొందరు వారి వారి దీక్షలు తీరడానికి అనుకున్నది పూర్తికాడానికి, కాలం చాలడంలేదో! అని వాపోతూంటే ఇంకొందరు కాలం ఎలా గడుస్తుందా! అని బాధపడుతూంటారు ఇదంత చిత్రం.

ఇలాగే చంద్రం ఆలోచనలోపడి కాలం తెలిసికోకండా వుండగా, కమల భోజనానికి పిలిచింది. అప్పుడు చైతన్యం వచ్చి వెళ్లాడు.

భగవంతుని ధ్యానించి, పరబ్రహ్మస్వరూపమయిన అన్నం మొట్టమొదట నోట్లో పెట్టగానే — అర్ధనారీశ్వరరూపంలా స్ఫురించింది ఎంచేత సగం పులుపు సగం ముద్ద!.

"ఇదేం ఇలాగుంది" అని అన్నా పొరపాటయి వుంటుంది అని లెక్కచేయలేదు కాని తరువాత ఒకొక్క పదార్థం తీసి రుచిచూస్తోవుంటే ఏముంది? ఒక్కటీ సవ్యంగాలేదు ప్రతి వంటకంలోనూ, ఏదోలోపం కూరలో కారం లావు! పులుసులో పుల్ల లేదు పచ్చడిలో పోపు లేదు . పోపులో మిరపకాయలు లేవు చారులో ఉప్పలావు! ఈవిధంగావుంది. పాక కళ . అతనికి ఒక్కసారి అన్నపూర్ణ టపీమని జ్ఞాపకానికి వచ్చి జిహ్వ లాక్కుపోయింది ఈ వంటకాలు నాలికమీద పెడుతూంటే లాలాజలం ఇంకిపోయి నాలిక అనుక్కులాక్కుపోతూంది

"ఏమిటయింది ఈరోజు ఇంత షడ్రసోపేతంగా నవరుచులూ ఓడుతున్నాయి పెళ్ళిచూపులకి వచ్చిన కాబోయే వియ్యాలవారికి పిల్లతాలూకు పాకకళ రుచిచూపించడానికి ఏ పెళ్లికూతురయినా వండిందా ఏమిటి?" అని అన్నాడు చంద్రం! హాస్యంగా

సుబ్బమ్మ అనుకుంటూనేవుంది తినేసరికి ఎలావుంటాయో ఏమంటారో అని ఒకరు చెప్పేవరకూ వేచివుండక, వండుతున్నప్పుడే రుచిచూసి, ఇప్పటి నవనాగరికుల్లా వండడం ఆమెకు చాతకాలేదు పాతకాలపుమనిషి .. తను చెప్పినట్టు వంటవినాలిగాని వంట చెప్పినటు తను వినదు అందుకే తను చేసిన వంట పాడుకాదని, అవడానికి వీల్లేదని, ఆమె ధీమా! కాని ఆ రోజు అలా అయినంతమాత్రంలో ఆమెచేతి వంటని ఎవరూ వేలెత్తిచూపలేరు ఆమె చేతిపాకం తింటే ప్రతివారూ 'ప్రాణం లేచివచ్చిందమ్మా!' అనవలసిందే! అయితే ఈనాడు ఎందుకలా అయింది మరెందువల్లాకాదు ఆనాడు ఆమె ప్రొద్దున్నే లేచి చూచిన ముఖవిశేషం అంతే అలాగనే ఆమె అనుకొంది.

"ఏమయిందిరా నాయనా! బాగులేవా?" అని అడిగింది సుబ్బమ్మగారు.

"ఏమిటో ఇవాళ నీ మనసు ఇక్కడలేనట్టుంది. ఒక్కటీ నోటికెళ్లడంలేదు... అయినా ఉదయం లేచి ఎవరిమొహం చూశానో . ఎక్కడికి వెళ్లినా ఇలాగే అవుతూంది.. ఆఫీసులో జట్టీ అవమానం . దారిలో అనుకోని ఖర్చు .. ఇక్కడ పోనీ . ఇంత రుచిగా, తిని హాయిగా పడుక్కుందామంటే-ఇలా అయింది ఇంతకీ ప్రొద్దున్న లేచిన విశేషం! అన్నీ అలాగే జరుగుతున్నాయి" అని అన్నాడు చంద్రం, మరి వుండబట్టలేక.

కమలకూడా రుచిచూసింది అనుమానం తీరక కాని, ఏదితిన్నా లోపలికి వెళ్లడానికి బదులు పైకి తోసుకువస్తూంటే . "ఔనండీ! నిజమే ఈరోజు మీమనసు బావులేనట్టుంది!" అని అంది. అది విని చెబుదాం అని ఎంతో కాలంనుంచి వేచివున్నట్టు ఆతృతగా.

"చెప్పకపోవడం ఏంగాని ఓర్రా! .. ఉదయంలేచి కుంపటి అంటించింది మొదలు యిప్పటివరకూ ఏదో ఒకటి యిలాగే అవుతూంది... లేవగానే ఎవరిమొహం చూసేనోగాని! యిలా ఎన్నడూ జరగలేదు! అంచేత అసలు నాకేం తోచలేదు. ఇవాళకి ఎలాగో ఎంగిలి పడండి! ఒకొక్కనాడు లేచిన ఘడియలూ —చూచిన మొఖాలూ అలాటివి! ఏం చేస్తాం!" అని సుబ్బమ్మగారు తనని లోన పీడిస్తున్న అనుమానాన్ని వుంచుకోలేక వెళ్లగక్కింది

ఆ మాటలు వినగానే కమలా, చంద్రం-ఒకరినొకరు గుడ్లు తేలవేసి చూసుకున్నారు. తర్వాత ఇద్దరూ-సుబ్బమ్మగారివయిపూ... సుబ్బమ్మగారు వీరిద్దరివయిపూ . ఏదో దాక్కున్న భావంతో-శ్లేషతో కూడిన అర్థంతో, రహస్యమయిన భావతో— గోప్యంతో కూడి అనుమానాస్పదమయిన చూపులతో తెలుసుకున్న సందేహాలతో... చూసుకున్నారు!

ఇదంతా ఒక్కనిముషంలో జరిగిపోయింది అంతే ఒకరినొకరు మరేం పృచ్ఛించుకోలేదు కాని అందరూ లోలోనమాత్రం 'ఏమనుకుంటున్నారో?' అని అనుకున్నా - అలాగనుకుందికి వారికి తాను - ఆ సంఘటనగురించి అనుకుంటున్నట్టూ, అది తనలో ప్రభావం చూపెడుతున్నట్టూ, తాను దానిని అనుభవిస్తున్నట్టు ఎదుటివారికి తెలియాలనే అలా అన్నారు. అలాగుకనక చేస్తే ఎదుటివారు తననిగురించి అనుకున్నా తనుకూడా వానిగురించి అనుకోక మానలేదుసుమా! అని చెప్పడానికే .. అదో సమాధానంగా మనసుకి పూరట కలిగిస్తుంది.

ప్రస్తుతం వారి మనస్తత్వాలు అలాగున్నాయి.

మొత్తంమీద అందరూ ఏదో కడుపులు నింపుకొని పండుకొనబోయినారు ... ఆ యింతలోనే కమల వంతు వచ్చింది ..

చికాకులు మరిచిపోదలుచుగొని నిశ్శబ్దంగా పడుక్కున్న చంద్రాన్ని వెళ్ళి కదిపింది కమల:

"ఏమండీ! నే చెప్పింది తెచ్చారో?"

(56-వ పేజీ చూడండి)

# కలంస్నేహితులు

జీవితంలో ఎప్పుడూ ఏడవనివాడు ఏడిస్తే కూడా అదోక ముచ్చటగా ఉంటుంది సూర్యారావు మద్రాసులో మా యూనివర్శిటీ కాలేజీ జీవితంలో నా అంతగంభీరంగా ఎప్పుడూ గోలపెట్టలేదని మాజీ రూమ్‌మేటునయిన నాకు గట్టినమ్మకం, జ్ఞాపకం ఉన్నాయి.

ఒకనాడు మామూలుగా నేను నా రూములో ఆల్జీబ్రా లెక్కలతో తంటాలు పడుతున్నాను హాస్టలులోకి సహాయంకోసం వచ్చే సంఘసేవకులూ, పేదవిద్యార్థులూ, వరదబాధితులూ, కరువుపీడితులూ, ఇంకా విద్యార్థిభావకవులూ బాగా అనుభవం ఉండడంవలన ఎందుకైనా మంచిదని తలుపులు బంధించి ఉంచాను ఇంతలో ఎవరో తలుపులు దబదబ బాదెరు వినకొంటూ ఏ పాకిస్థాన్‌నుంచి వచ్చిన శరణార్థినో ఊహిస్తూ తలుపుతీసేను తీరా చూస్తే మా సూర్యం! చేతిలో ఏదో లెటరు ఉంది

అలాంటివేళ వాడు రూమువిడిచి బయటకు రావటం ఒకవిచిత్రం వస్తూనే "ఒరే బ్రదర్! ఈ ఘోరమైన అన్యాయం చూశావురా? అసలీ యిండియాలో ఈ యిరవయ్యో శతాబ్దంలో కూడా ఎంతటి ఘోరాలు జరుగుతున్నాయో!" అంటూ నావైపు చూశడు—సానుభూతికోసం—ఆ ఉత్తరం నాకు అందిస్తూ ఆ ఉత్తరం చదివేసరికి నాకు కొంత సానుభూతి కల్గినా, అది రోజువార్తలు చదివితే వచ్చే దిగ్భ్రమ వాటి మాత్రమే అవడంవల్ల—"ఒరే సూర్యం! బ్రిటన్ మహారాజ్ఞి పెళ్లికూడా పార్లమెంటు ఇష్టంలేందే జరగటంలేదు. "విచారించకు!" అని ఓదార్చి. "అసలు విషయం ఏమిట్రా? ఎవరీ ఉత్తరంవ్రాసిన పెద్దమనిషి? ఏమాకథ?" అంటూ అడిగేను. వాడుకూడా అందుకు రెడీగా వచ్చి వట్లు తనజేబులోనించి యాల్టా డాక్యుమెంటులాంటి ఆశ్చర్యకరమైన ఓ ఉత్తరాల కట్టతీసి నాకిచ్చి చదవమన్నాడు తర్వాత కాస్త ఉపోద్ఘాతం చెప్పేను. అదేమిటంటే

మావాడికి రోజూ పేపర్లు, మేగజైన్లు తీరికవేళల్లో చదవడం అలవాటు ఒకనాడు ఒకానొక మేగజైన్లో 'కలం స్నేహితుల' పేజీలో ఇలాగున వ్రాసి ఉందట: "మిస్ కమల (18), C/o శ్రీ రావుగారు, భీమవరం. సరదాలు స్పోర్ట్సు న్యూస్, సినిమాలు, కలంస్నేహితులు." సూర్యానికి అదివరకెప్పుడూ లేని సరదాపుట్టుకొచ్చింది. వెంటనే ఆరాత్రంతా పట్టిపట్టి అచ్చులాగ అక్షరాల్తో ఇలావ్రాసేడుట ఓ ఉత్తరం:

"డియర్ ఫ్రెండ్,

మీ అడ్రసు 'కలం స్నేహితుల' పేజీలో ' ' మేగజైన్లో చూశాను. మీరు మగవారికి ఉత్తరం వ్రాయడమే మహాపచారంక్రింద భావించేబాపతువారు కారని తలుస్తాను.

నేనిక్కడ కాలేజీలో బి ఏ సీనియరు చదువుతున్నాను నాకుకూడా అచ్చంగా మీకున్న వేసరదాలు అందుకే మీకీఉత్తరం వ్రాస్తున్నాను మీరుకూడా ఈపాటికే దైనా

## వి. భాస్కరాచార్య

కాలేజీచదువు ప్రారంభించి ఉంటారని తలచెదను. త్వరలో రిప్లై వ్రాస్తారని ఆశిస్తాను.

మీ స్నేహాన్నికోరే,
సూర్యం."

మా వాడు ఇలాంటి ఉత్తరాలకు ఒక నమూనా దగ్గఱ ఉంచుకోవడం ఒక అలవాటుట!

నాలుగురోజులు గడిచాయి బహుశా వాడు ఊహించిఉండడు హఠాత్తుగా ఓనాడు రావలసినచోటినుంచే వచ్చింది ఒక ఉత్తరం సూర్యాని కాక్షణంలో ఎవరెస్టు అధిరోహించినంత హాయి కలిగి, వణుకుతూన్న చేతుల్తో ఉత్తరం అందుకొని చదివేడు

"ప్రియమైన సూర్యంగార్కి,

మీఉత్తరం అందింది నాఅడ్రసు పబ్లిష్ అయినదితడవుగా నాకు ఆరులెటర్సు వచ్చేయి! అందులో మీఉత్తరం నేను సెలెక్టుచేశాను. మీరనుకొన్నట్టుగా నేనిక్కడ కాలేజీలో ఇంటర్ సీనియర్ చదువుతున్నాను

నేను మానాన్నగారికేకైకపుత్రికను. నాకు క్రికెట్, టెన్నిస్ ఆటలురాక పోయినా వాటినిగురించి చాలసరదా ఉంది. మీకు వెనకటి క్రికెట్ స్కోరులుగురించి ఏమైనా భోగట్టా కావలిస్తే దయఉంచి వ్రాయండి మీరేమైనా ఆటలుఆడతారా?

నిజంగా మీ దస్తూరీచూసి నాకు చాలా ముచ్చటయింది. నా దస్తూరి బాగుండదు. మన్నించ ప్రార్థన

రిప్లైకైఎదురుచూస్తూ,
మీ స్నేహితురాలు,
కమల"

ఆ ఉత్తరం అనేకసార్లుచదివి కంఠతా వచ్చేవఱకూ మావాడుతృప్తిపడలేదు నిజంగా మావాడికి క్రికెట్, టెన్నిస్ వగైరాలను గురించి ఎక్కువ తెలియదు.

"ఆమె వాళ్లనాన్న కొక్కర్తే కూతురు!" ఆ క్షణంలో మావాడికి ఓ విజయవంతమైన-విశాలాంధ్ర సుజ్ఞాతలూగించిన - బోలెడు లక్షుల డబ్బు వ్యయంచేసిన - ఓ పిక్చర్లోని లక్షాధికారియైన తండ్రీ, అతని ఏకైకపుత్రిక అయిన ఓ అందాలరాశి, ఆ పుత్రికను పెళ్లాడిన అదృష్టవంతుడైన ఓ కాలేజీ స్టూడెంటూ దృష్టిపథంలో మెదిలారు ఆ పిక్చర్లో ఆ అమ్మాయీ, ఆ అబ్బాయి కారులో షికారు వెళ్లడం, సినిమాలు చూడటం, లోకంలో వీళ్లొక్కళ్లే ఆ జాతివాళ్లయినట్లు పార్కులో విహరించటం, మంచి నేపథ్య సంగీతంతో ఉన్న పాటలు పాడటం, ఏవో పుస్తకాల్లోలాగ హాయిగా మాట్లాడుకోవడం-ఇంకా ఎన్నో జ్ఞప్తికి వచ్చి మావాడికి గిలిగింతలు పెట్టేయిట

ఆ దిగ్భ్రమనుండి తేరుకొని వెంటనే ఒక ఇన్‌లాండ్ లెటరు వ్రాశాడుట!

"మిస్ కమలకు,

మీరు వ్రాసిన ఉత్తరం అందింది మీ ఆదరానురాగాలకు, ప్రత్యేకాభిమానానికి ధన్యవాదాలు

నేను మా నాన్నగార్కి ఒక్కణ్ణే కొడుకుని. నాకు కలంస్నేహితులంటే మా చెడ్డ సరదా. క్రికెట్, టెన్నిస్ ఆటలంటే నేను చెవికోసుకొంటాను. ఇక్కడ సిటీలో జరిగే మాచ్‌లకు తప్పకుండా హాజరవుతూ ఉంటాను క్రికెట్‌గురించి కావలిస్తే వ్రాస్తాను. మీ ఆదరానికి కృతజ్ఞత

మీ తెలుగు దస్తూరీ బాగానే ఉంది. ఫరవాలేదు. నాకు తెలుగులో చక్కని

శైలిలో వ్రాసేవాళ్లంటే చాలా యిష్టం. మీరు చక్కని తెలుగు వ్రాస్తున్నారు.

వీలయినపుడల్లా సినిమాలు చూడటం నాకొక వెఱ్ఱి అలవాటు. ఈ మధ్య చూసిన "దేవదాసు" సినిమా చాలా నాకు నచ్చింది. అంతక్రితమే నేను శరత్ నవల చదివి ఉండడంవల్ల ఆ పిక్చరు చూస్తున్నంతసేపూ నాకు ఆ కథలో కొన్ని మహత్తరమైన పోకడలు కన్పించాయి. అవి మీ కభ్యంతరం లేకపోతే వచ్చేలెటర్లో వ్రాస్తాను ఆ పిక్చరు మీరూ చూసేఉంటారు. మీ కెలా ఉంది?

మీ నాన్నగార్ని నేను ముఖతః ఎరగనప్పటికీ వారికి నా నమస్కారములు చెప్పగోరెదను.

త్వరలో రిప్లై వ్రాయండి.

ఇట్లు

మీ సూర్యం—" అని

ఈసారి కూడా మూడోరోజు సాయంత్రానికే రిప్లయి వచ్చిందట ఆ ఉత్తరంలో ఇలా ఉంది

"ప్రియమైన సూర్యానికి,

మీరు వ్రాసిన ఉత్తరం అందింది నాకు మీ ఉత్తరాలు చాల సరదాగా ఉన్నాయి కాబట్టి మీరు నా లెటరు అందిన వెంటనే రిప్లయి వ్రాసేయండి. ఆలస్యం భరించలేను. వీలయితే మీరు మద్రాసులోని ప్రసిద్ధ టెన్నిస్ తారల ఆటోగ్రాఫ్‌లు తీసుకొని నాకు పంపించమని కోరుతున్నాను మీకు తెలుగంటే ఉన్న అభిమానానికీ, నామీద ఉన్న ఆదరానికీ చాలా ఆనందం

నాకు కూడా 'దేవదాసు' పిక్చరు చాలా బాగుంది మీకుతోచిన పోకడలు తప్పకుండా వచ్చే లెటర్లో వ్రాయండి నిజంగా ఆ సినిమా చూస్తున్నంతసేపూ అలాగ ఓ మంత్రముగ్ధురాల్లాగ కూర్చున్నాను శరత్ నవలకూడా తప్పక చదువుతాను

మద్రాసు నటీని గురించి మన తెలుగు దేశంలోను, అందులో మనయీడువాళ్లలో ఉండే ఊహాలు మీకు తెలిసే ఉంటాయి అందుచేత మద్రాసునుగూర్చి వచ్చే లెటర్లో ఏమైనా వ్రాయండి.

ఒక్కమాట మీ ఫొటో ఒకటి పంపించమని కోరిక

మీ జాబు కెదురుచూచే,

మీ కమల"

ఈ లెటరు అందుకొన్న సూర్యం మూర్ఛపోయి, కాస్సేపటికి తెప్పిరిల్లి ఉంటాడు. ఇంకా ఆలస్యం ఎందుకన్నట్లు, ఆ వేళే ఎరిగిన ఓ ఫొటోగ్రాఫరుని బ్రతిమాలి చక్కగా ఫొటో తీయించుకొని వెంటనే ఒక కాపీ జతపరచి ఇలాగ వ్రాశాడుట.

"ప్రియమైన కమలకు,

'నా ఉత్తరాలు చదవటానికి బాగుంటా' యని మీ రేమేమో వ్రాశారు. మీ అనురాగానికి ధన్యుణ్ణి ఆటోగ్రాఫ్‌లకై తప్పక ప్రయత్నిస్తాను.

ఇక 'దేవదాసు' సంగతి. ఎంతో ఊహ మనస్సులో ఉన్నా వ్రాయలేక పోతున్నందుకు మన్నించండి. ప్రతివాళ్లూ 'దేవదాసు'ను భగ్నప్రేమకు ఆదర్శంగా తీసుకొనటం అలవాటైపోయింది కాని ఆ కథకు అంతకంటె ఎక్కువ ప్రాముఖ్యం ఉందేమో! మీరు సృజనాత్మక రచన గురించి విన్నారా? కొంచెం వివరిస్తాను.

మనం ఎప్పుడూ మనస్సుకు హత్తుకుపోయేటట్లు చిత్రించేది ఏదయినాసరే — లోకం దృష్టిలో మంచిదయినా, చెడ్డదయినా— మనస్సులో ఒప్పుకొని తీరుతాము. నీతి, అవినీతి—వీటిని గురించి తర్కించి ఓ నిర్ణయానికి ఒప్పించేకంటె సమర్థుడైన కథకుడు ఉన్న పరిస్థితి నే యథాతథంగా హృదయానికి నచ్చేటట్లు చిత్రిస్తాడు. అది చదివిన తర్వాత ఒక గొప్ప ఆనందం—లేక ఉత్తేజం—చదివే వాళ్ళలో కలుగుతుంది

'దేవదాసు' ఫలానా అని ఒక నీతిని బోధించే ఉద్దేశ్యంతో వ్రాయబడలేదు దేవదాసు వటి తెలివి తక్కువ త్రాగుబోతని కాని, 'ప్రేమ' అంటే తెలివితక్కువతనం అనిగాని శరత్ వ్రాయలేదు ఉన్న పరిస్థితిని చక్కగా చిత్రించి, ఆలోచించే బాధ్యత మనకే వదిలివేస్తాడు.

సరిగ్గా చూస్తే షేక్స్పియరు నాటకాల్లో కూడా ఇదే సూత్రం కనపడుతుంది. హేమ్లెట్, ఒథెల్లో—ఇవి ఒకానొకనీతిని బోధించే ఉద్దేశ్యంతో వ్రాయలేదు కాని అవి కొన్ని జీవితసత్యాలను బోధించవచ్చు హేమ్లెట్ తనతల్లి దుష్ప్రవర్తనచూసి ఉద్రిక్తుడవుతాడు స్త్రీజాతిఅంటేనే అతనికి అసహ్యం ఏర్పడుతుంది తుదకు అమాయకపు ప్రేయసి ఆ ఉద్రేకానికి గురిఅవుతుంది ఇది చదువుతుంటే మనకు 'హేమ్లెట్ మనలాంటి మనిషే' అనిపించినా, ఏదో ఒక తెలియని సానుభూతి ఏర్పడుతుంది.

ఇప్పుడు మీరీదృష్టితో ఆలోచిస్తే— దేవదాసు పార్వతిని పెళ్లిచేసుకోనే విషయంలో సంశయించడం, తర్వాత ఆమె కూడ పట్టుదలకుపోయి ముసలివాణ్ణే పెళ్ళి చేసుకోవడం, దేవదాసు చివరికి త్రాగుడుకి అలవాటుపడి మరణించడం — ఇలాంటి ఘట్టాలు చాలా చక్కగా అర్థమవుతాయను కొంటాను తప్పకుండా 'దేవదాసు' చదవండి చదివి నే వ్రాసిన విషయాలుగురించి ఆలోచించండి మీ అభిప్రాయాలు వ్రాస్తే చాలా సంతోషం

మద్రాసుగురించి 'ఏమైనా' వ్రాయమన్నారు మీరు బహుశా ఫిలిం స్టుడియోలు, తారలు, మెరీనా బీచి, ఇంకా ఇలాంటివి ఊహిస్తూ ఉంటారు వాటినిగురించి తెలిపే ఒక బుక్‌లెట్ పంపుతున్నాను వీటన్నిటిలోను మెరీనా బీచి నన్ను తన్మయుణ్ణి

# ★ కలం స్నేహితులు ★

చేసింది. ఆ బీచిలో ఉన్నంతసేపూ "చల్లని సాగరతీరం ..." అంటూ ఓ సాంఘిక చిత్రంలోని పాట జ్ఞాపకం వస్తుంది.

నా ఫోటో పంపిస్తూ, మీఫోటో ఒకటి పంపించ కోరుతున్నాను

ఇట్లు
మీ సూర్యం"

నాల్గోనాటికల్లా రిప్లయి వచ్చింది. అందులో ఓ చిన్న ఉత్తరంమాత్రం ఉంది:

"డియర్ సూర్యం,

మీఉత్తరం చదివి నేను థ్రిల్ అయాను మీరు 'దేవదాసు'నుగూర్చి వ్రాసిన విషయాల్ని తర్కించేపాటి తెలివి లేకపోయినా అర్థం చేసుకొన్నాను ఆ 'అమరప్రేమ' లోని మాధుర్యాన్ని గ్రహించాను

మద్రాసు బీచిగురించి వ్రాసినవాక్యాలు చాలా బాగున్నాయి నేను బహుశా త్వరలోనే మద్రాసు వస్తాను. మిమ్మల్ని తప్పక కలుసుకుంటాను.

రేపు ఏప్రిల్ ౯వ నా పుట్టినరోజు. అందుకు మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను మీ పుట్టినరోజు ఎప్పుడో తెలియజేస్తే ఓక చిన్న కానుక పంపుదామనుకొంటున్నాను ఎప్పుడో తెలియజేయండి మీఫోటో చూచి ముచ్చటయింది. భగవంతుడు మీ అందచందాలను, ఆరోగ్యాన్ని ఎప్పుడూ కాపాడాలని కోరుతున్నాను

ఇట్లు
ప్రేమతో
మీ కమల"

సూర్యం బి ఎ ఎస్. లో తగ్గిన అభ్యర్థిలా 'ఫీ' లయాడు. ఏదో జీవితపరమార్థం సాధించేసినట్లనిపించింది. "అయితే ఆ అమ్మాయి మనల్ని ప్రేమించేసిందన్నమాట! అహా! ఆమె ఎంతిచక్కగా వ్రాస్తుంది!" అనిపించిందిట చిన్నప్పుడు సూర్యం ఇంటిప్రక్క ముసలిజ్యోతిష్కుడు ఒకాయన సూర్యం జాతకం చూసి, 'ఈ డింభకుడు చాలా అదృష్టవంతుడవుతాడు!' అన్నాట్ట "మరి తనని ఓఅమ్మాయి ప్రేమించేసింది ఆ అమ్మాయి తండ్రి కోటీశ్వరుడి కూతురుట కూడా!" అని కూడా అనిపించిందట సూర్యానికి ఆమధ్య విడుదలయిన సినిమాలలోని ప్రేమగీతాలన్నీ అనువుల్రకింద మావాడి నోటంట వచ్చేసేవి మాకు అర్థం కాక "వీడు మారిపోతున్నాడురోయ్!" అనుకొనేవాళ్ళం.

సదరు ఉత్తరం అందిన మరుక్షణంలోనే ఓక ఉత్తరం వ్రాశేడు.

"డియర్ కమలా,

నీ ఉత్తరం అందింది. నాలో ఏదో పరవశత్వం కల్గింది నీ ఫోటో యీసారి వ్రాసేటప్పుడు తప్పకుండా పంపించు

నీ పుట్టినరోజుకి నేను రాలేకపోతున్నందుకు విచారిస్తున్నాను అయినా నీకు నా హృదయపూర్వక అభినందనలు నా పుట్టినరోజు " . " త్వరగా రిప్లై వ్రాయి నీక యూ.

ఇట్లు
ప్రేమించే
నీ సూర్యం"—అని

పోస్టుచేసేటప్పుడు గుండెలు బరువుగా కొట్టుకొన్నాయట!

ఈసారి మాత్రం పదిహేనురోజులయినా ఏమీ జాబురాలేదు మావాడు ఆశ్చర్యపోయి విషాదం పొందేడు పరధ్యాన్నంగా ఉంటున్నాడు కాని ఆశమాత్రం చావలేదు ఇలా ఉండగా ఒకనాడు అధాత్తుగా ఓ కవరు వచ్చింది అందులో ఓ శుభలేఖా, ఉత్తరం ఉన్నాయి

"శ్రీ సూర్యారావుగార్కి,

మీ రీ ఉత్తరం చూచి ఆశ్చర్యపడి ఉండవచ్చు నన్నెరుగక పోవడంవల్ల. అయినా వ్రాస్తున్నాను. మిమ్మల్ని నేను కూడా సరిగ్గా ఎరుగను కాని మా అమ్మాయికి మీరు ముఖ్య స్నేహితులని అమ్మాయి ఒకసారి చెప్పింది.

అందుచే మీరు మా కమలపెళ్ళికి తప్పక రావలెను

ఇట్లు
" రావు "

అని ఉంది ఆ ఉత్తరంలో.

మా వాడికి తల తిరుగుతున్నట్లయింది కాళ్లక్రింద భూమికూడా కదుల్తున్నట్లయిందట "ఆ అమ్మాయి నన్ను నిజంగా ప్రేమించేసి లెటరు వ్రాసిందే! మరి పెళ్లి కెలాగ ఒప్పుకొంది! ఒకవేళ తండ్రిమాట దాటలేకపోయిందేమో!" మావాడికి ఆక్షణంలో మాజీవిద్యార్థి నాయకుడొకాయన ఆయన కాలేజీలో చదివే రోజుల్లో "సంఘంలోని కుళ్ళు" ను గురించి దంచేసిన ఓ గొప్ప ఉపన్యాసం జ్ఞాపకంవచ్చిందట. చాలా ఉద్రేకపడి, ఏమీతోచక నారూముకి వచ్చేడుట.

మేముకూడా వాడిదుస్థితికి సానుభూతి చూపిస్తూ ఓ అయిదు నిముషాలు నిశ్శబ్దంగా కూర్చున్నాం

*   *   *

వేసంగి సెలవులికి నేను ఇంటికి వెళ్ళిన తరువాత సూర్యంగురించి దాదాపు మరిచిపోయాను కాని రిజల్ట్సునాడు, వాడు పరీక్ష తప్పటం చాలా ఆశ్చర్యంవేసింది ఓదారుస్తూ లెటరు వ్రాశాను

ఆ రోజునే మాకు ఎస్ ఎస్. ఎల్ సి. క్లాసుమేట్ అయిన సుందర్రావు మాయింటికొచ్చాడు అతను ప్రస్తుతం భీమవరంలో చదువుతున్నాడు. ఏదో కొంత లోకాభిరామాయణం తర్వాత, సూర్యం సంగతి గుర్తుకొచ్చి, సంగతంతా అతనికి చెప్పి, "ఎవరోయ్ ఆ మిస్, కమల! మావాడు నిష్కారణంగా పరీక్ష పాడు చేసుకొన్నాడు!" అన్నాను

అతను నవ్వు, ఏడుపుమధ్య ఒకస్థాయిలో ఆగిపోయి, నిలదొక్కుకుని ఇలాగ చెప్పేడు —"కాలేజీలో ఇంటర్ మొత్తంమీద ఆ పేరున్నవాళ్లు ఎవరూ లేనేలేరోయ్! కాని కమల అన్న ఓ అమ్మాయిని నే నెరుగుదును. నీవు చెప్పిన వివరాలు—ఒక ఇంటర్ మినహా —అన్నీ సరిపోతాయి ఆ అమ్మాయికిలాంటి చిలిపిపనులు అలవాటేనట! ఆ అమ్మాయి ఈ మధ్యే పెళ్లి చేసుకొని సుఖంగా ఉంది. పాపం! మీవాడి కెంతపని జరిగిందీ!" అని నిట్టూర్చేడు ★

# వనితాలోకం

## అదోరకం ఫాషన్

మా పెద్దక్కయ్య కూతురి పెండ్లి జరుగుతోంది కోరుగా. ఏదో పనుండి పందిట్లోంచి లేచి అలా ఇంట్లోకి వెళ్లా. ఓమూలగా అక్కయ్య అత్తగారి వేపుదగ్గర బంధువులావిడ ఎవరో కూర్చొనివుంది అతి విచారంగా. ఏమిటా అనుకుని "ఏమండీ ఇలా ఇక్కడ కూర్చొనున్నారు? ఒంట్లో సుస్తీగా వుందా?" అంటూ పలకరించాను మామూలుగా. "ఊహు వూరికే నే!" అంటూ ఏడుపులాటి నవ్వొకటి నవ్వేసింది. నాకు మహా ఆశ్చర్యం వేసింది. జనం అంతా కోలాహలంగా, ఆనందంగా తిరుగుతున్న సమయంలో అలా ఒంటరిగా విచారంగా - పెటపెటలాడుతూ కూచోటానికి మనస్సెలా ఒప్పిందా అవిడకని పోని ఒంట్లో సుస్తీయా అంటే కాదు మనోవేదనా అంటే మొదట్నుంచీ కూడా అలాటిదేమీ వున్నట్టు కనబడదు ఇంతకీ అలాంటివాళ్లను గురించి ఏమనుకోటానికీ పాలుపోలా!

నిజానికి కొందరున్నారు వాళ్ల మొహాలు ఎప్పుడూ చిటపటలాడుతూ, ఏడుస్తూ వున్నట్టుంటాయి, అందంమాట దేవుడెరుగు. అలా చిట్లించి—పెట్టడంలో ఏదో గొప్పదనముందనుకుంటారు వాళ్లు. లేనిపోనివి మనస్సులో పెట్టుకు మొహాలు వేళ్ళాడేస్తుంటారు కొందరు. ఈ జాతివాళ్ళు మొగవాళ్ళల్లో చాలా కొద్దిమంది వుంటారు నిజానికి వాళ్ళ వంత పరీక్షగా చూడం అనుకోండి

పని అంటే కొందరికి తగని మొహం మాడుపు పుట్టుకొస్తుంది. 'పని' మొదటక్షరం ఎదుటివాళ్ళు పలకంగానే ఏదో పిడుగు నెత్తినపడ్డట్టుగా మొహంపెట్టేసి ఓదీర్ఘనిశ్వాసం విడిచేస్తారు. అలాటి వాళ్లకు పనిచెప్పే కన్న శుభ్రంగా, కష్టమయినాసరే మనమే చేసుకోటం మేలనిపిస్తుంది నామటుకు నాకు.

కుళ్ళుతో జతచేసి ఏడుపు మొన్న మా ఫ్రెండు ఒకావిడ ఓ సిల్కుచీర తెప్పించుకు పక్కింటావిడకు చూపించదట. చూస్తుండగానే ఆ 'పక్కింటావిడ' గారి మొహం ఆముదంతాగుతున్నట్టుగా అయిపోయి తుర్రున ఇంట్లో కెళ్ళిపోయిందట. ఇదివింటే నాకు మాచెడ్డ నవ్వొచ్చేసింది.

మనకు—లేవని ఇతరులకున్నాయని వళ్లు వళ్లు ఏడిచిందాని వల్ల లాభం ఏమయినావుందా? దానివల్ల ఎదుటివాళ్ళ ఐశ్వర్యం ఆనందం తగ్గిపోవు సరికదా మన ఏడుపు మొహం బయట పడ్తుంది ఉంటే వున్నదాన్తో తృప్తిపడాలి- లేనంటే లేదే అని బాధపడకుండా నిండుకుండలా తొణక్కుండా వుండాలి— చిటపటలాడితే ప్రయోజనం ఏముంటుంది?

### శుభమల్లె

కొందరు పేరంటానికిగాని పెళ్లికిగాని వస్తారే కాని నలుగురితో కలిసి మెలసి తిరగనే తిరగరు సరికదా ఎక్కడున్నావ్ గొంగళీ అంటే వేసినచోటనేవున్నా నన్నట్టుగా ఎక్కడికక్కడ ఓమూల చూచుకు కూలబడిపోతుంటారు పోనీ బలహీనమేమో ననుకోడానికి అలాటిదేమీ వుండదు. శక్తిలేకపోతే పోనీ తిరక్కపోతే ఫీడాపోయె - అలా కాకుండా మొహం మాడ్చుకోటం ఎందుకు. అలాటివాళ్ల మొహాలు చూస్తుంటే నిజంగా వేడుకగా వచ్చారని కాకుండా, ఎవరో పోతే పరామర్శకు వచ్చినట్టుంటుంది అవతలివాళ్లకు. సర్వసాధారణంగా ఇలాటి సందర్భాల్లో అందరికీ కాస్తోకూస్తో పనివుండక పోదు. ఎవరికితోచినపని వాళ్లు తమాషాగా నవ్వుతూ హుషారుగా చేసుకుపోతే చూట్టానికీ—చేసేవాళ్లకూ కూడా ఎంతో హాయిగా వుంటుంది అంతేకాని ఎక్కడ పనిచెయ్యాల్సొస్తుందోనని ముందే మూతి ముడుచుకుకూచుంటే ఎలావుంటుంది?

## పవని నిర్మల ప్రభావతి

### ఓర్వలేక

అవతలివాళ్ళ వస్తువుల్నీ—చీరల్నీ—నగలనూ చూచి మనస్సులో చెప్పరాని ఆవేదనపడ్తుంటారు కొందరు. మనస్సులో మాటమనకెలా తెలుస్తుందంటా రేమో!

దానికిసాముద్రికమూ, జ్యోతిషమూ, దివ్యదృష్టీఅక్కర్లేదు వాళ్లమాటల్ని మొహాల్ని బట్టి చెప్పెయ్యొచ్చు. లేనిపోని దిగుళ్ళు పెట్టుకుని అనవసరంగా ఓర్వలేనితనంతో బాధపట్టం మంచిదికాదు. సాధ్యమైనంతవరకు చూచీ ఊరుకుని మొహం కళకళలాడుతూ వుంటే అది చూచేవాళ్లకు ఎంతో హాయిగా వుంటుంది మా ఒదిన (ఆడబిడ్డ) కూతురితోడికోడళ్ళిద్దరున్నారు వాళ్లిద్దరూ క్వైట్ ఆపోజిట్ అన్నమాట. పెద్దావిడ ఎంతకళకళలాడుతూ నవ్వుతూ ఆలాజాలంగా ఉంటుందో చిన్నావిడ అంత చిటపటలాడుతూ మొహం పెటపెటపెట్టుకుని వుంటుంది.

కొందరు వూరికేనే ఉట్టిపుణ్యానికి అదో ఫేషన్ అనేలెక్కలో మొహం మాడుస్తుంటారు. అలాటి వాళ్ళ దగ్గర కూచోటానికిగూడా బుద్ధిపుట్టదు కారణమేమీ వుండదు. ఎవరో తమకు చెయ్యలేదనో- ఏమిటో తక్కువైందనో మనసులో పెట్టుకు మొహం మటమటలాడిస్తుంటారు. వాళ్లకువాళ్లకెలాగున్నా ఎదుటివాళ్ల గతిఅన్యాయం కారణం తెలీక—తెలుసుకోటానికి ఏకారణమూ లేక విల్లుపడే బాధ అంతింతకాదు

### వెలలేని భూషణం

స్త్రీకి చిరునవ్వు అందం. మహామహా వాళ్లు ఎంతో కష్టపడి సాధించలేని పనిని - తెలుసుకోలేని విషయాన్ని - స్త్రీ తన చిన్న - అందమైన చిరునవ్వుతో సాధిస్తుంది ఆమె నవ్వుకున్నశక్తి ప్రపంచంలో దేనికీ లేదు - ఇటు ప్రణయస్వరూపిణి - అటు ప్రళయస్వరూపిణి కూడా అలాటి స్త్రీ - ప్రకృతినే తన ఒళ్లో లాలించి పాలించగలిగే స్త్రీ - ఎలా వుండాలి? నవ్వుతూ - కళకళ్లాడుతూ - ఆనందంగా—వుత్సాహంగా—ఆదర్శప్రాయంగా వుండాలిగదా? లక్షబాధలు మనస్సులో వుండనీ - మనమనస్సు ఓసముద్రం

(56-వ పేజీ చూడండి)

# ఆడపిల్లల పెంపకం

## ★ తల్లిదండ్రుల అగచాట్లు ★

ఈ రోజుల్లో ఆడపిల్లల పెళ్ళిళ్ళకింత లేని ఇబ్బందులు పడడానికి ఇంకా చాలా కారణాలున్నాయి అసలు మన ఆడపిల్లల పెంపకంలోనే కొన్ని లోటుపాట్లున్నాయి.

మన ఇళ్ళల్లో ఆడపిల్ల పుట్టిందనగానే తల్లిదండ్రులా పిల్లనెప్పుడో ఒకప్పుడు ఒక అయ్యచేతిలో పెట్టాలనీ, ఆడపిల్లకిక పెళ్లి తప్ప మరివేరే బతుకుతెరువేదీ లేదని అనుకుంటారు. అసలు ఆడపిల్ల ఒక్క పెళ్లి చేసుకోడానికే ఈ భూమ్మీద పడిందని ఆలోచిస్తారు.

ఆడపిల్లకి పెళ్లి అవసరమే నేనేమీ కాదనడంలేదు కాని పెళ్ళాడ్డం ఒక్కటే భగవంతుడు దాని మొహాన రాసిపెట్టాడంటే మాత్రం చాలా దురన్యాయం!

## చదువు సంధ్యలు

ఇందుచేతనే మనఇళ్లల్లో ఆడపిల్లలచదువులంటే అంతగా పట్టింపులేదు "ఆఁ ఆడదానికి చదువెందుకు లెస్తూ? ఉద్యోగాలు చెయ్యాలా? ఊళ్ళేలాలా?" అని తీసేసినట్టు మాట్లాడతారు. మగపిల్లవాడి చదువుకోసం ఇంటిల్లపాదీ అగ్గగ్గలాడిపోతారు! ఎడపిల్లలు బయలుదేరిన ఇళ్లల్లో కాస్త చేతికంది వచ్చిన ఆడపిల్ల ఉందంటే పాపం ఆ పిల దాన్ని అసలు బళ్ళోకే వెయ్యరు! ఒకవేళ వేసినా అది ఇంట్లో పనిఅంతా చేస్తేనేగాని బళ్ళోకి వెళ్ళనివ్వరు! ఆ సమయానికే చంటిపిల్లన్నా రాగాలు మొదలెడితే ఆ రోజికిక ఆపిల్ల బళ్లోకి వెళ్లడం పడదన్నమాటే!

ఒకవేళ ఏదో చదివించినా ఏ అయిదో క్లాసు దాకానో చదివిస్తారు. మొత్తంమీద ఆడపిల్ల చదువంతా నానాకాలంచదువులాగే సాగుతుంది

**పి. జి. సరోజిని**

నా చిన్నతనంలో ఒకసారి మా మేష్టారు పిల్లలందరిచేతా విద్యమీద కాంపోజిషను రాయించారు.

ఆ కాంపోజిషనులో మేమంతా విద్యవల్ల ఎన్నెన్నో ఉపయోగాలున్నాయని రాశాం నా చిన్నతనంలో మా మేష్టారు పిల్లలందరిచేత ఈ పద్యం కంఠతాపట్టించారు.

"విద్యయొసగును వినయంబు వినయమునను,
బడయుపాత్రత పాత్రత వలనధనము,
ధనములనను ధర్మంబు దానివలన,
నైహికాముష్మిక సుఖంబు లందునరుడు"

ఆతరవాత మా మేష్టారు మళ్లీ ఇంకోసారి 'స్త్రీవిద్య' మీద కాంపోజిషను రాయమన్నారు. అందులో స్త్రీలకు గృహసంరక్షణకవసరమైనంతవరకే చదువు చెప్పించాలని రాయమన్నారు ఆ రోజుల్లో "స్త్రీవిద్య అవసరమా? కాదా?" అని విద్యార్థులు చర్చలు జరిపేవారు. అసలు స్త్రీవిద్య అనవసరమని చాలామంది బల్లగుద్ది మాట్లాడేవారు

ఈ రోజుల్లో 'స్త్రీవిద్య' అవసరమా? కాదా? అని ఎవరు చర్చించరు స్త్రీలకు కూడా విద్యకావాలనే అంటారు కాని అదేంపాపమోగాని ఆడపిల్లల చదువులంటేనే అదోలా చూస్తారు. జన్మ ఎత్తినందుకు ఆడదానికి కావలిసిందల్లా ఒక్క పెళ్లే అన్నట్టు ఆలోచిస్తారు!

## చదువులు కావాలి!

అంతేగాని స్త్రీకికూడా చదువు చాలా అవసరమని ఆలోచించరు! మగవారికి చదువు అంత అవసరమని అందరు అంత గొంతుచించుకుంటారే! మరి స్త్రీలకి మాత్రం చదువెందుకు ముఖ్యం కాదు? చదువువల్ల మగవారికి వినయవిధేయతలు, వివేకము కలుగుతాయని అంటారే! చదువుకుంటే ఆ వినయ విధేయతలు వివేకము ఆడవారికి మాత్రం ఎందుకు కలగవు?

## కట్నాలకోసం డబ్బు జాగ్రత్త

చాలామంది తల్లిదండ్రులు ఆడపిల్లల పెళ్ళిళ్ళకోసమని అష్టకష్టాలుపడి, అవసరమయితే భూములు, ఖుట్రలు కూడా తెగనమ్ముకుని మూడువేలు, నాలుగు వేలు జాగ్రత్త పెడతారు ఆ డబ్బంతా కన్నబిడ్డతోసహా ఒకఅయ్య ఒళ్లో గుమ్మరిస్తారు!

పోనీ ఆ డబ్బుపెట్టి లక్షణంగా కడుపున బుట్టిన బిడ్డలకి కాస్త చదువెందుకు చెప్పించరు? ఆ డబ్బుతో ఆ పిల్లలకి కాస్త బియ్యేదాకా చదువు చెప్పించవచ్చును గదా! డిగ్రీ చేతులోఉంటే ఆపిల్ల ఏదో ఉద్యోగమో సద్యోగమో చేసుకుని తన బ్రదుకు తను బ్రదుకుతుంది!

## స్వయంశక్తి

ఆడపిల్లలందరికీ చిన్నప్పటినించీ

చూడగా చూడగా మన పిల్లల పెంపకంలోనే ఏదో తేడా ఉన్నట్టు కనబడుతూంది. "ఆడపిల్ల పుట్టిందనగానే ఇరుగుపొరుగువారు "ఆడపిల్లా! అయితే ఆయన ఒక సంచీ, జాగ్రత్త పెట్టుకోవాలన్నమాట!" అని వేళాకోళం చేస్తారు. మరికొందరు "అయ్యో! ఆడపిల్లటండీ!" అని చప్పరించేస్తారు. ఆఖరికి కన్నతల్లికికూడా ఆడపిల్ల అంటే అలుసే! ఇలాగ ఆడపిల్ల పుట్టీ పుట్టగానే తల్లిదండ్రులకంత బరువుగా కనిపించడానికి కారణమేమిటి? తమ పెంపకం మూలాన్నే బాలిక లీవిధంగా బరువైపోతున్నారని వారాలోచించరు.

ముందుగా తమ కాళ్ళమీద నిలబడడం అలవాటు చెయ్యాలి. దానికోసం ముఖ్యంగా మొగపిల్లలకి చెప్పించినట్టే పెద్దపెద్ద చదువులు చెప్పించాలి అలాగ చెప్పిస్తే వారు కూడా ఏవేవో ఉద్యోగాలు చేసుకుని సుఖంగా బదుకుతారు ఆపైన అంతగా తగిన వరుడెవరైనా దొరికితే పెళ్ళిళ్ళు చేసుకుంటారు. లేకపోతే ఎక్కడేనా ఉద్యోగం చేసుకుంటూ సుఖంగా కాలక్షేపం చేస్తారు.

ఈరోజుల్లో తల్లి దండ్రులు తమ కుమార్తెలకు సకాలంలో వివాహాలు జరగకపోతే ఏదో ఒక పెద్ద ఆపత్తు మీద విరుచుకుపడ్డట్టు భయపడతారు. తమ బిడ్డలకికూడా ఆ భయం ఉగ్గుపాలతో నూరిపోస్తారు. అలా ఎందుకు చెయ్యాలి! ఆడపిల్ల తన కాళ్ళమీద తను నిలబడేటట్టెందుకు చెయ్యగూడదు? పూర్వకాలంమాటేమో నేను చెప్పలేనుగాని ఈ రోజుల్లోమాత్రం ఇది చాలా అవసరం!

## వేలకువేలు కట్నాలిచ్చిన పెళ్ళిళ్ళు

అసలు ఆడపిల్లలకి చదువుసంధ్యలు చెప్పించకుండా ఇంట్లో కూర్చోబెడతారు. కాస్త ఉన్నవాళ్ళయితే వేలు వేలకుకట్నాలిచ్చి పెళ్ళిళ్ళుచేస్తారు! ఆ తరువాత ఏదేనా కొంచెం తేడావస్తే ఆపిల్లగతేం కాను! ముందుగా కీడెంచి మేలెంచమన్నారు! అంతకట్నం సమర్పించిపెళ్ళిచేసినతరవాతఅత్తవారుగాని, భర్తగాని తిన్నగాచూడకపోతే ఆ అమ్మాయి గతేం కావాలి? ఒకవేళ మాటవరసకి అంతకన్నా పెద్ద ఆపత్తేవస్తే ఆపిల్లకిక ముందు దారేమి ఉంది? పుట్టింటివారా పిల్లని ఎంతకాలమని భరిస్తారు? ఒకవేళ భరించినా అలాంటిపిల్లల్ని పుట్టింటివారంత ఆదరంగా చూస్తారా? ఆపిల్ల అలాగ పుట్టింట్లోపడి నలుగురికీ బండచాకిరీ చేస్తూ బతకవలసిన దేనా?

ఈ రోజుల్లో ఇలాంటిబాధ లనుభవించే వారి నెంతమందినో మనం కళ్ళారా చూస్తున్నాం.

## పరాధీనపు బతుకులు

అన్నిరోజుల్లో స్త్రీ బతుకే పూర్తిగా పరాధీనపు బతుకైపోయింది. మా అమ్మమ్మ చీటికీ మాటికీ ఒక సామెత చెబుతూండేది. ఆడదానికెప్పుడయినా తల్లిదండన, తండ్రిదండన, భర్తదండన, పుత్రదండన తప్పవట! నాకదేమీ తిన్నగా తెలియలేదు!

“అమ్మమ్మా! అదేమిటి? ఆడదానికెప్పుడు ఎవరో ఒకరు కొట్టి తిట్టి బాధలు పెడుతూండాలా ఏమిటి?”

అని అడిగాను. మా అమ్మమ్మ ఒక బోసి నవ్వునవ్వి నన్ను మెల్లిగా బుజ్జగించి సమాధానం చెప్పింది:

“దండన అంటే తిట్టి, కొట్టి బాధపెట్టడం కాదమ్మా! ఆడదై పుట్టాక ఎప్పుడు ఎవరో ఒకరి ఒద్దికలో ఉండాలన్నమాట.”

నాకప్పుడు బాగా చిన్నతనం! ఇప్పుడా ‘ఒద్దిక’కి అర్థం ఏమిటో బాగా తెలిసొచ్చింది గాని ఆరోజుల్లో నాకామాట కర్థం తిన్నగా తెలియలేదు ఒద్దికఅంటే ఏమిటని మళ్ళీ అడిగాను—

“ఒద్దిక” అంటే ఒకరి చెప్పు చేతల్లో ఉండడం అన్నమాట!”

అని చెప్పింది. నేను చిన్నతనంలో కొంచెం గారాబంగా పెరిగాను. అందుచేత అప్పుడు నాకు ఒకరి చెప్పుచేతల్లో ఉండడం అంటే ఏమిటో తిన్నగా తెలియలేదు. ఇప్పుడిప్పుడే ఒద్దిక కొద్దోగొప్పో చవిచూశాక దీని అంతరార్థం అంతా పూర్తిగా బోధపడింది!

## ఒద్దిక

ఒద్దికఅంటే స్వతంత్రంగా ఊపిరిపీల్చుకోకుండా బతకడమన్నమాట! భూమ్మీద పడిందిమొదలు హరీమన్నదాకా పరాధీనపు బ్రదుకు బ్రతకడమన్నమాట! ఇదంతా పూర్వపురోజుల్లో ఎలా ఉండేదో నేను చెప్పలేనుగాని ఈరోజుల్లో మాత్రం పరాధీనపు బతుకులవల్ల స్త్రీలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఏకాలపుధర్మాన్ని బట్టి ఆకాలపు ఆచారా లలవాటు చేసుకోవాలి అంతేనేగాని ఎనకెప్పుడో ఆచారంగా అలవాటయిందని ఇప్పుడుకూడా అదే పట్టుకు వేళ్ళాడితే ఎలా? ధర్మశాస్త్రాల్లో గూడా కాలాన్నిబట్టి ఆచారాలు మార్చుకోవచ్చని ఉందిట! ఏదో మాటమీద మా తాతయ్య ఒక సారి నాతో అలాగ చెప్పాడు. అసలా ధర్మశాస్త్రాలమాట మనకెందుకు? ఈరోజుల్లో ఆ పూర్వాచారాలు, సంప్రదాయాలు సరీగా నప్పడంలేదు!

ఇంతకీ నేను చెప్పొచ్చిం దేమిటంటే— ఆడపిల్ల కేవలం పెళ్ళికోసమే పుట్టిందన్న ఆలోచన పూర్తిగా మానెయ్యాలి దానికి కూడా మగపిల్లలతో పరిసమానంగా చదువు చెప్పించాలి అసలు చదువుకన్నా ముఖ్యమైనది ఇంకొకటిఉంది బాలికలందరినీ చిన్నప్పటినించీ తమ కాళ్ళమీద గట్టిగా నిలబడేటట్టు చెయ్యాలి దానికి తగినధైర్యం కలిగించాలి

## వృత్తి అవకాశాలు

ఈ రోజుల్లో బాలికల కెన్నెన్నో వృత్తి అవకాశాలు దొరుకుతున్నాయి చాలామంది స్కూళ్ళలో మేష్టరీ ఉద్యోగాలు చేసుకోవచ్చును ఇంకా కొంతమంది ఆస్పత్రులలో నర్సులుగా చేరి బ్రతకవచ్చును పెద్ద పెద్ద చదువులు చదువుకున్నవారు కాలేజీలలో లెక్చరరు ఉద్యోగాలు కూడా చేసుకోవచ్చును.

మన పల్లెటూళ్ళలోను, పట్టణవాసాల్లోను లేడీడాక్టర్ల సంఖ్య చాలా తక్కువగా ఉందని అంటున్నారు. మన ప్రణాళిక లాచరణలో పెట్టుకోవాలంటే లేడీ డాక్టర్లు చాలామంది కావాలిట! ఇప్పుడిప్పుడు మిగిలిన వృత్తులలోకూడా స్త్రీలకు మంచి మంచి అవకాశాలు కల్పిస్తున్నారు. ఒక్క మహిళా సంక్షేమశాఖకే చదువుకున్న స్త్రీలెంతోమంది ముందుకురావాలని అంటున్నారు.

చదువుకున్న స్త్రీలకీ రోజుల్లో ఏవో అవకాశా లేర్పడుతూనే ఉన్నాయి అవకాశాలు లేకపోయినా, స్త్రీ స్వతంత్రంగా తన కాళ్ళమీద తాను నిలబడి సగౌరవంగా బతకదలుచుకుంటే ఏదో ఒకదారి కనిపించదా ఏమిటి?

ముందుగా బాలికలు, వారి తల్లి దండ్రులు పూర్తిగా పాతకాలపు ధోరణిలో ఆలోచించడం మానివెయ్యాలి.

మగపిల్లలు పెరిగి పెద్దవారయితే కుటుంబానికాసరాగా ఉంటారని అనుకుంటారే! బాలికలుకూడా అలాగ ఆసరాగా ఉండాలని ఎందుకనుకోకూడదు? దానికి తగినట్టుగా వారికి చదువుసంధ్య లెందుకు చెప్పించరు?

వివాహం చేసుకున్న స్త్రీ మాత్రం స్వతంత్రంగా ఏదో జీవనోపాధి చూసుకుంటే తప్పేముంది? ఆ విధంగా సంసారానికి కొంచెం ఆసరా ఇస్తే తప్పేముంది?

అదీగాక ఈ రోజుల్లో ఏ ఆధారము లేకుండా అల్లాడే స్త్రీ లెంతోమంది కనిపిస్తున్నారు వీరు చిన్నతనంలో ఇంతో అంతో చదువుకొనిఉంటే ఈ నాడింత ఇబ్బందులుపడవలసిన అవసరమే లేకపోవును

ఇప్పుడైనా వీ రెవరిమీదనో ఆధారపడి బరువు బతుకులు బతకడంకంటె స్వతంత్రంగా ఏదో ఒక జీవనోపాధి చూచుకోవడమే మంచిది.

నేనిదంతా ఎందుకు రాశానంటే ఆడపిల్లకి పెళ్ళితప్ప మరి వేరే గత్యంతరం లేదనుకోవడం మూలానే ఈ పెళ్ళిళ్ళింత గడ్డు సమస్యలుగా తయారవుతున్నాయి.

అలా కాకుండా మన పిల్లలకి చదువు సంధ్యలు, కాకపోతే ఏవైనా వృత్తివిద్యలు చెప్పిస్తే ముందస్తుగా వాళ్ళకి తమ కాళ్ళ మీద నిలబడడం అలవాటవుతుంది.

ఆపైన అంతగా కాదుకూడదుఅనుకుంటే– తగినవాడెవడయినా కనిపిస్తే, పెళ్ళి చెయ్యవచ్చును. ఒకవేళ అలాంటివాడెవడు కనబడకపోతే ఆపిల్ల హాయిమంటూ ఎక్కడో అక్కడ ఏదో ఉద్యోగమో సద్యోగమో చేసుకుని సుఖంగా బతుకుతుంది


మనదేశంలో ఆడపిల్లకి పెళ్ళి కాకపోతే

(56-వ పేజీ చూడండి)

# కొత్తరకం కర్టెన్‌లు,
# టేబుల్ క్లాత్‌లు

క్రోషియా దారంతో అల్లికసూదులు వుపయోగించకుండా కొత్తరకం డోర్ కర్టెన్‌లు, టేబుల్ క్లాత్స్, అల్లవచ్చు. అట్టే శ్రమపడవలసిన అవసరం లేకుండా తయారు చేయవచ్చు. చూడటానికి చాల నాజూగ్గా అందంగా వుంటాయి.

1 వ బొమ్మ



మేకుల చదరం. మేకుకు మేకుకు మధ్యదూరం 1 అం॥ వుండవలెను.


ఇందుకు కావలసిన వస్తువులు: క్రోషియా తెల్లదారం వుండలు, $1\frac{1}{2}$ అంగుళం ఇనప మేకులు, పుస్తకాలు కుట్టేసూది, బ్లేడు, కలర్ వాయల్ బట్ట.

అల్లేవిధానం: ముందు మనం ఒక చిన్న టూల్ క్లాత్ అల్లుకుందాం. దీనికి 56 చీలలు (మేకులు) కావాలి. చీలలు సాధారణంగా మనఇండ్లల్లో వుంటాయి. లేకపోతే బజార్లలో అమ్ముతారు. దొడ్లోగాని, తలవాకిట్లోగాని గట్టిగావుండే మట్టి నేలను రాళ్ళు, చెత్త లేకుండా శుభ్రంచేయాలి. పందిరిక్రింద అయితే మంచిది. ఎండలేకుండా వుంటుంది. నేలమీద మొదటిబొమ్మలో చూపినట్లు మేకులు నలుచదరంగా పాతాలి. మేకుకు మేకుకు మధ్యదూరం ఒక అంగుళం వుండాలి. [1 వ బొమ్మలో వున్న చదరం మేకులతో యేర్పరచిన చదరం. ఆ చుక్కలే మేకులు అనుకోవాలి.] పై వరస 15 మేకులు, క్రింది వరసన 15 మేకులు అటు ఇటు 13 మేకుల చొప్పున పాతాలి. అంటే నాలుగువైపులా మూలచీలలు కాకుండా, 13 చీలల చొప్పున వుంటాయన్నమాట ఒక్కొక్క వరసన. మేకులు నేలమీద పాతేటప్పుడు మరీ లోతుగా కాని, మరీ వదులుగాకాని పాతకూడదు. గట్టిగా లాగితే రాకుండావుండాలి నేలపైకి అరంగుళం తక్కువకాకుండా చీలవుండాలి. నేలమీద ముందు స్కేల్‌తో గుర్తులుపెట్టుకొని ఆపైన మేకులు నేలలోకి దింపితే 'మేకుల చదరం' వంకరపోకుండా వుంటుంది.

## కుమారి జి. ఎస్. వాణి

తర్వాత-తెల్లదారపు వుండలు రెంటిని ఒకటిగా ముందేచుట్టి వుంచుకోవాలి. ఇప్పుడు మేకుల చదరానికి ఒక మూల చీలకు (2) వ బొమ్మలో "ఏ" గుర్తువున్న చోట అల్లే దారాన్ని ముడివేయాలి. ఈ దారాన్ని

(2) వ బొమ్మ



దారము నిలువు వైపుగా అనుపోయుట (చుట్టుట)

పైవరసలోని రెండవమేకు మీదుగా క్రింది వరసలోని, రెండవమేకుకు చుట్టుకుంటూ తిరిగి పైవరసలోని 2 వ చీల దగ్గిరకు తీసుకు రావాలి. ఇది ఎలా అల్లాలో 2 వ బొమ్మ చూస్తే తెలుస్తుంది. పైవరసలోని ప్రతిచీలకు క్రిందివరసలోని దానికి సరియైన ప్రతి చీలకు దారాన్ని అనుపోసుకుంటూ (చుట్టుతూ) రావాలి. ఇలా నిలువుగా పైవరస చీలలకు, క్రిందివరస చీలలకు దారాన్ని అనుపోసిన తర్వాత దారాన్ని తెంపకుండ మూలచీల మీదుగా ప్రక్కకు తీసుకుని అయి మూలలుగా చీలలకు దారాన్ని అనుపోయాలి. ఇది ఎలా అల్లాల్లో (8) వ బొమ్మచూస్తే తెలుస్తుంది. అయిమూలలుగా దారాన్ని అన్ని చీలలకు చుట్టటం అయినతర్వాత దారాన్ని మూల చీలకు ముడివేసి తెంపివేయాలి.


నాలుగవ బొమ్మలో * గుర్తు వున్నచోట మూల చీలకు దారాన్ని తిరిగి ముడివేసి 8 వ బొమ్మలో అల్లేట్టుగానే దీన్ని అయిమూలలుగా అల్లుకుంటూ రావాలి. 4 వ బొమ్మ చూస్తే ఇది ఎలా అల్లాల్లో బోధపడుతుంది. పూర్తిగా అన్నిచీలలకు అయిమూలగా అల్లిన తర్వాత దారాన్ని మూలచీలకు ముడివేసి తెంపివేయాలి. 5 వ బొమ్మలో * గుర్తువున్న చోట మూలచీలకు తిరిగి దారాన్ని ముడివేసి 2 వ బొమ్మలో అల్లినట్లే అల్లుకుంటూ రావాలి. 5 వ బొమ్మలో దీన్ని ఎలా అల్లాలో చూడవచ్చు.

ఇప్పటికి మేకుల చదరానికి దారం అనుపోయటం పూర్తిఅయినట్లు, ఇప్పుడు దారాలన్నీ కచిబిచిగా కనబడుతుంటాయి. కాని పరీక్షగా నిదానంగా చూస్తే 6 వ బొమ్మలో మాదిరిగా చదరాలు, చదరాలు మాదిరిగా కనబడుతుంటుంది. ఈ చదరాలు "*" గా వుండటం మనం 6 వ బొమ్మలో చూడవచ్చు. పుస్తకాలు కుట్టే సూదికి రెండు పొరలలో దారాన్ని ఎక్కించుకొని ప్రతి చదరం కలిసేచోట అన్నిదారాలు కలిపి ముడివేయాలి. అంటే మనం చీలల చదరం మీద నిలువుగాచుట్టినదారాలు, మూలలుగా చుట్టినవి, అడ్డంగాచుట్టినవి—అన్నీ కలిపి ఏర్ప

(8 వ బొమ్మ




దారాన్ని మూలవైపుగా అనుపోయుట.



దారాన్ని మరోవైపు మూలగా చుట్టుట.

డీనచదరం" కదా! ఇది! ఇందులో మధ్యభాగాన్ని 'సూదీ-దారం'తో ముడులు వేయాలన్న మాట. 6వ బొమ్మలో చదరాల మధ్యవున్న పెద్ద చుక్కలే ఇప్పుడు మనం వేసే ముడులు. 2, 3 ముడులు వేస్తే, గాని "చదరం" లోని దారాలన్నీ కలుసుకోవు. ఇలా ప్రతిచదరాన్ని ముడి వేసుకుంటూ రావాలి. ఇప్పుడు "మేకుల చదరం" మీద క్లాత్ చాల టైట్ గా వుంటుంది. ఇక ఈ క్లాత్ ను వేరు చేయాలి. అంటే—మేకులచదరానికి చుట్టూ, ప్రతి చీలకు చీలకు కలుసుకొని వున్న దారాల్ని, బ్లేడ్ తీసుకొని కోసివేయాలి. ఇలా చుట్టూ మేకులకు పట్టుకున్న దారాలన్నీ కట్ చేస్తే మధ్యమున్న బట్ట వూడివస్తుంది. ఇదన్న మాట ఇంతసేపటిగా మనం తయారుచేసిన క్లాత్.

సన్నటి కలర్ వాయల్ తీసుకొని ఇప్పుడు మనం అల్లిన బట్టచుట్టూ, బెత్తెడో, జానెడో వెడల్పువ (వాళ్ళ వాళ్ళ ఇష్టాన్ని బట్టి) టైలర్ చేత కుట్టించుకోవచ్చు. లేదా చేత్తో కుట్టుకున్నా సరే. కావాలనుకున్న వారు




దారాన్ని అడ్డముగా ఆసుపోయుట

——> గుర్తుగలదగ్గిర దారాన్ని అంతా క్లాత్ పూర్తిఅయిన తర్వాత కట్ చేయవలయును.

అడుగున కూడ క్లాత్ వేసుకోవచ్చు. గట్టిగా ఎక్కువ రోజులు వుంటుంది.

ఇప్పుడు క్లాత్ పూర్తిగా తయారయిందన్నమాట. వ్రాయటం అంటే ఇంత పట్టింది కాని అల్లటం చాల సులభం. బొమ్మలు పరిశీలించి చూస్తే ఎలా అల్లేది ఇట్టే తెలుస్తుంది; ఎంతో సులభంకూడ. కాని ఇది ఆరుబయట తయారు చేసేది కాబట్టి వర్షం వచ్చేప్పుడు, ఎండగా వుండే టప్పుడు మొదలు పెట్టుకోకూడదు. ఒక రోజులోనే పూర్తి చేయాలి. వీలయినవాళ్ళు కార్పెంటర్స్ చేత చెక్క ఫ్రేమ్ మనకు కావలసిన కొలతల్లో చేయించి దానిమీద అంగుళం దూరంలో ఇనపమేకులు కొట్టించుకొని దీని మీద అల్లుకోవచ్చు.

ఇప్పుడు చెనిచ్చిన కొలతల్లో అయితే 15 అం" గుడ్డవస్తుంది. కాని దీన్ని ఆధారంచేసుకొని మనం కావలసిన కొలతల్లో విండో కర్టెన్లు, డోర్ కర్టెన్సు తయారుచేసుకోవచ్చు. అన్నిటికన్న డోరు కర్టెను చాల బాగుంటుంది. నిలువు 69 చీలలు, అడ్డం 33 చీలలు (మూల చీలలుకూడా కలిపి) గల చట్రంమీద అల్లితే గదివాకిలికి సరిపోయే క్లాత్ వస్తుంది. దీనికి అడుగున, చుట్టు



క్లాత్ పూర్తిఅయిన తర్వాతవుండేవిధం. మధ్యనవున్న చుక్కలే ముడులు.

నాలుగు వైపులా గుడ్డ వేయించి కుట్టుకుంటే చాల బాగా ఉంటుంది. దూరం నుంచి చూస్తే 'చేత్తో తయారుచేసిందేనా?' అని అనిపిస్తుంది.

ముందు ఏదైనా చిన్నది అల్లప్రయత్నం చేసి ఆపైన పెద్దది అల్లటానికి మొదలు పెట్టండి. ★

# ★ చౌ చౌ దోసె ★

మొన్నీ మధ్య మా అమ్మగారు గుంటూరు వెళ్లారు. అక్కడ ప్లీడరుగారి భార్య కాఫీకి పిలిచారట. ఈదోసెలు పెట్టి కాఫీ ఇచ్చారట. చాలా బాగున్నవని అమ్మగారు ఆవిడను ఎలా చేశారండీ అని అడిగారట. ఆవిడ చెప్పిందట. ఇంటికి వచ్చిన తర్వాత అమ్మగారు చేసే విధం చెప్పారు. నేను చాలాసార్లు ఈదోసెలు పోశాను. చాలా బాగున్నవి. మీరు చేస్తారు గదూ?

కావలసిన వస్తువులు!

పెసరపప్పు, మినపపప్పు, శెనగపప్పు, బియ్యం ఒక్కొక్క గిద్దెడు (అరసోల) తెచ్చి, వేరు, వేరుగా నాన పోయాలి. మూడు గంటలసేపు నాననిచ్చి వేరు, వేరుగా నే, పొట్టుతీసి శుభ్రపరుచాలి. బియ్యం తెల్లగా కడుగవలెను. రోలు, రుబ్బుపత్రం శుభ్రంగా కడిగి ఇవన్నీ పోసి రుబ్బవలెను. మెత్తగా, కాటుకలాగ రుబ్బిన తర్వాత ఈ పిండి వేరే ఒక పాత్రలో పెట్టుకొనవలెను. 10 ఎండు మిరపకాయలు మెత్తగా త్రొక్కి అరగ్లాసుడు నీళ్లు పోసి పలుచటి బట్టలో వడపోయవలెను. ఆనీళ్ళు, పిండికి సరిపడ్డ మెత్తటి వుప్పు పిండిలో కలుపవలెను పిండి గరిటె జారుగా వుండవలెను. కుంపటి వెలిగించి పెనంపెట్టి కాలిన తర్వాత నూనె రాసి గరిటెడు పిండి పెనంమీద పోసి రెండు ప్రక్కలా ఎర్రగా కాలిన తర్వాత తీయవలెను. ఇవి చాలా రుచిగావుంటాయి. వేడి వేడి మీద ఈ దోసెలు తింటె తిన్న వాళ్లకే తెలుస్తాయి వీటి రుచి. చేస్తారుగా?

## శెనగపిండి-దోసె

కావలసిన వస్తువులు:—సోలెడు శెనగ పిండి, వుల్లిపాయలు రెండు, పచ్చిమిరప కాయలు ఎనిమిది, చిన్న అల్లంముక్క శెనగపిండి మనం మిల్లు పట్టించుకుంటే మంచిది. బజారు పిండి అయితే దోసెలు విరిగి పోతాయి. తర్వాత విరిగి పోయినవని అనవద్దు. వుల్లిపాయలు, పచ్చిమిరపకాయలు అల్లంముక్క, కొంచెం వుప్పు మెత్తగా రోట్లో వేసి త్రొక్కవలెను. త్రొక్కిన ఈ ముద్ద, శెనగపిండి గిన్నెలో వేసి నీళ్ళు పోసి గరిటె జారుగా కలుపవలెను. పెనంపెట్టి కాలిన తర్వాత నూనె రాసి గరిటెడు పిండి పోసి పలుచగా చేయవలెను. రెండు వైపులా ఎర్రగా కాలిన తర్వాత తీయవలెను. ఇవి సువాసనతో కమ్మగా వుంటాయి. మధ్యాహ్నం పూట బంధువులువస్తే అరగంటలో పోసెయ్యవచ్చు. చాలా రుచిగా వుంటాయి. బజారు పిండితో మాత్రం పోయవద్దు.

వి. పాప. (కవుతరం.)

## ప్రకృతి ప్రసాదించిన ఔషధాలు. (2)

# ★ ఆముదము ★

దీన్ని ఇంగ్లీషులో కేస్టర్ ఆయిలు అంటారు. శాస్త్రీయ పరిభాషలో కోటన్ టిగ్లియం అంటారు.

సారవంతమైన ప్రదేశంలో 8, 6 గజాల ఎత్తువరకు పెరుగును. చిట్టాముదం, ఆముదము అని రెండురకాలున్నాయి. ఈ రెంటిలోను చిట్టాముదమే శ్రేష్టమైనది. దీన్నే సీమ ఆముదం అనికూడ పిలచుటకద్దు. బజారులో దొరికేది మంచిదైనా మనం స్వంతంగా తయారుచేసుకోవడమే మంచిది.

తయారుచేసుకొనే విధానం : ఆముదపు గింజలను దోరగా వేపి (మాడకూడదు)దుమ్మి, ఒకకుంచెడు గింజలను బిందెడునీళ్ళలోపోసి వెడల్పయినపాత్రలో మరగగాయాలి. కాస్తున్నప్పుడు మంచి కమ్మటి సువాసన వస్తుంది. వాసన చాలా బాగుంటుంది. మరగగాచి పొయ్యిమీదనుండి దింపి చల్లార్చితే ఆముదం పైకి తేలిపోతుంది. తేలింది జాగ్రత్తగా వేరుచేసుకోవాలి.

ఆముదంతో (నూనెకుబదులు) వంటలు కూడచేస్తారు. ఆ వంటకాలు వేడిమీద తింటేనే రుచిగాఉంటాయి. కాలవిరేచనం క్రమంగా అగును. మలబద్ధమును కలుగనీయదు.

ఆముదం విరేచనకారి. వెగటువాసన లేను, చిరుచేదుగావుంటుంది. వాతహారము శ్లేష్మపుపట్టులను వదలిస్తుంది.

శిశువులకు 2 సం||ల వరకూ ఉదయం, సాయంకాలం చనుబాలతో కలిపి పెడతారు. దీన్నే ఉగ్గుఅని పిలుస్తాం. శిశువులకు యిది కూడ ఒకవిధమైన ఆహారమే. ముఖ్యంగా యిది పిల్లల వాతశ్లేష్మములను నివృత్తిచేసి, జఠరదీప్తినిస్తుంది. క్రిములను (నులిపురుగులు, ఏలికపాములను) పుట్టనీయదు. అవి పుట్టినచో చంపివేస్తుంది. జీర్ణకోశాన్ని, మూత్రకోశాన్ని

సంగాని ప్రభావతి, భానుమతి

శుద్ధిపరుస్తుంది. నరములకు సత్తువనిస్తుంది. పిల్లలకు శిరోవాతం చేయవచ్చు జలుబులు, తద్వారాజనించిన దగ్గులు రాకుండ కాపాడుతుంది. శిశువులకుకల్గు లివర్ వ్యాధులు, ఆసాసలు పోగొడుతుంది. (ఆసాస, లివర్ వ్యాధుల్లో మాచిపత్రి వేసి కాచిన ఆముదం వాడతారు.) చంటిపిల్లలకు తరుచుగల్గు పొర్లు లేక ఈడ్పులు మాచిపత్రితో కాచిన ఆముదంపట్టే రావు. శిశువుపుట్టినవెంటనే ఒక చెంచాఆముదం పట్టుట చాలామంచిది. పైన పేర్కొన్న వ్యాధులు రాకుండ చాల కాపుదల చేయును.

చంటిపిల్లల్లో శ్లేష్మం ముదుర్కొని మృత్యువాతబడనున్న తరుణంలో ఆముదంలో అవుజెముడాకురసం కలిపి పట్టిస్తే తక్షణం ఉపశాంతి కలుగుతుంది (ఆకుజెముడాకు రసం తీయునప్పుడు ఆ ఆకును నిప్పుల మీద వెచ్చచూపితే మెత్తబడుతుంది. అప్పుడు నలిపితే రసంవస్తుంది.)

చంటిపిల్లలకు అజీర్ణంచేసి విరేచనంకాక పొట్ట ఉబ్బరించి ఊపిరాడక చాల ప్రమాదస్థితిలోనున్నప్పుడు ఆముదం పొట్టకురాసి అరచేతితో కాస్తే (మన అరచెయ్యికి ఆముదం రాసుకొని నిప్పులమీద వేడిచూపి ఆ చేత్తో పొట్ట కాయాలి) వరాలు వదలి విరేచనంఅయి ప్రమాదం తప్పించును.

ఆముదం చంటిపిల్లల చెవుల్లో పోస్తే యేవిధమైన కర్ణరోగాలు రావు.

మూలశంకల నివారణకు కూడా ఆముదం మంచిది.

తలకురాస్తే చాలా చలువచేసి పిల్లలకి సుఖంగా నిద్రపడుతుంది.

సాధారణంగా శిశువులకు ఉగ్గుపటిన తర్వాత మిగిలినదాన్ని అన్ని అవయవాలకూ రాస్తారు. యిట్లు చేస్తే చర్మం మెత్తబడి చక్కని మృదుత్వమిస్తుంది. నిగనిగలాడుతుంది. చంటిపిల్లలకు అమృతసమానమైనది.

(కచ్చాగాదంచిన కరక్కాయ, పసుపు, దుంపరాష్ట్రం వేసి మరిగించిన ఆముదాన్ని వడబోసి వాడితే, బాలపాపం చిన్నెలు, క్రిమి, అజీర్ణాదిదోషాలు పోతాయి.)

గమనిక : బజారుఆముదం వాడవద్దు. శిశువులకు చిట్టాముదం-స్వంతంగా తయారు

తీసుకొన్నది-యుపయోగించుట మంచిది.

## పెద్దవాళ్ళకి

ఋతువులు మారినపుడు ప్రకృతి, వాతావరణము మారుచుండును. ఆయా మార్పులచే మన శరీరతత్వం మారుటకవకాశం కలుగుచున్నది. ఆ సమయంలో కొన్ని వ్యాధులు తప్పక వచ్చుటకవకాశం కలుగుచున్నది. అప్పుడు ఆముదం, శొంఠి, అల్లపు రసం కలిపి తగుమోతాదులో తీసుకున్నచో జీర్ణకోశం శుభ్రపడి ఆరోగ్యాన్ని కాపాడుకొనుట కవకాశం కల్గును. అడపాతడపా యిలా తీసుకొనుట వల్ల ఏ వ్యాధులూ సామాన్యంగా సోకవు. శ్లేష్మపట్టుచే కల్గు గుండెనొప్పి, ఊపిరితిత్తుల నొప్పులు, రెక్కగూళ్ళయందు నొప్పి గర్భవాతశూలలు, పోగొట్టును. స్త్రీల ఋతువును క్రమబరచును.

ముఖ్య గమనిక : ఆముదము నుపయోగించువారు ఆహారంలో చాల జాగ్రత్త వహించాలి (ఆముదం తీసుకున్న రోజునే) ఆరోజు చలువచేసే పదార్థాలు వాడరాదు, చన్నీళ్లు త్రాగరాదు. కాచి చల్లార్చిననీళ్లే యుపయోగించాలి. స్నానం చేయరాదు. లేనిచో వాతము క్రమ్మి అపాయం కల్గించవచ్చును.

పులపరంగావుండి జ్వరం తగిలినప్పుడు, క్షయ మూచికం వున్నప్పుడు—మసూచి రోజుల్లోను-అతిసారరోగులు, పిచ్చివాళ్లకి, అపస్మారకులకు, రక్తపిత్తం గలవారికి ఆముదం యివ్వరాదు. వర్షంపడుచున్న రోజున, వర్షాకాలంలోను ఆముదం తీసుకోరాదు.

## ఇతర ఉపయోగాలు

చెవిపోటుకు - ఆముదంలో వెల్లుల్లిపాయ చిదుగగొట్టివేసి కాచిన ఆముదాన్ని చెవిపోటువున్న చెవిలోపోస్తే యెటువంటి చెవిపోటైనా వెంటనే తగ్గిపోతుంది. చెవికురుపును మాన్పును.

### చితుకని సెగ్గడ్డలకు

ఆముదం, పిడక కచ్చిక (పిడకను కాల్చగా వచ్చినది) కలిపి సెగ్గడ్డమీద దట్టముగా అంటిస్తే కురుపు మెత్తబడిపోయి పగులును.

### మేహవాత నొప్పులకు

స్వచ్ఛమైన చిట్టాముదంతో మర్దనాచేసి వేడినీళ్ళ కాపడంపెట్టే తగ్గుతవి.

### కండ్లు, అరికాళ్ళ మంటలకు

చిట్టాముదం పాదాలకు, అరికాళ్ళకు మర్దనాచేస్తే కండ్లమంటలు, అరికాళ్ళ మంటలు తగ్గిపోతవి.

### కండ్లు యెరుపెక్కిన

ఆముదం శిరస్సునకు మర్దనాచేస్తే మిక్కిలి చలువచేసి కండ్ల యెరుపులు తగ్గును.

### గజ్జి కురుపులకు

ఆముదం, కెంపుకుంకుమ కలిపి గజ్జికురుపులపైనరాస్తే త్వరగాచితికి, మానిపోతాయి.

### చర్మానికి

స్నానం చేసేముందు చర్మానికిరాసి, మర్దనాచేస్తే చాలాగుణాలున్నాయి. చర్మవ్యాధుల్ని రాకుండా కాపాడుతుంది. చర్మం మందుట, పెళుసగుట వుండదు.

### ఉబ్బస రోగులకు

ఆముదంతో వండిన ఆహారపదార్థాల్ని వాడితే ఉబ్బసరోగులకు మంచి వుపశాంతి కల్గించును.

దీన్ని అనేక ఆయుర్వేదమందుల్లో వాడతారు.

హోమియోపతిలో ఆముదము (రిసినిసు) అనేక తరుణవ్యాధుల్లో ముఖ్యంగా కలరా రోగుల నెంతమందిని కాపాడిందో ఆవైద్య గ్రంథాలే చాటుతున్నాయి. ★

# ★ అక్షరాల హవాయిస్ ★

ఈరోజుల్లో—మగపిల్లలకూడా ప్రింటెడ్ షర్టూ, ప్రింటెడ్ హవాయిలా ఎక్కువ ఫేషన్ అయిపోయాయి. మొగవాళ్ళు పెద్దవాళ్ళు వేసుకుంటే అదో మాదిరిగా ఉంటాయిగానీ, పిల్లలు మాత్రం వేసుకుంటే ముచ్చటగా ముద్దొస్తూ ఉంటారు. మామూలు రంగులవో, తెల్లనివో బట్టల్లోకన్నా, మొగపిల్లలు ప్రింటెడ్



హవాయిస్‌లో, బుష్ షర్టులో వేస్కుంటే మురగ్గా, చలాకీగా కన్పిస్తారు. కళ్ళు చెదరగొట్టే రంగులవో లేక ఆకర్షణీయంగా బొమ్మలవో, ఏవైనా పిల్లలికి చాలా బాగా రాణిస్తాయి. ఆడపిల్లల గౌనులమల్లే పువ్వులుకుట్టేమాత్రం వట్టి గౌనల్లే కన్పిస్తుంది. కానీ పువ్వులకుబదులుగా ప్రింటెడ్ షర్టులా, అక్షరాలు కుట్టుకుంటే చాలా అందంగా ఉంటుంది. ఈ అక్షరాలు కూడా వరుసగా, ఓ తీరూ తెన్నూ, ఒకరంగుతో కుట్టుకుంటే చాలా అసహ్యంగా ఉంటుంది. ఐదారు రంగుదారాలు వాడి, అక్షరాలన్నీ చెల్లా చెదురుగా, ఓ వరుసా వావి లేకుండా అన్నీ వేరు వేరు కోణాలలో కుట్టుకుంటే జుబ్బా చాలా ఆకర్షవంతంగా తయారౌతుంది. తెల్లనిదో, లేత రంగుదో, బుష్ షర్టైనా హవాయిసైనా, జుబ్బా అయినా టెయిలర్ చేత కుట్టించి దానిమీద అక్షరాలు మనం కుట్టుకోవచ్చు. వర్డ్ బిల్డింగ్ ఆటలో అక్షరాల్లా ఒక్కొక్క చదరంలో ఒక్కొక్క అక్షరం చొప్పున కుట్టే ఉత్తి అక్షరాలు కుట్టినకన్నా బాగుంటాయి. ఓ ఇంచి చదరంలో అట్టను కత్తిరించి, అట్ట చుట్టూరా, పెన్సిల్‌తో బట్టమీద చదరాలు వేసి, ఆ చదరాల్లో కుదురుగా పెద్ద అక్షరాలు వ్రాసి, ఒక్కొక్క చదరం ఒక్కొక్క రంగులో ఐదారు రంగుదారాల్తో కుట్టుకోవాలి. రెండు ప్రక్కలా సమానంగా రాకుండా, కొన్ని అక్షరాలు ఓ దాని మీదొకటీ, సగం అక్షరాల్లాగా, కుట్టుకుంటేనే బాగుంటుంది. వీలైనంత వరకూ ఏ పదాల్నీ వాడకుండా ఉంటేనే మంచిది.

ముఖ్యంగా బుడుగులాంటి చిన్న పిల్లలకి అక్షరాభ్యాసంనాడో, బళ్ళోవేసేటప్పుడో ఈ జుబ్బా తొడుగుతే చూట్టానికి చాలా ముచ్చటగా ఉంటారు! ★

మామిడన్న ప్రభావతి.

# ★ ఉత్తరాలు ★

స్త్రీలు-రైలు ప్రయాణాలు అనే వ్యాసం ...అవగింజంతైనా అతిశయోక్తిలేదు. రైలు ప్రయాణాలప్పుడు స్త్రీలుపడే బాధ అంతా ఇంతా కాదు. సామాను జాగ్రత్తగా చూసుకుంటూ, కిటికీదగ్గర కూచున్న కుర్రాడు ...మ్మా కంట్లో బొగ్గునలుసు పడింది ఊదవే ...వాడి నలుసు ఊదేసి పాలకోసం ఏడ్చే ...ంటివాడ్ని సముదాయిస్తూ ప్రయాణం ...స్తున్న స్త్రీలబాధ వర్ణించతరంగాదు. పైగా పక్కన కూర్చున్నామె (కొందరు కాలు ...రుగా) చుటపొగ ముక్కుల్లోకి కొట్టి ...క్కిరిబిక్కిరై పోతుంటే ఈ ప్రక్కన ...వ్వావిడి కాస్త జరగవమ్మా పిల్లాడిని ...ళ్ళో కూర్చోబెట్టుకోమని గద్దిస్తుంది. ...న్ని బాధలు ఈవిడ పడుతుంటే భర్తమాత్రం ...ప్పుడప్పుడు దిగివచ్చి జాగ్రత్త కాఫీ ...మున్నా కావాలా? అని అడిగేసి వెళ్తుం...డు. పోనీ ఫస్టుక్లాసు సెకండుక్లాసుల్లో ...పయాణం చేద్దామంటే తగిన ఆర్థికస్థోమత ...ుండాలి. డబ్బువున్నా, ఒంటరిగా ప్రయాణంచేయడం శ్రేయస్కరం కాదు. కాబట్టి ...ంటిగా వెళ్ళే స్త్రీలకు మూడవతరగతే ...రణ్యం.

పెళ్ళికాని కన్యలు మూడవతరగతిలో ప్రయాణంచేసేటప్పటికి వాళ్ళ ప్రాణం సగం చచ్చి ఊరుకుంటుంది. చుట్టూవుండే వారి వాడిచూపులనుంచి, పొరపాటన ...కుతో కాళ్ళుతొక్కుతూ పోయేవారి నుండి రక్షించుకొని బయటపడేసరికి ఆ అమ్మాయిప్రాణం పోతుంది. చేపలవాళ్ళు చేపలగంపలతో సహా ఎక్కుతారు. ఎంత చేపలు తినేవారికి కూడా ఆ వాసన భరింపరానిదిగా వుంటుంది. పొరపాటున వాకిలిదగ్గరగాని కూర్చున్నామో యిక మూసుకోండి ఎక్కేవారు, దిగేవారిదగ్గర తోపులు తోయించుకోవాల్సి వస్తుంది. సరే ఇన్నిబాధలు పడుతున్నా ఓర్చుకోవాలి మరి. ఒకరకం మనుష్యులుంటారు వాళ్లు రైలు కదిలేదే తొందర హాయిగా నిద్రలో పడిపోతారు. పగటి ప్రయాణమైనా సరే నిద్రాదేవత ఒడిలో పడిపోతారు. వాళ్ళు నిద్రపోతే పోయారు గానీ ప్రక్కన కూర్చున్న ఆవిడ నిద్రపోయే ఆమెగారి తల మోయలేక అల్లాడుతుంది. భుజంమీద నిద్రిస్తున్నామెతల, ఒళ్ళో పిల్లాడు, ఈ తొడపైన యింకోబిడ్డ, కాళ్ల దగ్గర మునివ్రేళ్లను నొక్కేస్తున్న సామానులు, ధారాపాతంగా కారే చెమట యిక ఆ యిల్లాలికి త్రిశంకుస్వర్గము కన్పిస్తుంది. ఇవన్నీ భరించినా సినిమాపాటలు, బైరాగి తత్వాలు చిల్లులు పడేలాగ వినిపిస్తుంటాయి. మరి సుఖంగా ప్రయాణంచేయడానికి మార్గమేమిటో. సుఖంగా ప్రయాణంచేయడం మాట అటువుంచి తగాదాలు, జగడాలు రాకుండా బయటపడితే అదేపదివేలు. శ్యామలాదేవిగారు చెప్పినట్లు స్టేషన్సులో మూడవతరగతి ప్రయాణీకులకోసం వెయిటింగ్ రూమ్సు వుంటే స్త్రీలకు హాయిగా వుంటుంది. రైలు ప్రయాణాలలో అవస్థలు ఎవరికివారు అనుభవించాల్సిందే గానీ ఎంత చెప్పినా తరగదు.

* * *

## సులభమార్గం

కాగోపట్టీస్ సులభంగాచేసే మరొకపద్ధతి చెపుతాను. మధ్యాహ్నం టిఫెనుకు తినాలనుకుంటే భోజనాలు కాగానే కొంచెం సగుబియ్యాన్ని కొద్దిగా పెరుగులో నానవేసుకోవాలి. ఓ రెండుగంటలసేపు నాననిచ్చిన తర్వాత దానిలో కొద్దిగా వుప్పు, సన్నగాతరిగిన పచ్చిమిరపకాయలు, వుల్లిపాయలు, అల్లంముక్కలు వేసుకోవాలి. ఇంకా కావాలనుకునేవారు సన్నని కొబ్బరి ముక్కలు (పచ్చికొబ్బరి) వేసుకోవచ్చు. కొద్దిగా మైదాపిండి లేక గోధుమపిండి వేసి అంతా బాగా పిసకాలి. పొయ్యిమీద బూర్ల మూకుడు పెట్టుకోని నూనె లేక నెయ్యి పోసి బాగా కాగనివ్వాలి. బాగా కాగిన నూనెలో ఈ పిసికిన ముద్దనుంచి కొద్దిగా మనకిష్టమున్న విధంగా అంటే గుండ్రంగానో లేక చిన్న వడలమాదిరిగానో వేసి బాగా ఎర్రగా కాలనిచ్చి తీసి వేయాలి. మధ్యాహ్నం టిఫెనుకు యివి బాగా కరకరలాడుతూ తినేందుకు రుచిగావుంటాయి. అట్టే శ్రమలేకుండా త్వరగా చేసుకోవచ్చు.

పి. అనసూయ (నెల్లూరు.)

* * *

## రైళ్లలో రద్దీ తగ్గిస్తే చాలు....

ఆంధ్ర వారపత్రిక (26-6-57)లో వనితాలోకం శీర్షిక క్రింద శ్రీమతి శ్యామలాదేవిగారు వ్రాసిన స్త్రీలు-రైలు ప్రయాణాలు అన్న వ్యాసం చదివినాను. వారు వ్రాసిన వ్యాసంలో ప్రయాణికులకు అందులో స్త్రీలకు పరిమైన వసువాయములు లేనికూలమున చాలా అవస్థలు పడుతుంటారని వ్రాశారు. ఆ ప్రయాణికుల్లో ఒక్క స్త్రీలే కాదు. పురుషుల్ని కూడ చేర్చవచ్చు.

ఇంతకూ నే చెప్పునదేమన, ప్రతి ప్రయాణికునకు కూర్చుండుటకు స్థలముంటే చాలును. ఎయిర్ కండీషన్డ్ పెట్టెలువద్దు. పెద్దపెద్ద రైలుస్టేషన్లు నిర్మించేందుకన్నా ఎక్కువ రైళ్ళు వడిపితే బాగుంటుంది. ఎయిర్ కండీషన్డు రైళ్ళకు ఖర్చుపెట్టే ధనం రద్దీ తగ్గించడానికి కొంతైనా ఉపయోగపడుతుంది. అదే పదివేలు.

యస్. నరసింహాం, (గుంతచీపాడు.)

## మరో పద్ధతి

19-6-57 సంచికలో, వుత్తరాల శీర్షిక క్రింద నూత్నంలో మోతుం అని గోధుమలు, పెసళ్ళు సమపాళ్లల్లో కలిపి ఒక రోజంతా నానబెట్టి శుభ్రంగా కడిగి ఉదయం, రాత్రి తినవలెనని వ్రాశారు. అది పచ్చిగానే తినవలెనా లేక వండి తినవలెనంటే ఏ విధంగా తయారుచేసి తినవలెనో వివరాలేవీ వ్రాయలేదు. ఆమె ఈ విషయం ప్రతికాముఖంగా తెలియబరుస్తే బాగుండును. శరీరం తరగడానికి ఇంకొకటి మరీ సూక్ష్మమైంది ఏమిటంటే క్రితం రాత్రి నీళ్ళు ఒక గ్లాసెడులో రెండు టీస్పూన్లు తేనె కలిపి ప్రతిదినంవుదయంపరగడుపున త్రాగితేపరిరక్తశుద్ధికలుగుతుంది అనవసరపుశరీరంతగ్గుతుంది.

ముత్యాలగీతాదేవి, (హైదరాబాద్)

(నానబెట్టినవాటిని తిరిగి ఉడకబెట్టడం అనవసరం పచ్చివే తినాలి.)

## అద్దె ఇళ్ళు


ది 12-6-57 ఆంధ్ర వారపత్రికలో "అద్దెకొంపలు-అగచాట్లు" అను ఎం. లక్ష్మిగారు వ్రాసిన వ్యాసము చదివాను. అద్దెకొంపలలో ఉన్నవారి అగచాట్లు లక్ష్మిగారు చాలా బాగా వివరించారు. అద్దెకున్నవారు మంచి వస్త్రములు ధరించినను, సుఖముగా వున్నను సహించలేనివారుగూడా యున్నారు. ఒకరికొకరు పోట్లాటలు పెట్టువారుకూడ గలరు. ఇటువంటి యింటి యజమానుల బుద్ధి మార్చుటకు నివారణోపాయమేమో తెలియుటలేదు.

కె. రజని (తెనాలి)

"వనితాలోకంలో "ఉత్తరాలు" అన్న శీర్షిక చదువరులకు ఎంతైనా సహాయకారి అనడానికి సందేహంలేదు. క్రొత్తవ్యాసాలలో పాఠకులను ప్రోత్సాహపరుస్తారని రచయిత్రులకు మనవి

కోరిమిల్లి వీరభద్రరావు(అనకాపల్లి)

★




# స్వభావం

ఏటిగట్టున నక్క ఒక్కటి
ఎండ్రకాయలు వెదకవొచ్చెను.
ఎంత వెదకిన ఫలితమేమీ
ఇంచుకైనను లేకపోయెను!

ఏటికివతల ఒట్టి బాటియలె
ఏటికవతల చూతమన్ననుః—
ఏఱుదాటుట తనకు తరమా?
పాఱుచున్నది ఏరునిండుగ!

ఓర్వజాలని ఆకలికి తా
వగచుచుండగ-అంతలోనే
ఒంటెబావటువైపుగానే
వెళ్లుచుండుట గాంచె నక్క

నక్క జిత్తులు నక్కకే తగు
నిలువరించెను ఒంటె నక్కడ:
"ఆగవయ్యా ఒంటెబావా!
మంచిమాటొకటుంది వినవా?

ఏటికవతల చెఱకుతోటొక
టున్నదదిగో-ఎఱుగవా?
పోదమచటికి రమ్ము త్వరగా
పొట్టనింపుక తిరిగివత్తము."

వెంటనే నోరూర ఒంటెకు
ఏటిలోపడి ఈదసాగెను
ఎక్కి కూర్చుని ఒంటెవీపున
నక్క ఆవలిగట్టు చేరెను.

"సదానంద"

తోటలో దూరినది ఒంటె
ధ్వంసమాయెను పైరు క్షణమున
నక్కమాత్రము ఏటిగట్టున
మెక్కసాగెను ఎండ్రకాయలు.

కడుపు నిండిన నక్కగట్టిగ
కూతపెట్టిన దంతలోనే
పొలముకాపరుదెంచి ఒంటెను
పట్టిబాదెను చిత్తుగా!

ఒంటె నక్కను తూలనాడను
వెకిలిగా నగి నక్క యిట్లనె
"కూతపెట్టుట నా స్వభావము
కాన తప్పేమున్నదయ్యా!"

మరల ఏటిని దాటునప్పుడు
మధ్యకొచ్చిన ఒంటె వెంటనె
"నీటమునుగుట నా స్వభావము"
అనుచు మునిగెను ఏటిలోపల!

'వీపునెక్కిన నేస్తగాడటు
ఉప్పెనకు బలి ఆయెనే!'
తనకు తానే నవ్వుకొని వే
తరలిపోయెను ఒంటె తిన్నగ.

# తియ్యని కథ

మా తాతయ్య ఆమధ్య మల్లవరం పర్యటన కెళ్ళాడు! ఆవేళే తిరిగొచ్చాడు! తాతయ్య రాగానే మేమందరం చుట్టూ మూగాం. "కూర్చోండిరా. కథ చెబుతాను" అన్నాడు తాతయ్య. మా బాబిగాడితో సహా అంతా కూర్చున్నాం.

"ఒకరోజున బెల్లమ్ముక్క రాజబాటపక్కగా దిగాలుగా విచారంతో కూచొని ఉంది. లోకసంచారి నారదమహాముని ఆ దారిన కైలాసానికి పోతూ "ఏం! బెల్లమ్ముక్కా! ఈవేళ ఇంత దిగాలుగా కూర్చున్నావు?" అన్నాడు.

"నారదమహామునీంద్రా! ఏమని చెప్పను? నా బాధ! ఎవరుచూస్తే వారు నన్ను తినేయడమే! నేనిక నిలవలేను" అంది.

అంతట నారదమునీంద్రులు "బెల్లమ్ముక్కా! ఇంత దిగాలుపడతా వెందుకు? కైలాసంలో ఉన్న ఈశ్వరుడికి, పోయి విన్నవించుకొంటే, నీ బాధ తీర్చగలడు" అన్నాడు.

కైలాసంలో తపస్సుచేసుకొంటున్న ఈశ్వరుడిదగ్గరికి బయలుదేరింది బెల్లమ్ముక్క. గాఢతపస్సులో మునిగిఉన్నాడు ఈశ్వరుడు. దివ్యదృష్టివలన బెల్లమ్ముక్కని చూచి కళ్లు తెరిచాడు, ఈశ్వరుడు అల్లంతదూరాన ఉండగానే! బెల్లమ్ముక్క దగ్గరకెళ్లి ఇలా ప్రారంభించింది మొర. "నన్ను..." అందో, లేదో "వెళ్లు, వెళ్లు! చాల్లే నీమొర నాతో కాదు! నిన్ను సృష్టించిన బ్రహ్మదేవుడితో చెప్పుకో! పో!" అన్నాడు కైలాసేశ్వర భగవానుడు.

**డి. రాజారామమోహనరావు**

బెల్లమ్ముక్క బ్రహ్మదగ్గరకు వెళుతూండగా దారిలో శ్రీ కృష్ణభగవానుడు కనిపించి బెల్లమ్ముక్కని పిలిచాడు. ముక్క తనమొర అతనితో చెప్పుకొందామని వెళ్లింది. శ్రీకృష్ణుడు దాన్ని తినడానికి తీసుకొన్నాడు! అంతలో బెల్లం గబగబా పరుగెట్టింది! బ్రహ్మను జేరి ప్రారంభించింది మొర!

"ఓ బ్రహ్మ! నన్ను ఎందుకు సృష్టించావయ్యా! నా బ్రతుకెలాటిదో కాని ఎవరుచూస్తే వాళ్ళే కొరుక్కు తినేస్తున్నారు! చీమలు ఇప్పుడు, అప్పుడు అనక ఎపుడుపడితే అపుడే వేళాపాళా లేకుండా నన్ను కొరుక్కుతింటున్నాయి! ఈగలు నన్ను నివాసంగా చేసుకొంటున్నాయి! ఇక మనుషులు! పాపిష్టివాళ్లు! కనబడిందే తడవుగా తినేస్తున్నారు. నాకేదైనా ఉపాయం చెప్పవయ్యా" అని వేడుకొంది దీనంగా!

బ్రహ్మదేముడు అంతా విని "తొలగిపో, తొలగిపో! వేగం వేగం! నిన్ను చూస్తే......నాకూ తినేయాలని ఉంది! ఊ వెళ్లిపో! త్వరగా"

# కుక్క కాటుకే...

అరేబియాలో ఒక వర్తకుడుండే వాడు. అతడు చాలా ధనవంతుడు. ఆతడు కలవాడైనా నిరాడంబరిగా నిగర్విగా చెలామణి అయ్యే వాడు. బుద్ధికుశలుడైన ఆ వర్తకుని వద్ద ఎందరో సేవకులుండేవారు. నౌకర్లుకూడ ఆయనయెడల భక్తి ప్రపత్తులతో సంచరించెడివారు. అతనికి జంతువులభాష, పక్షిభాషలు గూడ తెలిసియుండుట ఆయనలో గల మరియొక విశేషము. కానీ అతని కాభాషలు తెలిసినట్లు మరియొకరికి తెలిసినా, ఎవరికైనా దానిని గురించి ఎరుకపరచినా తలపగిలి చచ్చుననే శాపంవుంది. స్వతహాగా చాలా మంచివాడైనందున అతడు ఎప్పుడూ ఆ నియమానికి కట్టుబడే వుండేవాడు. జంతువులు, పక్షులు మాట్లాడుకున్నప్పుడు విషయాలన్నీ తెలుసుకుని కూడ ఆతడు మిన్నకుండేవాడు.

ఆ వర్తకునిపేరు తుషార్ ఝూంకీ. ఝూంకీకొక గాడిద ఒక ఎద్దు కూడ వుండేవి. గాడిద బరువులు మోసేది. పొలము దున్నుటకుగాను మరియొక ఎద్దును అతడు ఖరీదుచేసెను. అది బాగా తిని బలిసివున్నందున కొంచెము ఎక్కువఖరీదుకే కొన్నాడు. గాడిదచేత బరువులూ అవీ మోయించుకునేవారు. మొత్తం మీద వాని ఉమ్మడి అవసరం ఆయనకున్నది.

రావిళ్ళ కృష్ణారావు

రోజూ ఎద్దులను పొలానికి తోలుకెళ్లేవారు దున్నుటకు. గాడిదకు మాత్రం యీ మోతపని ఎప్పుడో గాని తగిలెడిదికాదు! అది యింటి వద్దనేవుండి బాగా కసవు తింటూండేది. ఒకనాడు పొలం వెళ్లివచ్చిన ఎద్దు మాటవరసకు గాడిదతో తన గోడుచెప్పుకుంది. "ఏముంది బావా! అస్తమానూ తెక్కలు ముక్కలయ్యేలాగున పనిచేస్తాను. సాయంత్రానికింటికి తోలుకొచ్చి యింత గడ్డో-చొప్పో మా ముఖాన వేస్తారు. నీకేం హాయిగా కోరినగడ్డి తింటూ యింటికాడ వుండి ఎన్ని కబుర్లయినా చెబుతావు. ఏడాది కేదు ప్రయాణాలైనా రావు నీకు. నీకేం మహారాజువు," అని అన్నది.

ఆ గాడిద జాలిగుండె కలది. నిజంగా దాని కాక్షణాన ఎద్దుపై ఎక్కడలేని జాలి పుట్టుకొచ్చింది. ఏవిధంగానైనా ఎద్దుకు శ్రమ తప్పించాలనుకున్నది. కానీ పైకిమాత్రం "మరి నన్నేం చెయ్యమంటావు?" అంది గాడిద.

"నీకేం హాయిగా వుంటున్నావు. నాగురించి నీవేం సాయపడగలవు కనక! నీ కాలోచించే తీరిక......"

"......అబ్బే అలా కోప్పడకు బావా! నాకు తీరికలేదా? అస్తమానూ నేనూ అదే ఆలోచిస్తుంటాను. కానీ ఒక్క ఆలోచనా బుర్రకు తట్టందే. కానీ బావగారూ! సాధనమున పనులు సమకూరు ధరలోన! అన్నమాట ననుసరించి యీనాటికి నాకు ఒక వుపాయం

## తియ్యని కథ

అన్నాడు బ్రహ్మ గద్గదస్వరంతో!

బెల్లముక్క బ్రహ్మదేవుడిక ఆ మాటలతో తినేస్తాడేమోనని భయపడి గబగబా భూలోకాని కొచ్చేసింది! బ్రహ్మదేవుడు తినేస్తే బెల్లముక్క లేకపోను మనకు" అని ముగించాడు తాతయ్య!

కథంతా వినేసి మా బాబిగాడు, అమ్మదగ్గరికెళ్ళి "అమ్మా... బెల్లం.. ముక్కా!" అని మారాం చేస్తున్నాడు. అమ్మ అందరికీ బెల్లముక్కలుపెట్టింది! బెల్లంపుణ్యమా అని కథ తియ్యతియ్యగా ముగిసింది!

★

## కుక్క—కాటుకి....

తోచింది. పాపం! నీవు నిజంగా పని చేసీచేసి చిక్కి శల్యమైనావు. ఆబలం—ఆ శివి అన్నీ కొరవడినాయి నీలో. నిజంగా నిన్ను చూస్తే నాకు జాలేస్తోంది. నా ఆలోచన నాచరణలో పెడితే నీవు మునపటికిమల్లే బాగా బలిసిపోతావు" అంది. దాని మాటలు విన్న ఎద్దు ఉబ్బితబ్బిబ్బై "తొందరగా ఆకిటుకు చెప్పవోయ్" అంది.

గార్ధభ నేస్తం మందహాసంచేసి "అయితే వినుమరి. నీకు యిప్పుడు గడ్డివేస్తారు—గడ్డి తినకు! నీళ్లు పెడతారు—తాగవద్దు. మందు పెడతారు—" అని ఆందోళనగానే అడిగింది ఎద్దు.

"ఆఁ ఏమీలేదు. నిన్నిట్లా పూరికే పనిలేక మేపటం నిరర్థకమని తోచింది మన యజమానికి. యిలా తిండి దండుగ చేసేబదులు నిన్ను కోత కమ్మేస్తానన్నాడు. అలాగైనా కొంత డబ్బు వస్తుందని" యీ మాటలు విని ఎద్దు నిలువునా నీరైపోయింది. కుప్పలా కూలిపోయి 'తరుణోపాయమేమిటని' సలహా అడిగింది గాడిదను.

"ఏముంది. ఇకనుంచి నీవు ఒక్క రోజుకూడ నాగాలేకుండా పనిచేస్తే బ్రతుకుతావు. లేదా కోత కమ్మేస్తారు కసాయివాడికి." "బ్రతికుంటే బలుసాకయినా తినొచ్చు — అంతే చాలు-ఇకనుంచీ చాలా హుషారుగా పని చేస్తానని" శపథంచేసింది ఎద్దు.

చాటుమాటున ఉన్న సేటు ఇదంతా ఆలకించాడు. 'కుక్క కాటుకు చెప్పు దెబ్బ' గాడిద కిప్పటికిగాని బుద్ధి వచ్చింది కాదు!! అనుకొంటూ వసారాలోకి వెళ్లిపోయాడు. ఆనాటి నుంచీ ఎద్దు ఏనాడూ పనిచేయకుండా వుండలేదు. అంతే. ★

# వెర్రి గోల

## పి. సుబ్బారావు శాస్త్రి

నల్లన్నకినాఅన్న వాళ్లెవ్వరూ లేరు.

దిక్కులేని నల్లన్నని ఓ విద్వాంసుడు పెంచి పెద్దవాణ్ని చేశాడు.

నల్లన్న వట్టి వెఱ్ఱిబాగులవాడు వాడికి మంచీ-చెడ్డా ఏదీ తెలీదు! ఎవరేదిచెబితే అది నిజమేనని నమ్మేవాడు. నల్లన్న ఎనిమిదేళ్లనాడు, విద్వాంసుడి ఇంటికి వచ్చాడు. అప్పట్నుంచీ.. ఇప్పటి వరకూ ఆ యింటోనే వుండి, ఆ యింటివాళ్లు చెప్పేపనులు చేస్తూ, వాళ్లు నాలుగు మెతుకులు పడేస్తే...తిని, ఇంతవాడయ్యాడు.

నల్లన్నకి చిన్నప్పట్నుంచీ... సంగీతం నేర్చుకోవాలన్న ఉత్సాహం ఉండేది కానీ.. భగవంతుడు నల్లన్నకి చక్కని గొంతయినా యిచ్చేడుకాదు! నల్లన్నది పతిగార్ధభస్వరం! అయినా, అడపా తడపా విన్న ప్రతీముక్కని, రాగం తీసి పాడుతూ ఉండేవాడు నల్లన్న! అలా కూనిరాగాలుతీస్తూ . . బండ చాకిరీ చేసేవాడు పాపం!

వయస్సుతీరిన విద్వాంసుడు, ఓనాడు కన్నుమూశాడు. విద్వాంసుడు చచ్చిపోవడంతోనే కొడుకులూ, కోడళ్ళూ అధికారంలోకి వచ్చేరు. వాళ్ళందరూ కలిసి, 'వట్టి తిండి దండగ'అని, నల్లన్నని తరిమేశారు.

నల్లన్న ఉత్త అమాయకుడు. చివరికి ముష్టిఎత్తుకోడం కూడా రాని మనిషి. ఫలానాపని చెయ్యమని చెబితే చెయ్యగలడేకాని, స్వతహాగా యేదీచేతగాడు!

కొందరు నల్లన్నని పిలిచి, రాజుగారిదగ్గరకు వెళ్ళమనీ ... ఆయన పాటలు పాడితే, తిండి పెడతాడనీ చెప్పారు. నల్లన్న 'సరే' అని, రాజుగారిదగ్గరకు బయలుదేరాడు.

దోవలో నల్లన్నకి ఓ గొఱ్ఱెల కాపరి కనిపించాడు. ఆ గొఱ్ఱెల కాపరి ఓ ధనవంతుడనీ, అందుకనే అన్నిగొఱ్ఱెలు న్నాయని అనుకున్నాడు నల్లన్న.

"ఈ ధనవంతుడికి రెండుపాటలు పాడి వినిపిస్తే ... ఇవాళ తిండిపెడతాడు. రేపు రాజుగారిదగ్గరకు వెళ్ళవచ్చు!" అని, నల్లన్న గొఱ్ఱెల కాపరి దగ్గరకువచ్చి పాటపాడటం మొదలెట్టాడు.

నల్లన్న పాటవిని 'నక్కలు' వస్తున్నాయేమోనని కొన్నిగొఱ్ఱెలు పారిపోయాయి! గొఱ్ఱెలకాపరి పాటవింటూ ఏడవనారంభించాడు!

"ఆహా...! నాపాట, యీ 'ధనవంతుడి' హృదయాన్ని కరిగించే

సిందికదా! ఇంకా బాగాపాడతాను!" అనుకుంటూ, మురిసిపోతూ నల్లన్న యింకా గట్టిగా పాడసాగాడు! దాంతో గొర్రెలకాపరి పాటకంటే బిగ్గరగా ఏడవటం మొదలెట్టాడు.

"అయ్యా, గొప్పవారూ! నాపాట అంత బావుందా? ... మీ హృదయాన్ని... కరిగించేసిందా!?... అందుకేనా.. అలా ఏడుస్తున్నారు?" అని అడిగాడు నల్లన్న, గొర్రెలకాపరిని.

"ఇదిగో... తమ్ముడూ! మనిషివి చూస్తే... బాగానే ఉన్నావ్! కానీ, నువ్వెందుకు అరుస్తున్నావో తెలిసిందిగాదు! అందుకని ఏడుస్తున్నా!" అన్నాడు గొర్రెలకాపరి కళ్లుతుడుచుకొని—

"ఏం బాగయ్యా! తిండీ తిప్పలూ లేక ఛస్తూంటే...! నువ్వేదో గొప్పవాడివనుకుంటే అర్థంలేని 'ఏడుపు' ఏడుస్తున్నావా?..." అని అడిగాడు నల్లన్న.

"నాది అర్థంలేని ఏడుపని ఎవరన్నారయ్యా?... నా ఏడుపుకి అర్థం ఉంది తెలుసా?... ఈ మధ్య ఏం జరిగిందంటే—నా మందలో ఉండే గొర్రె అచ్చం నీలాగే రాగాలు పెట్టీ... పెట్టి ... అరచీ ... అరచీ ... ఏడ్చి.. ఏడ్చి ... చివరకు చచ్చింది! నువ్వూ అలాగే చస్తావేమో... అనీ, నీకు రోజులు మూడేయ్ ... అనీ, నువ్వు ఛస్తే... ఎవరు కూస్తారా... అని ఏడుస్తున్నా!" అన్నాడు గొర్రెలకాపరి!

"అయ్యో!... వెర్రివాడా...! నువ్వేదో.. గొప్పాడివనుకున్నానే!!" అంటూ, అక్కణ్నుంచి గబగబా వెళ్లిపోయాడు నల్లన్న!

"వెర్రివాడు!... హి... హీః" అని నవ్వుకున్నాడు గొర్రెల కాపరి!! ★

# సినిమా

# (ఉభయ) తారకమంత్రం

"బాక్సాఫీస్ ఫార్ములా" లో కీలకం ఏమిటి? నిజంగా ఇలాంటి సూత్రం ఉందా? దాని స్వరూపస్వభావాలు ఎలాంటివి అని ఒక ప్రముఖ దర్శక నిర్మాత ఇటీవల సుదీర్ఘమైన చర్చ జరిపారు

ఆ తారకమంత్రం కోసం అనాదిగా ప్రపంచవ్యాప్తంగా అన్వేషణ జరుగుతూనే ఉంది ఈయన కూడా ఒక్కొక్క సూత్రాన్ని తూచి, కుడి ఎడమలు పరిశీలించి తీసిపారేస్తూ వచ్చారు అన్ని బాక్సాఫీస్ సూత్రాలూ మంచివే అనడానికి ఉదాహరణలున్నాయి. అలాగే వాటిలో ఏ ఒకటీ పనికిరాదనడానికికూడా నిదర్శనాలున్నాయి

చివరికి "బాక్సాఫీస్ సూత్రాలు, లేక తారకమంత్రము అనేది ఏమీ లేదు నిజమైన తారకమంత్రం ఆయా కళాకారుల చిత్తశుద్ధి ఒకటే" అని ఆ దర్శక నిర్మాత స్పష్టం చేశారు

సినిమా అనేది కేవలం కళా కాదు, బొత్తిగా డబ్బుమాత్రమే అనారాదు. ఇది మిశ్రమ పరిశ్రమ రెండూ సమానమే ఎటొచ్చి, ఈమిశ్రమంలో రెండోది అనగా డబ్బు కొంచెం 'ఎక్కువ సమానం' ఎందుకంటె పెట్టిన డబ్బు పదింతలై తిరిగి రాకపోతే, మళ్లీ ఇంకో చిత్రం పుట్టడం అసంభవం—మొదట తయారైనది ఎంతటి 'కళ ఖండ' మైనాసరే

అందువల్ల, వర్తమాన పరిస్థితులలో, ఉన్న విపణుల అవధులదృష్ట్యా, అధిక సంఖ్యాకులను ఆకర్షించడం ప్రధానంగా చిత్రాలు నిర్మిస్తున్నారు నిజానికి పూర్వం కూడా ఇదే ప్రాతిపదిక

ఇలా గరిష్ఠసామాన్య గుణిజాన్ని నిర్ధారణ చేసి దాని ప్రకారం అన్ని హంగులూ సమ



సాధనావారి "సంకల్పం"లో ఆర్. నాగేశ్వరరావు, రమణారెడ్డి

పూర్చాలని నిర్మాత, పెట్టుబడిదారులూ పట్టు పడతారు. దర్శకుడి దృష్టి కళ వేపుపోతుంది. మొహమాట పడుతూనే అతడు, తదితర కళాకారులూ అటు లాగుతారు. డబ్బు పెట్టిన వాళ్లు ఇటు లాగుతారు.

ఇలా ఈ బలాబలాలు తులతూగినమీదట నిలిచే స్థానమే ఆయా చలన చిత్రాలస్థాయి అవుతుంది. తులనిర్మాతలవైపు మొగ్గితే, చిత్రం ఆర్థికంగా ఘనవిజయం సాధిస్తుందని ఘంటా పథంగా చెప్పలేముగాని, కళాకారుడి వైపు తూగితేమటుకు జనరంజకం కాగలదని చెప్ప వచ్చు. అలా అయినప్పుడు ఆ చిత్రం ధన సాధనికూడా అవుతున్న సందర్భాలుగూడా ఉన్నాయి.

ఇలా ఇటు మంచి స్థాయి, అటు ధనం సాధించగల ఉభయ తారకమంత్రం ఇప్పు డవసరం.

మిగతా దేశాల, ప్రాంతాల సంగతి ఎలా ఉన్నా మనమటుకు మనకు, అవసరం అని పిస్తుంది.

ఎందుకంటే, అనుకరణాల ప్రభావం క్రమంగా ఎక్కువై, నిన్నటి చిత్రానికీ, నేటి చిత్రానికీ తేడా క్రమంగా తగ్గుతున్నట్లు కనబడుతుంది. ఇది ఇలా కొనసాగితే చిత్ర నిర్మాణం "ముఖ్య ప్రయోజనమే" దెబ్బతినే ప్రమాదం వుంది. అందుకు నిదర్శనాలు అందరికీ కనబడుతూనే ఉన్నాయి ★

## బాల చలనచిత్ర సంస్థ కొత్త చిత్రం

బాల చలనచిత్రసంస్థవారి తృతీయచిత్రం "స్కాట్ కాంప్"కు, ఆ సంఘం అధ్య క్షుడు పండిట్ హృదయనాథ్ కుంజ్రూ జూన్ మూడో వారంలో ప్రారంభోత్సవం జరిపారు. బాలభటోద్యమాన్ని చిత్రించే ఈ చిత్రానికి కిదార్ శర్మ దర్శకుడు. దీనిని డార్జిలింగ్ పరిసరాలలో చిత్రిస్తారు. దాదాపు 120 మంది బాలబాలికలు పాల్గొం టున్నారు. ఈ సంస్థ ద్వితీయ-చిత్రం "జల్ దీప్"లో నటించిన అశోక్ శర్మ, దూబేలు ఇందులో నటిస్తున్నారు.

ఈ చిత్రం నిడివి ఏడు వేల అడుగుల లోపు ఉంటుంది. ఇందులోనే బాలభటో ద్యమానికి సంబంధించిన పాటలు రెండు పొందుపరుస్తారు. నవంబరునాటికి నిర్మాణం పూర్తి కాగలదనుకొంటున్నారు. ★



అశ్వరాజ్ వారి "వినాయకచవితి" లో జమున.

ఫోటో: ఎన్. గిరిధర్.

సినిమా వార్తలు:

## ★ సెల్వకోటివారి 'రత్నకిరీటం' ★

సెల్వకోటీ పిక్చర్స్‌వారి ద్వితీయచిత్రం "రత్నకిరీటం" నిర్మాణం జూన్ 30 న రేవతీ స్టుడియోలో ఆరంభమైంది. నవయుగా ఫిలింస్ అధిపతి శ్రీ శ్రీనివాసరావు కామెరా స్విచ్ ఆన్ చేసి ప్రారంభోత్సవం జరిపారు. ప్రారంభోత్సవ పూజకు శ్రీయుతులు పి. పిల్లయ్య, బి. ఎస్. రంగా, రేలంగి వెంకటరామయ్య, గుమ్మడి వెంకటేశ్వర రావు, ఎస్. వి. రంగారావు పలువురు తమిళ దర్శక నిర్మాతలూ వచ్చారు.

నిర్మాతలలో ఒకరైన శ్రీ కోటీశ్వరరావు అతిథులకు స్వాగతమిచ్చి ఫలపుష్పాదులతో సత్కరించారు

ఈయన ఇతఃపూర్వం భరణీస్టుడియోలో సౌండ్ ఇంజనీరుగా ఉంటూ దాదాపు వంద చిత్రాలకు పని చేసి అనుభవం, పేరూ గడించుకున్నారు. ఈ సంస్థలో రెండవ భాగస్వామికూడా టెక్నిషియనే: ఆయన కామెరామన్ సెల్వరాజ్.

ఇలా టెక్నిషియన్లు కలసి చిత్రనిర్మా ణానికి పూనుకోవడం అత్యంత ప్రశంసనీయ మని, ఉత్సవ ఆరంభంలో ప్రసంగించిన చలన చిత్ర దర్శకుడు శ్రీ కె. సుబ్రహ్మణ్యం అన్నారు. వీరి ఈ ప్రయత్నం సత్ఫలదాయ కం కావాలని ఆశిస్తున్నామన్నారు.

అనంతరం శ్రీ శ్రీనివాసరావు కామెరా స్విచ్ ఆన్ చేశారు. నటుడు శ్రీ ఎం. నాగే

# సినిమా వార్తలు

శ్వరరావు 'క్లాప్' కొట్టి, నిర్మాతలకు శుభాకాంక్షలు తెలియచేశారు.

తరువాత చిత్రం 'షూటింగ్' జరిగింది. తొలి సన్నివేశాలలో సావిత్రి, కన్నాంబ, నాగయ్య పాల్గొన్నారు.

విధ్యుక్తధర్మ నిర్వహణలో, ప్రమాదాలకూ, అరిష్టాలకూ జంకక, ప్రభు సేవకోసం ప్రాణాలర్పించ సిద్ధపడిన ఒక సేవాని కథ ఈ చిత్రానికి ప్రాతిపదిక. ఆభూమికను నాగయ్య నిర్వహిస్తున్నారు. ఆయన భార్యగా కన్నాంబ నటిస్తోంది.

ఈ చిత్రం తెలుగు తమిళ భాషలలో తయారవుతోంది. తెలుగు చిత్రానికి రచయిత శ్రీ రావూరి సత్యనారాయణ.

సిల్వకోటీవారి తొలి చిత్రం "స్వయం ప్రభ"కు సంగీతం సమకూర్చిన శ్రీ రమేష్ నాయుడు దీనికికూడా సంగీత దర్శకత్వం నిర్వహిస్తున్నారు.

దర్శకుడు శ్రీ డి. యోగానంద్.

## 'ప్యాసా'

గురుదత్ ఫిలింస్‌వారి హిందీ చిత్రం 'ప్యాసా'ను శ్రీ నేషనల్ ఆర్ట్ పిక్చర్స్ వారు త్వరలోనే ఆంధ్రలో విడుదల చేస్తున్నారు. ఉత్తర భారతంలోను, మద్రాసులో ప్రజాదరణ పొందిన ఈ చిత్రంలో గురుదత్, వహీదారెహమాన్. మలాసిన్హా, జానీ వాకర్ నటించారు. సంగీతం ఎస్. డి. బర్మన్. దర్శకత్వం గురుదత్.

# ★ చలనచిత్ర పరిశ్రమ ప్రగతి ★

దక్షిణ భారత చలనచిత్ర వాణిజ్యమండలి వార్షిక సర్వసభ్య సమావేశం జూన్ 16 న జరిగింది.

గత 12 మాసాలుగా పరిశ్రమ క్రమాభివృద్ధిని సమీక్షిస్తూ అంతకు క్రితం సంవత్సరంకన్న ఈ ఏడాది పరిశ్రమ, వ్యాపారం లాభదాయకంగా సాగినట్లు కార్యదర్శి నివేదికలో తెలియచేశారు. ఈ 12 మాసాలలో పరిశ్రమ పురోభివృద్ధికి ఫిలిం చేంబర్ సాగించినకృషిని, సాధించిన ఫలితాలను ఇందులో వివరించారు. ఇందులో ప్రధాన విశేషాలు :

ఈ సంస్థలో సభ్యుల సంఖ్య 296 నుండి 846 కు పెరిగింది


నిర్మించిన చిత్రాల సంఖ్య 96 నుండి 100 కు పెరిగింది. ఇన్ని చిత్రాలు తయారు కావటంలో వీటన్నిటికీ పేర్లు పెట్టడం ఒక సమస్య అయింది అందువల్ల ఒకే పేరు కోసం ఇద్దరు ముగ్గురు పోటీలు పడడం, బాగున్న పేరును అనుకరిస్తూ కొత్తపేరు తయారుచేయడం జరిగింది. ఈ పోటీలు నివారించడంకోసం పేర్లను ఫిలిం చేంబరు కార్యాలయంలో రిజిస్టరు చేసే పద్ధతి ప్రవేశపెట్టడం జరిగింది. దీన్ని ఎవరైనా త్రోసిరాజంటే చేసేదేం లేదు కాని, నిర్మాతలందరూ ఇందులో సభ్యులే అయినందువల్ల, ఈ పద్ధతికి నైతికమైన బలం ఉంది అందువల్ల పోటీలూ పేచీలు, తగిపోతాయని ఆశించవచ్చు.

మరో విశేషం, సెన్సారు ఆమోదం పొందడంలో ఏనిర్మాతకూ పెద్ద ఇబ్బందులూ, పేచీలూ వచ్చిపడలేదు


ఇది ఈప్రాంతపు చిత్రాలు మంచి లక్షణాలకు, మంచి అభిరుచులకూ నిదర్శనం అనవచ్చు

ప్రభుత్వం ఉత్తమ చిత్రాలను ఎన్నిక చేసి బహుమతులిచ్చినపుడు, ఇటుపై వాటికి ఆర్థికంగా కూడా తగిన బహుమతులు ఇచ్చి సత్కరించాలని ఆలోచిస్తోంది. ఇది అమలులోకి వస్తే, మంచి చిత్రాల నిర్మాణానికి నిర్మాతలను ప్రోత్సహించినట్లవుతుంది.

రాబడిపన్ను విధింపు వ్యవహారాలలో రాబడి నిర్ణయ విధానాలు, వాటికి పన్ను లెక్కకట్టినపుడు మాఫీలు ఇచ్చే పద్ధతులూ పునః పరిశీలన జరిపి మార్పులు తేవాలని ఫిలిం విచారణ సంఘం, పన్ను విధింపు విచారణ సంఘం కూడా సూచించినా ప్రభుత్వం ఇంకా ఈ విషయమై ఏ చర్యా తీసుకోలేదు. వాణిజ్యమండలి ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నది. అలాగే డాక్యుమెంటరీ వార్తాచిత్రాల ప్రదర్శనపై ప్రభుత్వంవసూలుచేస్తున్న రుసుము(మద్రాసు



బిమల్‌రాయ్ క్రొత్తచిత్రం "మధుమతి" లో వైజయంతిమాల, దిలీప్‌కుమార్.



పారమౌంట్ వారి "హాలీవుడ్ ఆర్ బస్ట్" చిత్రంలో జెరీలూయిస్ డీన్‌మార్టిన్,
(కుక్క సంగతి సరేసరి)

రాష్ట్రింలో) ను తగ్గింపచేయడానికికూడా వాణిజ్యమండలి ప్రయత్నాలు సాగిస్తోంది.

కార్యదర్శి నివేదికను ఆమోదించిన అనంతరం సభవారు కొత్త సంవత్సరానికి అధ్యక్షు కార్యదర్శులను, కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

అధ్యక్షుడు: శ్రీ టి. ఆర్. సుందరం (మాడర్న్ థియేటర్స్). ఉపాధ్యక్షుడు: శ్రీ ఎ. రామయ్య. కార్యదర్శులు: శ్రీ పి. రామకృష్ణ (భరణి), డి. రామానుజం. కోశాధికారి శ్రీ కె. ఎస్. నారాయణన్ అయ్యంగార్ (నారాయణన్ కంపెనీ). సభ్యులు: శ్రీయుతులు ఎ. వి. మెయ్యప్పన్ (ఎ.వి.ఎం), ఎస్. ఎం. శ్రీరాములునాయుడు (పక్షిరాజా ఫిలింస్), ఎస్. ఎస్. వాసన్ (జెమిని), బి. నాగిరెడ్డి (విజయ), బి. ఎన్. రెడ్డి (వాహినీ), సుందర్‌లాల్ నహాతా (రాజశ్రీ), లక్ష్మీనారాయణన్, వి. సి. సుబ్బరామన్, వీరప్పన్, వి. కృష్ణస్వామి నాయుడు, వి. శ్రీనివాసన్, టి. అశ్వత్థ నారాయణ, రామచంద్ర అయ్యర్, వి. సుబ్రహ్మణ్య అయ్యర్, టి. వెంకటపతిరావు (సన్ థియేటర్-మద్రాసు), కె. సుబ్రహ్మణ్యం, కె. వెంకటరామన్, వి. శ్రీనివాస రాఘవన్, మద్రాసులోని కొడాక్ సంస్థ ప్రతినిధి వెల్లూరు ఫిలిం డిస్ట్రిబ్యూటర్ల, ఎగ్జిబిటర్ల ప్రతినిధి. ★

# బెర్లిన్ ఉత్సవంలో భారత చిత్రానికి ప్రశంస

జూన్ 21 న ఆరంభమైన బెర్లిన్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో 42 దేశాలు పాల్గొంటున్నాయి. మరి పది దేశాల ప్రతినిధులు పరిశీలకులుగా హాజరయ్యారు.

ఇక్కడ 32 కథా ప్రధాన-చిత్రాలు, ఆరు డాక్యుమెంటరీలు, 58 చిన్న చిత్రాలూ ప్రదర్శించారు. పశ్చిమ బెర్లిన్‌నగరం మేయరు ఆటో సూర్ ప్రారంభోత్సవం జరిపారు.

భారతదేశం పంపిన చిత్రాలలో బెంగాలీ చిత్రం "కాబూలీవాలా" సర్వత్రా ప్రశంస లందుకొంది. ఈ చిత్రం చూడడానికి జర్మన్ ప్రముఖులు చాలమంది వచ్చారు. ప్రదర్శన పూర్తికాగానే వారంతా కరతాళధ్వనులు చేశారు. ప్రశంస వెల్లడించారు. దర్శకుడు తపన్‌సిన్హా, నిర్మాత అసిత్ చౌదరి, కాబూలీ వాలా భూమిక నిర్వహించిన ఛబీబిశ్వాస్, నటి అరుంధతీ ముఖర్జీలను, నిర్వాహకులు వేదిక పైకి తీసుకువచ్చి పరిచయం చేయగానే ప్రేక్షకులంతా కొన్ని నిముషాలసేపు కరతాళ ధ్వనులుచేసి ప్రశంస వెల్లడించారు.

ఆ మధ్యాహ్నమే భారత ప్రతినిధి శ్రీ దిలీప్ కొఠారీ విలేఖరులగోష్ఠి జరిపి మనదేశపు చలన-చిత్రపరిశ్రమస్థితిగతులను వివరించారు. జూన్ 28 వ తేదీనాడు స్థానికవార్తా పత్రికలన్నీ మన పరిశ్రమగురించీ చిత్రాలగురించి



అశోక్ పిక్చర్స్ వారి "రాగిణి"లో పద్మిని, అశోక్‌కుమార్

# బెర్లిన్ ఉత్సవంలో భారత చిత్రానికి ప్రశంస

ప్రశంసాపూర్వకమైన వ్యాసాలు ప్రచురించాయి.

## యూరప్‌లో మార్కెట్

"కాబూలీవాలా"-చిత్రం చూచినమీదట అక్కడికివచ్చిన వివిధదేశాల చిత్రనిర్మాతలూ డిస్ట్రిబ్యూటరూకూడా, ఆ చిత్రాన్ని యూరప్‌లో విడుదలచేస్తే బహుళ జనాదరణ పొందగలదని విశ్వాసం ప్రకటించారు. ఇటువంటిచిత్రాలకు ఆ దేశాలలో మంచి మార్కెట్ తప్పక లభించగలదని అన్నారు.

అచ్చులో పదిపుటలకుమించని 'కాబూలీవాలా' కథను, దర్శకుడు, ఈ చలనచిత్రంలో చెప్పినపద్ధతి మనదేశంలో సర్వత్రా ప్రశంసలందుకుంది. 1956 వ సంవత్సరానికి దీన్ని ఉత్తమ భారతీయ చిత్రంగా ఎన్నికచేసి, రాష్ట్రపతి సువర్ణపతకాన్ని ఇచ్చి గౌరవించడం విదితమే. ★



వరసూవారి "బీతే దిన్"లో నిమ్మి, రాధాకృష్ణ.



చందమామావారి "దొంగల్లోదొర" లో జమున, సూర్యకాంత, రేలంగి, గుమ్మడి.



ఆర్. కె, ఫిలింస్‌వారి "అబ్ దిల్లీ దూర్ నహీఁ"లో మోతీలాల్ సుమిత్ర

# అణుశక్తిపై డిస్నీ కార్టూన్ చిత్రం

అత్యంత క్లిష్టమైన విషయాలనుకూడా అతిసులభంగా తెలిసేలా చెప్పగల 'చలచిత్ర'కారుడు వాల్ట్ డిస్నీ ఈసారి అణుశక్తి మంచి చెడ్డలు తెలియ చెబుతూ ఒక కార్టూన్ చిత్రం నిర్మించాడు.

రెండువేల ఏళ్లనాడు గ్రీకువిజ్ఞానులకు ఈ అణువు గురించి తట్టిన ఊహాలదగ్గరనుండి, బ్రహ్మాండమంత సమస్యగా తయారైన నేటి 'అణువు'వరకూ జరిగినకథను ఇందులో కార్టూన్లద్వారా చిత్రించారు.

నిప్పురా జేసుకున్నాక దాన్ని వంటచేసుకోడానికీ వాడచ్చు; ఇల్లు తగలబెట్టుకోడానికీ ఉపయోగించవచ్చు ఏం చేసినా నిప్పుకేం అభ్యంతరం ఉండదు. చెప్పినట్టు వింటుంది

"అణుశక్తి అంతే" నన్న సత్యాన్ని డిస్నీ తన మార్గంలో ఉద్ఘాటించారు ఆపైన, దీన్ని మంచిమార్గంలో ఉపయోగిస్తే ఈ శక్తి ఎంతసేవ చేస్తుందో చూపించారు. అందుకని ఈ చిత్రానికి "మన నెచ్చెలి, అణువు" అని పేరు పెట్టారు

దీనికి ఆద్యంతం, శాస్త్రజ్ఞులు ఆమోదించిన వ్యాఖ్యను జోడించి దీన్ని తేలిక భాషలో వినిపించారు.

నాలుగువేల అడుగుల పొడుగున్న ఈవర్ణ చిత్రం ఇటీవల లండన్‌లో పార్లమెంటు సభ్యులకు చూపించారు త్వరలోనే మన దేశంరాగలదని తెలుస్తోంది. ★

## 'నీరొలాక్' రంగుల సంస్థకు కొత్తపేరు

రంగుల పరిశ్రమ రంగంలో ప్రసిద్ధికెక్కిన నీరొలాక్ రంగులను ఉత్పత్తిచేసే "గుడ్‌లాస్, వాల్ ప్రైవేట్ లిమిటెడ్" సంస్థకు ఇటీవల పేరు మార్చారు. ఇప్పుడు దీనిపేరు "గుడ్‌లాస్ నీరొలాక్ పెయింట్స్ ప్రైవేట్ లిమిటెడ్" దీనికి 'మానేజింగ్ ఏజంట్స్' గా వ్యవహరించే సంస్థమాత్రం, ఇంతవరకూ ఉంటున్న 'ఫోర్‌బ్స్, ఫోర్‌బ్స్ కాంప్‌బెల్'కంపెనీయే ఇది గుడ్‌లాస్‌వాల్ గ్రూప్ కంపెనీలలో ఒకటి.

మనదేశపు వాతావరణానికి అనుగుణంగా తయారవుతున్నవి నీరొలాక్ రంగులు. వీటితో, ఈ పేరుతో మరింత సన్నిహితం కావాలన్న సంకల్పంవల్లనే 'గుడ్‌లాస్ వాల్' కంపెనీపేరును 'గుడ్‌లాస్ నీరొలాక్'గా మార్చడం జరిగింది. మన దేశం రంగుల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడానికై ఈ సంస్థ చేసే దోహదానికి ఇది సూచన ప్రాయమైనది

వీరు రంగులు ఉత్పత్తి చేయడంతోపాటు, దేశంలోని రంగుల పరిశ్రమకు కావలసిన ముడిసరుకును కూడా సరఫరా చేస్తున్నారు.

బ్రిటన్‌లో నూరేళ్ళ అనుభవం, గడించి, ఇక్కడ పాతిక సంవత్సరాలుగా కృషి సాగిస్తూ భారతీయ టెక్నిషియన్లకు శిక్షణ ఇస్తున్న ఈ సంస్థ ఈ రంగుల పరిశ్రమ రంగంలో మన దేశం స్వయం సమృద్ధి సాధించడానికి దోహదం చేస్తున్నది ★

## "రాజమకుటం"

వాహినీవారు "రాజమకుటం" అనే జానపద చిత్రాన్ని భారీయెత్తున నిర్మించ నిశ్చయించారు దర్శకుడు శ్రీ బి యన్ రెడ్డి ఈవిషయం ప్రకటిస్తూ, ఇందులో సావిత్రి, రామారావు, రేలంగి ముఖ్యభూమికలు నిర్వహిస్తారని తెలియచేశారు.

డి వి నరసరాజు, పాలగుమ్మి పద్మరాజు ఈ చిత్రానికి మాటలూ, పాటలూ వ్రాస్తున్నారని ఆయన చెప్పారు. ★

## ఉప్పు ఉపయోగం

(6-వ పేజీ తరువాయి)

తాము. కొందరు శ్రోత్రియులు ఎందుకో తెలియదుగాని ఉప్పును ఉప్పుఅనరు "బుట్టలోది" అంటారు మరికొందరు పరమచాందసంగా "లవణం" అంటారు. మరికొందరు "రుచి" అంటారు. శుభ్రంగా ఉప్పుఅని అచ్చ తెలుగులో అన్నంతఉత్తమం మరొకటి లేదు అలా అనడానికి బిడియపడే వారికి ఉప్పుబదులు గోమయం వడ్డించబడే ప్రమాదంఉందని మొదటనే మనవిచేయడమైనది. ★

## అదో రకం ఫాషన్

(35-వ పేజీ తరువాయి)

లాటిది దానిలో హోలాహాలాన్నికూడా అణిచేసుకోవాలి-దావాగ్నిని సైతం ఇముడ్చుకోవాలి పైకి పొంగకూడదు అందులోనే వుంది అందం - ఆనంద మొహంలో నవ్వు మాటల్లో అమృతం ఆడదానికి సాటిలేని అలంకరణలు-ఆభూషణాలు ఏవో లేవనీ - ఎవరికో వున్నాయనీ—అవతలివాళ్లు సుఖపడుతున్నారని, పనిచెయ్యాల్సివచ్చేనే అనీ ఇలాటి పనికిమాలిన చెత్త సమస్యల్ని మనస్సులో పెట్టుకు సహజ సౌందర్యానికి చిహ్నమైన చిరునవ్వును తరిమెయ్య వద్దు సాధ్యమైనంతవరకు నలుగురిలో కలిసిమెలసి తిరుగుతూ నవ్వుతూ హాయిగా జీవితాన్ని సాగించటంలోనే వుంది గొప్పతనం పోయిన నిముషం మళ్లీ రాదు. వచ్చేనిముషాన్ని వృధా చెయ్యకూడదు. సంతృప్తిగానవ్వుతూ, సంతోషంగా కాలంగడుపుతూ, అవతలివాళ్లను కవ్వించి నవ్విస్తూ సాగించే జీవితంలోనేవుంది అందం, ఆనంద కూడా అలా లేనివాళ్లజీవితంలో అడుగడుగునా ఏడుపూ-అపకృతి—దుఃఖం అంతులేని ఆరాటమూ రగులుకుపోతూ దాని తాలూకు క్రీనీడ వాళ్ల మొహాల్నికూడా కప్పేస్తుంటుందేమో! ★

## ఆడపిల్లల పెంపకం

(37-వ పేజీ తరువాయి)

అందరు బుగలు నొక్కుకుంటారు సరోజినీ దేవి కుమార్తె శ్రీమతి పద్మజా నాయుడు పశ్చిమ బెంగాల్ గవర్నరు గిరీ చెలాయిస్తోంది పెళ్ళికాకపోతే మాత్రం ఆవిడకేమి లోటువచ్చింది? మనదేశంలో ఇదొక విడ్డూర మయిందిగాని పాశ్చాత్యదేశాలలో స్త్రీలు చాలామంది ఆజన్మాంతము అవివాహితలుగానే ఉండిపోతారట!

మనదేశంలో మాత్రం అలా ఉండిపోతే తప్పేమిటి? మన కుటుంబాలలో తల్లిదండ్రులు పెళ్ళిళ్ళకోసమని ఇన్ని అగచాట్లు పడడం ఎందుకు? ఇన్ని అగచాట్లుపడి పెళ్ళిళ్ళు చేస్తేమాత్రం అరిచేతిలో వైకుంఠం ఒరిగిపోతూంది గనకనా?

ఏదో వేలంవెర్రిగా ఆలోచించడం మూలాన్నే మనం ఇన్ని అగచాట్లు పడవలసి వస్తూంది

చూడగా చూడగా నామట్టుకు నాకీ స్వాతంత్ర్యమే మంచిమార్గమని తోచింది. మనసులో ఉన్నది కొస్తా దాచకుండా ధైర్యంగా రాశాను. ★

## పొద్దునే లేచి ఎవరి మొహం చూశానో!

[31 వ పేజి తరువాయి]

ఆమె ఏంచెప్పిందో? . ఇప్పు డడిగిన తర్వాత - అతనికి స్పృహలోకివచ్చి — "అన్నా. తేలేదుసుమా" అని అన్నాడు.

"ఏం! డబ్బు తీసుకెళ్లేర! అయినా నాకెందుకు తెస్తారు లెండి! గుమ్మం దాటగానే నేను ఒకర్తెని వున్నానని, మీకు జ్ఞాపకం వుంటుందా? ఎన్నడూ నోరు విడిచి, అడగనే అడగను అడిగితే ముచ్చట ఇలాతీరుతుంది నెల్లాళ్ళయింది, మీ కర్చులు మీకు తప్పకూడదు ఇంతకీ ఏమీ అడగనుకాబట్టి! మరోలాటిదయితే మీకు బావుండును "అని ఏకంగా ఒక్కసారి వల్లించింది కమల తనగోల, చెప్పేదో వినకండ

జరిగింది శాంతంగా చెబుదామను కున్నాడుగాని, ఇది విని కోపంరాక తప్పలేదు చంద్రంకి

"ఎందుకలా అరుస్తావు! చెప్పేది వినకండా!" అని అన్నాడు.

"వినక్కర్లేదు! నాకవసరంలేదు! మీ డబ్బు! మీ ఇష్టం నాకేం అధికారం వుందని! అడిగేందుకు? ఏదో చాకిరీ చేస్తున్నాగదా! ఇంత తిండి పడేస్తారు అది కాదంటే అలాగే పడివుంటాం! అంతకన్నా . ఏంచేయగలం! ఏమనడానికీ వీలా?" ఇలాగంది కమల.

'సోర్మ్యయ్! ఎందుకలా వదలకండా, ఏమిటేమిటో కలిపించుగొని అంటావు ఆ డబ్బు నాపాలిటికి కొందరు తగిలి తినేశారు తెద్దామనే అనుకున్నాను, ఆ డబ్బుకొస్త అయిపోయింది అదృష్టం అలావుంది కొంటాను—కొంచంఆలస్యం అయినంతమాత్రంలో . ఎంత ముట్టుకు వచ్చింది . ఛీ! వెధవముఖం — ఎవరిది చూశానో—లేచినదగ్గిర్నుండి ఒకదగ్గిరా శాంతంలేదు . మనస్థిమితంలేదు విసుగెత్తిపోతూంది . అని తలపట్టుగొని, మంచంమీంచిలేస్తూ అన్నాడు

కమల కొంచం భయపడి తగ్గిపోయింది—

"అవును! మీకు అలాగే వుంటుంది నేనెవరిముఖం చూశానో ఇవాళ లేవగానే-అని నేననుకుంటున్నాను! లేకపోతే లేవగానే కొత్తచీర తగలడిపోయింది ఇప్పుడిలా అనవసరంగా జట్టీ-నానామాటలు వచ్చాయి, తెస్తారని ఆశపడ్డది, తేలేదు ఒకొక్కక్కరిమొహం లేవగానే చూస్తే ఇలా జరక్కతప్పదు పోనీ లెండి ఇంక పూరుకోండి ఇక్కడితో . ఇకేం జరక్కండా వుంటే, మీరు తెచ్చి వంత!" అని కమల అనేసి పూరుకుంది .. ఆమెకూడా ఆఖరికి తన మనసులోవున్న అనుమానాన్ని పైకి చెప్పేసి పూరుకుంది.

'నువ్వూ! అలాగే అనుకుంటున్నావా?' అని ఆశ్చర్యంతో కూలబడ్డాడు చంద్రం-అక్కడితో అందరూ ఆరోజుకి పడుకున్నారు తిరిగి ఉదయం లేవడానికి.


ఒకరినొకరు నూటిగా నువ్వంటే నువ్వు . అని చెప్పకోలేకపోయినా తమలో బాధిస్తున్న అనుమానాలని, లేక . పైవారికి వారివల్ల బాధపడుతున్నట్టు తెలియ జెప్పాలన్న కాంక్షని మనసుల్లో వుంచుకోలేక ఏదో విధంగా మాటల్లో బయటకి వెల్లడించేశారు. కాని ఎవరికి వారికే తెలుసు ఎవరెవర్ని చూసుకున్నారో!

తార్కాణాలు అందుకు నిదర్శనంగా, జరుగుతున్నాయని భావించేరు అయితే . అది ఆముఖం చూసిన వేళావిశేషంవల్లనే జరుగుతున్నాయా? లేక, అలాటివి రోజూ జరుగుతున్నా .. కారణం, అనుమానం ఇది దీనినించే అన్న భావన .. మనసులో లేక, వాటిమీద గుర్తువుంచక పోడంచేత . తెలియడం లేదా? ఇవేళ ఆముఖం చూడబట్టే ఇవన్నీ జరగక తప్పడంలేదు అని ఊహిస్తూ అదే ప్రతి నిముషం నెమరు వేసుగుంటూండడంవల్ల ఏ చిన్నవిషయం విరుద్ధంగా జరిగినా, అది అందువల్లే అని అనుమానించటం జరుగుతూంది యిది విచిత్రమయిన మానవ మనస్తత్వం.

ఈవిధంగా ప్రతిఒక్కరూ ఎదుటి వారివల్లే ఈనష్టాలన్ని కలిగాయని అనుకోడం ఎంత సహజమో, వారిని చూసిన ఎదుటివారు కూడా అలాగే అనుకోడం అంత సహజమూను అయితే నిజం ఏమిటి? అందరూ ఒకటే ఎవరిని చూసినా జరిగేది అంతే కదా? నిన్ను చూసి వాడు అనుకుంటే వాడిని చూసి నువ్వు అనుకుంటావు. అలా అనుకోడమేగాని కొంచం ఆలోచిస్తే . జరిగే విషయాలన్నిటికినీ మన తెలివితక్కువే కారణంగాని, ఇలాటి నమ్మకాలేమీ కావేమో అనిపిస్తుంది కాని అలా అనుకోడాన్ని ఎవరూ వారించలేరు ,అదే మానవుల్లో లోపం. అంచేత ఎదురుగుండా పెద్ద అద్దం పెట్టుగొని లేవగానే మీ ముఖం మీరే చూసుకుంటూండండి! . ★



Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



శ్రీ కాళహస్తీశ్వరాలయగోపురం

Regd M.No4479. Andhra Patrika Illustrated Weekly